ఆంధ్రజ్యోతి 7 ప్రకాశం
శుక్రవారం 7, మార్చి 2025



వేలానికి సిద్ధం చేస్తున్న కార్పొరేషన్‌కు చెందిన ఐడీఎస్‌ఎంటీ స్థలాలు

ఆదాయ మార్గాలపై అన్వేషణ..!

లోటు బడ్జెట్ నుంచి బయటపడడంతో పాటు అభివృద్ధి పనులకు నిధుల కోసం.. ఒంగోలు నగరంలో ఆదాయ మార్గాలపై కార్పొరేషన్ యంత్రాంగం దృష్టిసారించింది. కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న కోట్ల రూపాయల విలువైన కార్పొరేషన్ ఆస్తులను ఆదాయ మార్గాలుగా మార్చుకునే ప్రయత్నాలు చేపట్టింది. అందులో భాగంగా హౌసింగ్ బోర్డు కాలనీలోని ఐడీఎస్‌ఎంటీ స్థలాలను వినియోగంలోకి తీసుకొస్తోంది. వాటిని వేలం వేసే చర్యలను అధికారులు వేగవంతం చేశారు. అలాగే కొత్త కూరగాయల మార్కెట్‌లోని షాపులను అద్దెకు వేలం వేశారు. వీటితోపాటు పన్ను మొండి బకాయిల వసూళ్లకు దిగారు. అధికమొత్తం పెండింగ్ ఉన్న భవనాలకు నోటీసులు జారీ చేయడంతోపాటు, తప్పనిసరైతే కొళాయి కనెక్షన్ తొలగిస్తున్నారు. మొత్తంగా పన్నుల వసూళ్లే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి

ఒంగోలు నగరంలో నిరుపయోగంగా ఉన్న కార్పొరేషన్ ఆస్తులను వినియోగంలోకి తెచ్చే ప్రయత్నాలను కార్పొరేషన్ యంత్రాంగం చేపట్టింది. అందులో భాగంగా హౌసింగ్ బోర్డు కాలనీలోని ఐడీఎస్‌ఎంటీ స్థలాల్లో సుమారు 70 ప్లాట్‌లు ఖాళీగా ఉండగా, వాటిని వేలం వేసి రూ.30 కోట్లు ఆదాయాన్ని తీసుకొచ్చే ఆలోచనపై దృష్టిసారించారు. అలాగే దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో ఐదేళ్ల నుంచి ఖాళీగా ఉన్న షాపులను అద్దెకు వేలం వేసి, వినియోగంలోకి తీసుకొచ్చారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రూ.12 కోట్లు అద్దె వసూళ్లకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వీటితో పాటు నూరుశాతం పన్నుల వసూళ్ల కోసం ఇప్పటికే సచివాలయ సెక్రటరీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వసూళ్లపై సీరియస్‌గా దృష్టిసారించారు. దీర్ఘకాలికంగా అధిక మొత్తం పెండింగ్ ఉన్న బకాయిదారులకు నోటీసులు జారీచేయడంతోపాటు, తప్పనిసరైతే తాగునీటి కొళాయి కనెక్షన్ తొలగించి పన్నుల వసూళ్లే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించారు.

- అప్పుల నుంచి ఆర్థిక బలోపేతానికి చర్యలు
- ఖాళీస్థలాలు వినియోగం.. షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు
- కార్పొరేషన్ ఆస్తులను ఆదాయ మార్గాలుగా మార్చే ప్రయత్నం
- ప్రత్యేక ప్రణాళిక రూపొందించిన అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు కార్పొరేషన్ వార్షిక బడ్జెట్ రూ.210 కోట్లు, ఖర్చులు రూ.197 కోట్లు, ఆపై అభివృద్ధి పనులకు చెల్లించాల్సిన నిధులు మరికొన్ని కోట్లు. దీంతో నగర పాలక సంస్థ లోటు బడ్జెట్, అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతోంది. దాని నుంచి బయటపడేందుకు మున్సిపల్ యంత్రాంగం ఆదాయ మార్గాలపై అన్వేషణ ప్రారంభించింది. ఇప్పటికే సుమారు రూ.100 కోట్ల మేర చెల్లించాల్సిన బకాయిలు ఉండగా, ప్రతిపాదించిన ప్రగతి పనులు చేపట్టడానికి రూ.500 కోట్లు అవసరమని అంచనాకు వచ్చారు. దీంతో కార్పొరేషన్ ఆస్తులను గుర్తించి, వాటిని వినియోగంలోకి తీసుకొచ్చే దిశగా దృష్టిసారించారు. ఈ మేరకు కమిషనరు డాక్టర్ కే వెంకటేశ్వరరావు వాటి తాలూకు వివరాలను సేకరించారు. కార్పొరేషన్ ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి. ఆక్రమణల్లో ఎన్ని? కోర్టు కేసుల్లో ఎన్ని? ఖాళీస్థలాలు ఎన్ని అనే వివరాలను టౌన్‌ప్లానింగ్ అధికారుల నుంచి నివేదిక కోరారు. అలానే నగరంలో కార్పొరేషన్ కాంప్లెక్స్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయి. ఎన్నేళ్ల నుంచి అద్దెలు చెల్లించని వారు ఉన్నారు. నెలవారీ అద్దె ఎంత వంటి వివరాలను రెవెన్యూ విభాగం నుంచి అడిగి తెలుసుకున్నారు.

వినియోగంలోకి ఖాళీ స్థలాలు..

నగరంలోని పలుప్రాంతాల్లో కార్పొరేషన్‌కు చెందిన ఖాళీస్థలాలు, శిథిలావస్థకు చేరిన భవనాలు ఉండగా, వాటిలో కొన్ని కోర్టు కేసుల్లో ఉన్నాయి. మరికొన్ని కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉండగా, వాటిని ఆదాయ వనరులుగా

మిగతా 8లో...

ఆక్రమణ స్థలాల పరిస్థితో..?




ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో పలుచోట్ల ఉన్న స్థలాలను కొందరు ఆక్రమించి ఏళ్లతరబడి యథేచ్ఛగా అనుభవిస్తుండగా, నిర్మాణాలను తొలగించి, స్వాధీనం చేసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. పైగా కబ్జాదారులు కోర్టుకెక్కారు. అందుకు ప్రతిగా పోరాడాల్సిన యంత్రాంగం ఇన్నాళ్ల కనీసం కదలకపోవడంతో ఆస్తులన్నీ పరాధీనంలో ఉన్నాయి. ఒంగోలు నగరంలో వందల సంఖ్యలో రహదారులు, ఖాళీస్థలాల్లో శాశ్వతంగా ఆక్రమణలు జరిగినట్లు అధికారుల వద్ద ఆధారాలు ఉన్నాయి. అలాగే చిరు వ్యాపారాల నిమిత్తం మరెన్నో తాత్కాలిక ఆక్రమణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ వారు కనీసం రక్షణ కంచెలు వేయడానికి వెనకడుగు వేసిన పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరంఉందని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

రేపు మార్కాపురానికి సీఎం చంద్రబాబు

- అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభకు హాజరు
- జిల్లా ప్రజాప్రతినిధులతో భేటీ
- ఆరు గంటల పాటు సాగనున్న కార్యక్రమం
- కలెక్టర్ నేతృత్వంలో విస్తృత ఏర్పాట్లు
- సభాస్థలిని పరిశీలించిన మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి



సీఎం సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రిస్వామి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎస్పీ దామోదర్, ఎరిక్షన్‌బాబు



ఒంగోలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 8న మార్కాపురం రానుండగా అందుకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని అక్కడ నిర్వహిస్తుండగా ఆ సభకు సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారు. మొత్తం ఆరు గంటల పాటు మార్కాపురంలో సీఎం పర్యటన కార్యక్రమం సాగనుంది. ఉదయం 10.45 గంటలకు మార్కాపురం చేరుకునే సీఎం తొలుత జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో కాసేపు మాట్లాడతారు. అనంతరం సభాప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన, లబ్ధిదారులకు పథకాల పంపిణీ చేస్తారు. విశ్రాంతి అనంతరం సుమారు గంటన్నరపాటు మహిళలతో సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మరో గంటన్నర పాటు కార్యకర్తలతో భేటి అవుతారు. ఆ తర్వాత ఇంకో అరగంట పాటు జిల్లా అధికారులతో సీఎం సమీక్షా సమావేశం

మిగతా 8లో...



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గీతాన్ని ఆలపిస్తున్నవిద్యార్థినులు

జయహో మహిళ

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు

- ఎస్పీ ఏఆర్ దామోదర్
- మహిళా గీతం ఆవిష్కరణ

8



ఒంగోలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

కీచక టీచర్ సస్పెన్షన్

ఒంగోలు విద్య, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తున్న ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. కొనకనమిట్ల మండలం తువ్వపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న శివరాజు కామేశ్వరరావు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ డీఈవో ఎ.కిరణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలలో కామేశ్వరరావు అసభ్య పవర్తనను తట్టుకోలేక విద్యార్థినులు లేఖలు రాసి ఫిర్యాదు బాక్సులో వేశారు. తర్వాత టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పాఠశాలను సందర్శించగా.. ఆమెకు 13మంది విద్యార్థినులు తమను వేధింపులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆ ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేయాలని ఆమె ఎస్ఐని ఆదేశించారు. ఈ ఘటనపై ఎంఈవో షరీఫ్ నివేదిక మేరకు టీచర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

టెన్త్ ఇన్విజిలేటర్లుగా స్కూలు అసిస్టెంట్లు

విలువలు ఉన్నవారినే నియమించాలి : డైరెక్టర్



ఒంగోలు విద్య, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు స్కూలు అసిస్టెంట్లను ఇన్విజిలేటర్లుగా నియమిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కెవీ శ్రీనివాసుల రెడ్డి మార్గదర్శకాలు జారీచేశారు. నిజాయితీ, నిబద్ధతతో విలువలు పాటించే ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించాలని అందులో పేర్కొన్నారు. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ ఉంటారు. ఆయా పరీక్ష కేంద్రాలకు కేటాయించిన ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ విద్యార్థుల సంఖ్యను కూడా పరిగణనలోకి తీసుకొని ఇన్విజిలేటర్లను నియమించనున్నారు. గతంలో మాల్‌ప్రాక్టిస్‌కు పాల్పడి పరీక్ష విధుల నుంచి తొలగించిన వారిని, ఆరోపణలు ఉన్నవారిని నియమించడం లేదు. బాలికలను చెక్ చేసేందుకు ప్రతి పరీక్షా కేంద్రానికి ఒకరిద్దరు మహిళా ఇన్విజిలేటర్లను నియమించనున్నారు. కేంద్రాలకు 8 కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తున్న టీచర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఏపీ రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ మండల పరిషత్, యూపీ స్కూళ్లు, మునిసిపల్, ఎయిడెడ్ స్కూళ్లలో పనిచేస్తున్న ఎస్ఏను ఇన్విజిలేటర్లుగా నియమించనున్నారు.

వైసీపీ పాలనలో రేషన్ మాఫియా

- సిట్ విచారణ వేగవంతం చేసి చర్యలు తీసుకోవాలి
- అసెంబ్లీలో ఎమ్మెల్యే జనార్దన్ డిమాండ్
- బాధితులకు భూపరిహారం అందజేయాలి
- ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

ఒంగోలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి)/కనిగిరి: ఐదేళ్ల వైసీపీ పాలనలో రేషన్ బియ్యం మాఫియా భారీగా పేదల బియ్యాన్ని దోపిడీ చేసిందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ధ్వజమెత్తారు. ఆ కాలంలో జరిగిన బియ్యం మాఫియా అక్రమాలపై ప్రభుత్వం నియమించిన సిట్ తమ విచారణను వేగవంతం చేసి బాధ్యులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశంపై ఎమ్మెల్యే జనార్దన్ మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో 50లక్షల టన్నుల బియ్యం రైతుల దగ్గర తీసుకొని పంపిణీ చేస్తే తిరిగి 30లక్షల టన్నులు రీసైక్లింగ్ అయ్యేవన్నారు. అప్పట్లో ఎఫ్‌సీఐ గోడౌన్లలో బస్తాకు రూ.5 అద్దె ఉంటే ప్రైవేటు గోడౌన్లలో రూ.4.25 అని అక్కడ నిల్వ ఉంచితే ఆ మాఫియా వేల టన్నుల బియ్యాన్ని మాయం చేశారన్నారు. కాకినాడ, మచిలీపట్నంలతోపాటు కర్నూలు, కోనసీమ, బాపట్ల తదితర జిల్లాల్లో ఇలా ఎక్కువగా జరిగాయని చెప్పారు. కాకినాడలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌లు తనిఖీ సందర్భంగా సుమారు 1,320 టన్నులు అక్రమంగా ఉన్న విషయం బయట పడిందని గుర్తుచేశారు. ఆ సమయంలో అధికారులు సైతం మంత్రులకు సహకరించలేదన్నారు. సిట్ విచారణను వేగవంతం చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

హైవే బాధితులను ఆదుకోవాలి

బాధితులకు భూ పరిహారం అందజేసి కనిగిరి ప్రాంతానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కనిగిరి ప్రాంతం అభివృద్ధి, బాధితులకు పరిహారం కోరుతూ గురువారం అసెంబ్లీలో తన గళాన్ని వినిపించారు. కనిగిరి ప్రాంతంలో వివిధ రోడ్లు, రైల్వేలైన్ ఏర్పాటులో భాగంగా ఎంతోమంది తీవ్రంగా నష్టపోతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కని గిరి నియోజకవర్గంలో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు సాగేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. మైదుకూరు-సింగరాయకొండ 167బీ హైవే రోడ్డుకు భూసేకరణ సమయంలో జీరో అవార్డు ఇచ్చారన్నారు. వాస్తవంగా అక్కడ పట్టాదారులు

మిగతా8లో...

మంత్రి అచ్చెన్నతో జనార్దన్ భేటీ

రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖల మంత్రి కె.అచ్చెన్నాయుడుతో గురువారం ఎమ్మెల్యే జనార్దన్ భేటీ అయ్యారు. గురువారం అసెంబ్లీ సమావేశాల అనంతరం మంత్రిని కలిసి ఎమ్మెల్యే జిల్లా సహకార శాఖ అధికారుల పనితీరు, డీసీసీబీలో విచారణ, పొగాకు సమాఖ్యకు పీఐసీ నియామకం, ఇటీవల జరిగిన పలు పరిణామాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకోవాలని కోరినట్లు సమాచారం.

ఉత్సాహంగా మహిళా ఉద్యోగుల ఆటల పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీఎన్జీవో అసోసియేషన్, జిల్లామహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎన్జీవో భవన్‌లో మహిళా ఉద్యోగుల ఆటల పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. పాటల పోటీలు, స్కిప్పింగ్, టెన్నీకాయిట్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. పాటల పోటీలకు మహిళావిభాగం చైర్మన్ కె. కోటేశ్వరమ్మ, కన్వీనర్ సీహెచ్‌శిరీష, కో చైర్మన్ భారతి, ఒంగోలు చైర్మన్ జ్యోతి, సునీలాకుమారి,షమ్మిలు నిర్వాహకులుగా వ్యవహరించారు. స్కిప్పింగ్ పోటీలకు అరుణ, ప్రణతి, గాలెమ్మ, రాజేశ్వరిలు నిర్వాహకులుగా వ్యవహరించగా, టెన్నీకాయిట్ పోటీలకు స్వర్ణలత, కోశాధికారి శివకుమార్, బి. ఏడుకొండలు ఆధ్వర్యంలో జరిగాయి. ఆటల పోటీలకు జిల్లా నలుమూలలనుంచి మహిళా ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. ఉత్సాహంగా ఆ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈకార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కే.శరత్‌బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, కొత్తపల్లి మంజేష్, షేక్ మగ్దుం షరీఫ్, కృష్ణకిషోర్, ప్రసన్నాంజనేయరాజు, కిరణ్, విజయ్, రత్నరాణి, నారాయణమ్మ తదితరులు ఉన్నారు.





పోటీల్లో భాగంగా స్కిప్పింగ్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు (ఇన్‌సెట్లో) రింగు ఆట ఆడుతున్న యువతి



కుర్చీలాట ఆడుతున్న ఉద్యోగినులు

నేడు ముగింపు వేడుకలు

ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగులకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎన్జీవోభవన్‌లో జరిగే ముగింపు వేడుకల్లో బహుమతుల ప్రదానోత్సం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఎఆర్‌దామోదర్, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, ఉప రవాణా కమిషనర్ సుశీల, పర్యవేక్షక ఇంజనీర్ వరలక్ష్మి, దామచర్ల నాగసత్యలత తదితరులు పాల్గొంటారని తెలిపారు.

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు

- ఎస్పీ దామోదర్
- పోలీస్‌పరేడ్ మైదానంలో విద్యార్థినులకు కరాటేపై శిక్షణ

ఒంగోలు క్రైం, మార్చి6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళల భద్రత కోసం ప్రత్యేకమైన చర్యలు చేపట్టినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఒంగోలులోని పోలీస్ క్రీడా మైదానంలో విద్యార్థినులకు ఆత్మవిశ్వాసం పెరిగేలా కరాటే శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళా సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. స్వీయ రక్షణ కోసం, క్లిష్ట పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునేందుకు మానసికంగా ధృడంగా ఉండాలని సూచించారు. ఈనెల ఒకటో తేదీనుంచి అంతర్జాతీయ మహిళ దినోత్సం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో జిల్లావ్యాప్తంగా వ్యాసరచన, చిత్రలేఖనం, వకృత్వ పోటీలు నిర్వహించామన్నారు. అత్యవసర సమయంలో మహిళలు, చిన్నారులు హెల్ప్ లైన్ నంబర్లకు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని కోరారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, మహిళ హెల్ప్‌లైన్ 181, పోలీసు హెల్ప్‌లైన్ 100, 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, పోలీసు కంట్రోల్ రూమ్ 9121102266 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, మహిళీ పోలీస్‌స్టేషన్ సీఐ సుధాకర్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఆర్ఐ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







కరాటే శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

'జయహో మహిళ' గీతం ఆవిష్కరణ

అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్‌శాఖ ఆధ్వరంలో జయహో మహిళ అనే గీతాన్ని ఎస్పీ దామోదర్ ఆవిష్కరిచారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో గీతాని గానం చేసిన నూకతోటి శరత్, సంగీతం సమకూర్చిని షాన్‌లను ఎస్పీ అభినందిచారు.

ఆర్టీసీ రీజినల్ మేనేజరుగా వెంకట్రావు

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా రీజినల్ మేనేజరుగా కే. వెంకట్రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు సీటీఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు పదోన్నతి కల్పిస్తూ ఆర్ఎంగా ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఉద్యోగులు, కార్మికులు, డిపో మేనేజర్లతో ఆయన సమావేశం అయ్యారు. ఆర్టీసీని ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు, రీజనల్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన కృషిచేస్తానన్నారు. కార్మికులు, ఉద్యోగులు అందరు సమష్టిగా పనిచేసి సంస్థను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం డిపో ఆవరణలో గత కొన్నినెలలుగా మూతపడిన క్యాంటిన్‌ను తిరిగి ఆయన ప్రారంభించారు. దీంతో డిపోలో 24 గంటల క్యాంటిన్ అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా డిపో మేనేజరు శ్రీనివాసరావు, బస్‌స్టేషన్ మేనేజరు ఆర్‌వీ.నాయక్,ఉద్యోగసంఘం నాయకులు రాధాకృష్ణ, కమిటీ సభ్యులు ఆర్ఎంకు అభినందనలు తెలిపారు.



నూతన ఆర్ఎం వెంకట్రావును అభినందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు రాధాకృష్ణ

రేపు మార్కాపురానికి సీఎం చంద్రబాబు

(7వ పేజీ తరువాయి)

నిర్వహిస్తారు. తిరిగి 4.42 గంటలకు వెళ్లిపోతారు. తొలుత వెలిగొండ ప్రాజెక్టు సందర్శన కూడా ఈ పర్యటనలో ఉంటుందన్న సంకేతాలు ఇచ్చినా తర్వాత దానిని రద్దుచేసి మొత్తం కార్యక్రమం మార్కాపురంలోనే ఏర్పాటుచేశారు. ఆ మేరకు షెడ్యూల్‌పై స్పష్టత రావడంతో తదనుగుణంగా ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. కలెక్టర్ అన్సారియా, స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిల నేతృత్వంలో రెండు రోజులుగా అక్కడి తర్లపాడు రోడ్డులోని సాయిబాలాజీ హైస్కూలు ప్రాంగణంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అధికారులతో మంత్రి సమీక్ష

మంత్రి డాక్టర్ స్వామి గురువారం సాయంత్రం మార్కాపురం వెళ్లి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ ఎఆర్‌దామోదర్‌లతో కలిసి పరిశీలించడంతోపాటు అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతంలో భారీగా వేలాది మందితో సభలు నిర్వహించే విధానం ఉండగా ప్రస్తుతం దానికి స్వస్తి చెప్పి తక్కువమందితో చర్చావేదిక లాగా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈక్రమంలో మార్కాపురంలో సీఎం కార్యక్రమాన్ని కూడా 3 వేల మంది మహిళలకే పరిమితం చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు సమాచారం. తదనుగుణంగానే జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే మహిళా దినోత్సవ సభ, కార్యకర్తలతో సీఎం సమావేశం, అధికారులతో సమీక్ష అన్ని ఒకేచోట దగ్గర దగ్గరగా ఏర్పాటు చేస్తుండగా హెలిప్యాడ్‌ను కూడా అక్కడికి సమీపంలోనే ఏర్పాటు చేశారు. కాగా సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా ఉంది.

ఉదయం 10.45 గంటలకు: హెలికాప్టర్‌లో మార్కాపురం చేరుకుంటారు

10.55నుంచి 11.15 వరకు: ప్రజాప్రతినిధులు, అధికారులను కలుస్తారు

11.22నుంచి 12.30 వరకు: సాయిబాలాజీ హైస్కూలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన, పథకాల ప్రారంభం, లబ్ధిదారులకు యూనిట్లు అందజేత

- మధ్యాహ్నం 12.20నుంచి 1గంట వరకు: విశ్రాంతి

- మధ్యాహ్నం 1 నుంచి 2.30 వరకు: మహిళలతో సమావేశంలో పాల్గొంటారు.

- 2.35 నుంచి 4.05 వరకు: పాలేరమ్మ టెంపుల్ సమీపంలో జరిగే టీడీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు

4.05 నుంచి 4.30 వరకు: జిల్లా అధికారులతో సమీక్ష చేస్తారు

4.42 గంటలకు : హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్తారు.



కొణికి ఎత్తిపోతలను పరిశీలిస్తున్న బృందం

ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ

- ఏలూరి ఆదేశంతో నీటి పారుదల శాఖ డీఈ పరిశీలన
- రైతులకు నిర్వహణ అప్పగింత

ఇంకొల్లు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో నిర్వహణ సక్రమంగా లేక ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మూలనపడ్డాయి. ఆ పథకాలను తిరిగి పునరుద్ధరించి రైతులకు ఉపయోగపడేలా మహారాష్ట్ర రాష్ట్రంలో లాగే రైతులే సొసైటీ గా ఏర్పడి నిర్వహణ చేసుకునేలా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి చేస్తున్నారు. ఇందుకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాల ను పరిశీలించి మరమ్మతులకు ప్రతిపాదనలు త యారు చేసేందుకు రిటైర్డు నీటిపారుదల శాఖ డీఈ సత్యనారాయణను కోరారు. ఈ మేరకు మండలంలోని నిరుపయోగంగా ఉన్న రెండు ఎత్తిపోతల పథకాలను సత్యనారాయణ గురువారం ముప్పాళ్ల (కొణికి), గొల్లపాలెం ఎత్తిపోతల పథకాలను పరిశీలించారు.

రైతులను అడిగి వాటి నిర్వహణ విధివిధానాలు తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు చేయాల్సిన మరమ్మతులపై చర్చించారు. ఈ రెండు ఎత్తిపోతలను పునరుద్ధరిస్తే రైతులకు మేలు జరుగుతుందని రైతులు తెలిపారు. ఎమ్మెల్యే కృషిని వారు అభినందించారు. ఎత్తిపోతలను పరిశీలించిన వారిలో టీడీపీ నాయకులున్నారు.

వైసీపీ పాలనలో రేషన్ మాఫియా

(7వ పేజీ తరువాయి)

ఉన్నారన్నారు. యజమానులకు భూపరిహారం అందజేయలేదన్నారు. దీంతో పట్టాదారులు అంగీకరించకపోవటంతో రోడ్డు పనులకు ఇబ్బందిగా మారిందన్నారు. అలాగే, బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవేలో గుంతచెన్నంపల్లిలో కూడా ఇదేవిధంగా రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో అక్కడ కూడా నిర్మాణానికి ఆటంక ఏర్పడిందన్నారు. ఏర్పేడు-హైదరాబాద్ 565 హైవే బైపాస్ రోడ్డుకు సంబంధించి 2014లో టెండర్ పిలిచినట్టు గుర్తుచేశారు. ఇక్కడ కూడా పట్టాదారులకు పరిహారం చెల్లించకపోవటంతో అదే పరిస్థితి నెలకొందన్నారు. ఊళ్ళపాలెం-వేములపాడు (ఓవీరోడ్డు)కు 2021లో టెండర్ పిలిచినా ఇంతవరకు భూసేకరణ చేపట్టలేదన్నారు. ప్రస్తుతం కాంట్రాక్టర్ ముందుకు రావటంతో బాధితుల అడ్డుకుంటున్నారన్నారు. నడికుడి-శ్రీకాళహస్తి రైలు మార్గంలో కనిగిరి మండలంలోని పేరంగుడిపల్లి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టేందుకు అక్కడ ఏడు గృహాలు ఉన్నప్పటికి నిర్మాణాలు లేవని రెవెన్యూ అధికారులు తప్పుడు నివేదిక అందించారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. భూపరిహారం అందకపోవడంతో బాధితులు పనులను అడ్డుకుంటున్నారన్నారు. పరిహారం అందించకపోతే రోడ్లు, రైల్వే పనులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రెవెన్యూ, ఆర్ అండ్‌బీ మంత్రులు తగిన చొరవ చూపి కనిగిరి ప్రాంత బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కోరారు.

ఆదాయ మార్గాలపై అన్వేషణ

(7వ పేజీ తరువాయి)

మార్చే ప్రక్రియకు శ్రీకారం పలికారు. వాటిని లీజు పద్ధతి ద్వారా కేటాయించడంతోపాటు, అవసరమైతే బీవోటీ ద్వారా నిర్మాణాలు చేపట్టి అద్దెకు కేటాయించనున్నట్లు సమాచారం. అంతేకాకుండా ఇప్పటికే కార్పొరేషన్ కాంప్లెక్స్‌ల్లోని దుకాణాలు గత పాతికేళ్లుగా వ్యాపారుల స్వాధీనంలో ఉన్నాయి. అయితే మునిసిపాలిటీ అయినప్పటికీ నుంచి అప్పటి రేటు ప్రకారం అద్దెలు నడుస్తున్నాయి. ప్రస్తుతం కార్పొరేషన్‌కు అనుగుణంగా ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం అద్దెలు పెంచే విధంగా ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంచితే ఇప్పటికే షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించి అద్దెలు, పన్నులు రూ. 4.5 కోట్లు ఉండగా, తాగునీటి పన్నులు పెండింగ్ మరో రూ.2కోట్లపైనే ఉంది. వాటన్నిటిని పూర్తిస్థాయిలో వసూలు చేసి, ఆర్థిక వనరులు పెంపొందించే దిశగా కమిషనరు ప్రణాళిక రూపొందించారు. మొత్తంగా అప్పుల ఊబిలో ఉన్న నగరపాలక సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసే చర్యలకు శ్రీకారం పలికారు.

ఖర్చు తగ్గించి, ఆదాయ మార్గాల పెంపునకు చర్యలు

- డాక్టర్ కే. వెంకటేశ్వరరావు, నగర కమిషనరు

ఆర్థిక లోటును అధిగమించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాము. ప్రస్తుతం ఉన్న బకాయిల చెల్లింపులు, ఇతర అభివృద్ధి పనుల చేపట్టేందుకు రూ.500 కోట్లు అవసరంగా ఉంది. అయితే అందుకు సంబంధించిన పనుల ప్రతిపాదనలు, డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నాము. వాటితోపాటు కార్పొరేషన్‌లో ఖర్చును తగ్గించి, ఆస్తులను వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా దృష్టిసారించాము. ఖాళీస్థలాలను లీజు పద్ధతిన కేటాయించడంతోపాటు, అవసరమైన చోట షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి అద్దెలు వసూలు చేయడం ద్వారా కొంతమేర ఆదాయం పెంచుతాము. అలాగే దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాము. వాటిని కూడా పూర్తిస్థాయిలో వసూలు చేసి, బకాయిలు చెల్లింపునకు చర్యలు చేపడతాము. ప్రభుత్వ భవనాల పన్నులు కూడా ఎక్కువ మొత్తంలో పెండింగ్ ఉంది. ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నాము. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు నిధుల సౌలభ్యతను బట్టి దశల వారీగా చెల్లిస్తాము.

వైసీపీ పాపం.. విద్యార్థులకు శాపం!



తిమ్మాయపాలెం జడ్పీహెచ్ఎస్‌లో పని చేయని వాటర్ ప్లాంట్

- నాడు-నేడులో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌లు మూలకు
- మరమ్మతులకు ముందుకు రాని కాంట్రాక్టర్
- తాగునీటి కల్పనకు విద్యాశాఖ అధికారుల ప్రత్యామ్నాయ చర్యలు

అద్దంకిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ శాపం కారణంగా పాఠశాల విద్యార్థులు దాహం కేకలు వేస్తున్నారు. విద్యార్థులకు సురక్షిత తాగునీటిని అందించేందుకు గత వైసీపీ ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌లు మూలనపడ్డాయి. దీంతో విద్యార్థులు దాహంతో అల్లాడుతున్నారు. వేసవి కాలం రాబోతుండడంతో విద్యాశాల ఉన్నతాధికారులు ఆదేశాలలో పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్ల మరమ్మతులకు ప్రాధానోపాధ్యాయులు చర్యలకు పూనుకున్నారు.

మండలంలో 31 వాటర్ ప్లాంట్‌లు మంజూరు

గత వైసీపీ హయాంలో పాఠశాలలో నాడు-నేడు కింద 31 వాటర్ ప్లాంట్‌లను మంజూరు చేసింది. విద్యార్థుల సంఖ్యను ఆధారంగా రూ.75వేలు, రూ.1.50లక్షలు, రూ.2.50లక్షల విలువైన మూడు రకాల వాటర్‌ప్లాంట్‌లను పేజ్-1లో మంజూరు చే సింది. అయితే ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ రెండు మూడు నెలలు కూడా పని చేయకుండా మూలన పడ్డాయి. మరమ్మతులకు సంబంధిత కాంట్రా క్టర్‌లకు ఎన్ని సార్లు చెప్పినా వచ్చి చూడడం తప్ప వాటిని మరమ్మతులు చేయలేదు. దీంతో అవి ఏళ్ల తరబడి నిరుపయోగంగా పడిఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం పాఠశాలలు చెందిన ఫండ్స్‌ను ఇవ్వకపోవడంతో వాటర్‌ప్లాంట్‌ల మరమ్మతులను హెచ్ ఎంలు చేయించలేదు. దీంతో అవి అలంకారప్రాయంగానే మిగిలిపోయ్యాయి.



గోరకాపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్

తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

నాటి ప్రభుత్వం ఇచ్చిన వాటర్ ప్లాంట్‌లు నిరుపయోగంగా మారడంతో పలు పాఠశాలలో విద్యార్థులకు తాగునీటిని అందించేందుకు గ్రామంలోని వాటర్ ప్లాంట్‌ల వద్ద నుంచి వాటర్ క్యాన్‌లతో నీటిని కొనుగోలు చేసి దాహం తీరుస్తున్నారు. మరి కొన్ని పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ల ద్వారా విద్యార్థుల దాహర్తిని తీరుస్తున్నాయి.

విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో మరమ్మతులకు చర్యలు

వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలో మూలనపడిన నాడు-నేడు వాటర్‌ప్లాంట్‌ల పరిస్థితిని పరిశీలించి వెంటనే తగు మరమ్మతులకు ఆయా పాఠశాలల ప్రాధానోపాధ్యాయులు చర్యలు చేపట్టారు. వాటర్‌ప్లాంట్‌ల పరిస్థితి ఏమిటి ఎంత ఖర్చు అవుతుంది, వాటికి సంబంధించిన వస్తువుల కోనుగోలు వంటివి ఏర్పాటు చేసి ప్లాంట్‌లను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పాఠశాలలకు సంబంధించిన ఫండ్స్‌ను విడుదల చేయడం, వాటిని తోడు కొంత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఖర్చు చేసి ప్లాంట్‌లను వినియోగంలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఒకటి రెండు పాఠశాలల్లో ఉన్న వాటర్‌ప్లాంట్‌లను మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. లక్షలు ఖర్చు చేసి నిరుపయోగంగా పెట్టిన వాటర్‌ప్లాంట్‌లను మరమ్మతులు చేయించి విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది లేకుండా తీసుకుంటున్న చర్యలపై విద్యార్థుల తల్లి దండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వరల్డ్ కప్ పోటీలో ఖోఖో బెస్ట్ అటాకర్

శివారెడ్డిని అభినందించిన మంత్రి

పంగులూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో జనవరిలో జరిగిన ప్రపంచ కప్ ఖోఖో పోటీలలో ఇండియా జట్టులో పాల్గొని బెస్ట్ అటాకర్‌గా నిలిచిన పంగులూరు ఎస్ఆర్ ఖోఖో అకాడమీ క్రీడాకారుడు పి.శివారెడ్డి గురువారం క్రీడల శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో తనను కలిసిన ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డిని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో ఖోఖో క్రీడ లో ప్రతిభచాటిన శివారెడ్డికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని అకాడమీ నిర్వాహకులు, ఖోఖో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి మంత్రికి విన్నవించారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందని, క్రీడాకారులకు ప్రభుత్వ పక్షాన తగిన తోడ్పాటును అందిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సీతారామిరెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం

చినగంజాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమైన సంఘటన చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాలలో గురువారం జరిగింది. సోపిరాలకు చెందిన తుమ్మలపెంట జయరావుకు చెందిన రెండు ఎకరాలు, పల్లపోలు వెంకటేశ్వర్లుకు చెందిన రెండు ఎకరాల గడ్డి వాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. పక్కపక్కనే ఉన్న గడ్డివాములలో జయరావుకు చెందిన గడ్డివాము దగ్ధం కావడం చూసిన గ్రామస్థులు చీరాల ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందజేశారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. ఇటీవల ఎకరం గడ్డి రూ.20వేల చొప్పున కొనుగోలు చేసి గడ్డి వాములు వేశామని బాధితులు వాపోయారు.

ప్రకృతి సేద్యంలో దిట్ట నరిశెట్టి

పంటల సాగులో ప్రకృతి సేద్యానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా ప్రకృతిలో దొరికే పదార్థాలతో పాటు గోమూత్రాన్ని వినియోగించి పురుగులు, తెగుళ్లను నియంత్రించడంతో పాటు అధిక దిగుబడులు సాధిస్తున్నారు ఆ రైతు. పలు రకాల కూరగాయల సాగుతో పాటు పది రకాల వరి వంగడాలను తన పొలంలో సాగుచేస్తూ ప్రముఖుల నుంచి ప్రశంసలతో పాటు అవార్డులు అందుకుని ఆదర్శంగా నిలుస్తున్నారు అద్దంకి మండలం గోవాడకు చెందిన రైతు నరిశెట్టి రమేష్‌బాబు.

- ఎనిమిదేళ్లుగా పలు రకాల పంటల సాగు
- 10 ఎకరాలలో 10 రకాల వరి వంగడాలు
- అన్నగారిసంతలో పలు ఉత్పత్తుల విక్రయం
- ఆదర్శంగా నిలుస్తున్నరైతు రమేష్



ప్రకృతి సేద్యం విధానంలో రైతు నరిశెట్టి రమేష్ సాగు చేసిన వరి పైరు



గడిచిన సంక్రాంతి రోజున విజ్ఞాన్‌వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో అభ్యుదయ రైతుగా మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయల నుంచి ప్రశంసాపత్రం, సన్మానం అందుకుంటున్న రమేష్

అద్దంకి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మండలం గోవాడకు చెందిన రమేష్‌బాబు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఆ ఉత్పత్తులను స్థానిక సంతలో విక్రయిస్తున్నారు. కేవలం గోమూత్రం, పేడలను మాత్రమే వాడి పంటలు సాగు చేస్తున్నారు. 2018లో ప్రకృతి వ్యవసాయంపై సుభాష్ పాలేకర్ విజయవాడలో నిర్వహించిన శిక్షణా తరగతులకు హాజరై అవగాహన పెంచుకున్నారు. అప్పటి నుంచి తనకు ఉన్న పొలంతో పాటు మరికొంత పొలం కౌలుకు తీసుకొని ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తున్నారు. సొంతంగా ఆవులను పెంచుతూ, వాటి నుంచి వచ్చే గోమూత్రం, పేడలను పంటల సాగుకు వినియోగిస్తున్నారు. గతంలో పలు రకాల కూరగాయలు సాగు కూడా చేసిన రమేష్‌బాబు ప్రస్తుతం 10 ఎకరాలలో 10 రకాల దేశీయ వరి వంగడాలను సాగు చేస్తున్నారు. వరి కోతలు పూర్తయిన తరువాత కొంత పొలంలో తిరిగి వరి , మిగిలిన పొలం లో నువ్వు, మినుము సాగు చేస్తున్నారు. నువ్వు, మినుము పంటల సాగు కూడా ప్రకృతి వ్యవసాయం ద్వారానే చేస్తున్నారు. ఆయన పండించిన వాటితో పాటు ఇతర ప్రాంతాలలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పలు పంట ఉత్పత్తులను కూడా తీసుకువచ్చి అద్దంకిలోని అన్నగారి సంతలో అమ్మకాలు చేస్తున్నారు. అదే సమయంలో ఆవులు, గేదెలకు కూడా ఎలాంటి రసాయన ఎరువులు వినియోగించకుండా ఆవు పేడతో సాగు చేసిన పశు గ్రాసాన్ని మాత్రమే వినియోస్తున్నారు.


మంత్రి, ఎంపీ నుంచి సన్మానం

ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తున్న రమేష్‌బాబు సేవలకు గుర్తింపుగా ఇటీవల విజ్ఞాన్ యూనివర్శిటీ, రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో అభ్యుదయ రైతుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ, తదితర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఇటీవల రమేష్‌బాబును ఘనంగా సన్మానించారు. సాగు వ్యయం తక్కువగానే ఉంటున్నప్పటికి దిగుబడులు తక్కువగా ఉండి మిగిలిన పంట ఉత్పత్తుల కంటే ఎక్కువ ధరకు అమ్మకాలు చేయాల్సి వస్తుందన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేస్తున్నారు. రమేష్ సేంద్రియ సాగు చేస్తూ మిగిలిన ప్రాంతాలలో ఉన్న రైతులకు ఫోన్ ద్వారా సలహాలు, సూచనలు ఇస్తున్నారు.



రైతు పెంచుతున్న ఆవులు

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి



ప్రకృతి వ్యవసాయ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి. అదే సమయంలో ప్రజల నుంచి ఆదరణ పెరిగితే ఎక్కువ మంది రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేసే అవకాశం ఉంటుంది. 8 సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పలు రకాల పంటలు సాగు చేస్తున్నాను. గతంలో క్యాబేజి, బెండ,సొర, దోస తదితర కూరగాయల సాగు కూడా చేపట్టా. ప్రస్తుతం 10 ఎకరాలలో 10 రకాల దేశీయ వరి వంగడాల సాగు చేస్తున్నాను. వేసవి లో నువ్వు, మినుము పంటలను సాగు చేస్తాను. గోవుల నుంచి వచ్చే పేడ, మూత్రంలను మా త్రమే వాడి పంటల సాగు చేస్తున్నా. దీనిపై అవగాహన ఉన్న కొద్ది మంది మాత్రమే ఆ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం అందిస్తే తక్కువ ధరకు వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలుదారులకు అందించే అవకాశం ఉంటుంది. తాను పండించిన పంట ఉత్పత్తులతో పాటు, వాటి నుండి తయారు చేసిన వస్తువులను అద్దంకిలో ఆదివారం జరిగే అన్నగారి సంతలో విక్రయిస్తున్నా. ఒక్క ఆవు ద్వారా వచ్చే మూత్రం, పేడ ద్వారా 10 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేయవచ్చు.

- నరిశెట్టి రమేష్‌బాబు, రైతు, గోవాడ, అద్దంకి మండలం



అద్దంకిలోని అన్నగారి సంతలో విక్రయానికి ఉంచిన రైతు పండించిన వివిధ రకాల వరి ధాన్యం ఉత్పత్తులు



మద్దిరాలపాడులో టీడీపీ నాయకులతో కలిసి ఉత్తర్వుల కాపీని చూపుతున్న లబ్ధిదారుడు

నెరవేరిన సీఎం హామీ
గీత కార్మికుడికి మద్యం దుకాణం


- ధన్యవాదాలు తెలిపిన లబ్ధిదారుడు
- టీడీపీ నాయకుల హర్షం

నాగులుప్పలపాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుడికి ఉచితంగా మద్యం దుకాణాన్ని కేటాయిస్తామని సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు పూర్తయిన సందర్భంగా గతేడాది సెప్టెంబరు 20 న సీఎం చంద్రబాబునాయుడు 'ఇది కదా మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో నిర్వహించారు. సభావేదిక వద్దకు వెళ్లే ముందుగా గ్రామంలోని మూడు కుటుంబాలను స్వయంగా కలిసి వారి బాగోగులను తెలుసుకొన్నారు. నిలిచిపోయిన ఇంటి నిర్మాణ బిల్లును అక్కడికక్కడే మంజూరు చేయించారు. ఇద్దరు పిల్లల చదువు బాధ్యత కూడా తీసుకొని ప్రైవేటు కళాశాలలో సీటు ఇప్పించారు. కల్లుగీత కార్మికుడు ఆలుదాసు శ్రీనుకు స్థలం మంజూరు చేసి ఇల్లు నిర్మించనున్నట్లు తెలిపారు. కల్లుగీత కార్మికుల కోటాలో ఉచితంగా మద్యం దుకాణం అందిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచనలతో ఆలుదాసు శ్రీనుకు ఐదు రోజుల్లోనే రెవెన్యూ అధికారులు మద్దిరాలపాడులో మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరుచేసి పట్టా అందించారు. మరో హామీలో భాగంగా ఉచిత మద్యం దుకాణాన్ని శ్రీనుకు కేటాయిస్తూ గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో లబ్దిదారుడు ఆలుదాసు శ్రీను కుటుంబసభ్యుల ఆనందానికి అవధులు లేకుండా ఉన్నాయి. తనకు ఇంటిస్థలంతోపాటు ఉచితంగా మద్యం దుకాణం కేటాంచిన సీఎం, సహకరించిన జిల్లా మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, గ్రామ టీడీపీ నాయకులకు ధన్యవాదములు తెలిపారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు గుమ్మడి సాయిబాబా, షేక్ ఖాజావలి, నెప్పల శివకృష్ణ, తాళ్లూరి ఆంజనేయులు, పెనుబోతు సునీల్, తాళ్లూరి ఆంజనేయులు, పాలడుగు మురళీ శ్రీనుకు ఆర్డర్ కాపీని అందజేసి హర్షం వ్యక్తం చేశారు.

పుణ్యభూమి పృథులాద్రి

- మహిమాన్విత క్షేత్రంగా భక్తులకు అపార నమ్మకం
- ఒకే కొండపై శివకేశవవుల ఆవాసం ఇక్కడ ప్రత్యేకం
- రుషులు నడయాడినట్లు ఆనవాళ్లు





పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం (ఇన్‌సెట్లో) కొండపైకి ఉన్న మార్గం

మద్దిపూడి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రుషులు నడయాడిన పుణ్యభూమి పృథులాద్రి కొండ పైభాగం.. వికసించిన పుష్పంలా ఉండటంతో పంచాననాద్రి అని కూడా అంటారు. శివకేశవుల ఆవాసంగా పృథులగిరి విరాజిల్లుతోంది. క్షేత్రపాలకుడిగా ఆంజనేయస్వామి కొలువై ఉన్నాడు. లక్ష్మీనరసింహస్వామి భక్తుల పాలిట కొంగుబంగారమై పూజలందుకుంటున్నారు. ఒకవైపు ఎత్తైన కొండలు, మరోవైపు లోతైన లోయల మధ్యలో పాము మెలికల సోపానాలు.. సెలయేటి సవ్వళ్లతో.. పక్షుల కిలకిలరావాలతో పర్యాటక కేంద్రంగా బాసిల్లుతోంది. ఈనెల 8వ తేదీ నుంచి స్వామివారి బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి.

క్షేత్రం చారిత్రక నేపథ్యం...

15వ శతాబ్దంలో పొదిలి ప్రాంతాన్ని సాలువ తెలుగరాయులు పరిపాలించారు. ఆయన లక్ష్మీనరసింహునిపై అపారమైన భక్తిబావం కలిగి ఉండేవారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అహోబిల లక్ష్మీనరసింహ స్వామికి నైవేద్యం పెట్టనిదే ఆయన భుజించేవారు కాదు. అహోబిలంలో నైవేధ్యం పెట్టారనే విషయాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేకంగా వేగులను ఏర్పాటు చేసుకున్నారు. స్వామి ఒకసారి తెలుగురాయుల భక్తిని పరీక్షించదలిచి భీకరమైన పెనుగాలులతో పాటు ఎడతెరిపిలేని వర్షబీభత్సాన్ని సృష్టించారు. దీంతో అహోబిలంలో నైవేధ్యం పెట్టారో, లేదో సమాచారం అందక రోజుల తరబడి నిరాహారంగా ఉండిపోయాడు. తెలుగురాయుల భక్తి విశ్వాసాలను మెచ్చిన నరసింహస్వామి స్వప్నంలో ద ర్శన మిచ్చారు. పొదిలి సమీపంలో ఉన్న పృథులగిరిపై ఆరవృక్షం కింద వనమాలను ఉంచానని ఆ ప్రదేశంలో తనకు దేవాలయం నిర్మించి పూజలు చేసుకోవాలని స్వప్నంలో కోరారు. మరుసటిరోజు మందీమార్బలంతో పృథులగిరికి చేరుకొని పైకొండ తిప్పమీద ఉన్న ఆరావృక్షం కింద వనమాల కనిపించడంతో ఆ ప్రదేశంలో అలయాన్ని నిర్మించి స్వామి సేవలో తరించారు.

సుమారు వంద ఏళ్ల క్రితం వచ్చిన పెనుభూకంపానికి ఆలయం శిథిలమైంది. అప్పట్లో కాటూరివారిపాలెంకు చెందిన కనమూర్లపూడి వెంగన్న చౌదరి దేవాలయాన్ని పునఃనిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తుంది. వెంకటగిరి రాజావారు దూపదీప నైవేద్యాల కోసం 120 ఎకరాల భూమిని విరాళంగా అందజేశారు. నేటికీ వెంకటగిరి రాజుల గోత్రనామాలతో తొలిపూజ చేయడం ఆనవాయితీగా మారింది. మద్దిపూడి నుంచి పృథులగిరి పైకి చేరుకునేందుకు శివరాజు ముద్దప్ప అనే భక్తుడు సోపాన మార్గాన్ని ఏర్పాటు చేసినట్లు తాళపత్ర గ్రంథాల ద్వారా తెలుస్తుంది.

భక్తుల దాహార్తిని తీర్చే కోనేరులు

కొండపైన ఉన్న రెండు ప్రధానమైన కోనేరులు వేలాది మంది భక్తుల దాహార్తిని తీర్చేందుకు అన్నసత్రాల నిర్వహణకు అవసరమైన నీటిని అందిస్తున్నాయి. కరువు పరిస్థితులలో సైతం ఆ కోనేరులలో జలజాడలు పుష్కలంగా ఉండటం స్వామి మహిమగా భావిస్తారు. సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బావులు ఒట్టిపోతున్నప్పటికీ కొండపైన కోనేరులలో సమృద్ధిగా నీరు దొరకడం విశేషం.

బచ్చల దొన ప్రత్యేకత

కొండపైన దక్షిణం వైపు అన్న సత్రాల నుంచి రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే కొండరాళ్ల మధ్య నీటిజాడలు కనిపిస్తాయి. మండు వేసవిలో సైతం ఇక్కడ లభించే నీరు చల్లగా ఉండటం విశేషం. పృథులగిరిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు బచ్చల దొనను చూసేందుకు ఆసక్తిని చూపిస్తారు.

ప్రకృతి పొదరిల్లు పృథులగిరి : ప్రకృతి అందాలకు పృథులగిరి నిలువెత్తు సాక్ష్యంగా దర్శనమిస్తోంది. అంతేగాక శివకేశవులిద్దరూ ఒకకొండపై ఆవాసం ఉండటం ఇక్కడ విశిష్టత. లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి ఉత్తరం వైపు ఉన్న గుహలలో నేటికీ రుషులు తపస్సు చేస్తున్న ఆనవాళ్లు కనిపిస్తుంటాయి. పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి ఏటా లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలతోపాటు శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి పృథులగిరిని పరిపాలిస్తుంటాడని భక్తుల విశ్వాసం.



లక్ష్మీ నరసింహస్వామి మూలవిరాట్

బ్రహ్మోత్సవాలు ఇలా ..

ఈనెల 8వ తేదీన అంకురార్పణ, 9న ధ్వజారోహణ, శేష వాహనం, 10 హంసవాహనం, 11న సింహవాహనం, 12న హనుమంత వాహనం, 13న గరుడ వాహన సేవ, 14న కల్యాణోత్సవం, గజోత్సవం, 15న రథోత్సవం, 16న అశ్వవాహనం, 17న పూర్ణాహుతి, 18న ఏకాంతసేవా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. 13వ తేదీన జరిగే గరుడ సేవ ఉత్సవానికి రాష్ట్రనలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. గరుడ సేవ ఉత్సవానికి దేవాలయ అధికారులు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యం కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతారు. పృథులగిరికి చేరుకునేందుకు రెండు మార్గాలు ఉన్నాయి. పొదిలి వైపు నుంచి జాఫలాపురం నుంచి ఒకమార్గం, పొదిలి నుంచి మద్రిపూడి మీదుగా మరో మార్గం ఉంది.

9న సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు(రూరల్), మార్చి6(ఆంధ్రజ్యోతి): జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ఒంగోలులోని డాక్టర్ పి.ఆనంద్ స్టేడియంలో జరుగుతాయని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందులలో జరిగే అంతర్ జిల్లాల సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలలో పాల్గొన్నాల్సి ఉంటుందన్నారు.

క్రీడాకారులు 2009 మార్చి 30 తరువాత జన్మించి ఉండాలన్నారు. బాలురు, బాలికలు 55కిలోల బరువు లోపు ఉండాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం అసోసియోషన్ కార్యదర్శి వై.పూర్ణచంద్రరావును 9948343232, 7780497696 సెల్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

ఒంగోలు క్రైం, మార్చి6(ఆంధ్రజ్యోతి): ఓ హత్యకేసులో నలుగురికి జీవిత ఖైదు విధిస్తూ మూడవ అదనపు సెషన్స్ కోర్టు న్యాయాధికారి డి.రాములు గురువారం తీర్పు ఇచ్చారు. చీమకుర్తి మండలం కేవీ.అగ్రహరంనకు చెందిన తొట్టెంపూడి వెంకటేశ్వర్లు, తొట్టెంపూడి రాంబాబు, కాకి రాము, టి.బాలకృష్ణలపై హత్యానేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఆ నలుగురు ముద్దాయిలకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.15 వేల జరిమాన విధించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కేవీ.అగ్రహారం గ్రామానికి చెందిన వాడపల్లి రమణయ్య క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు తన భార్య ఆత్మహత్యకు రమణయ్య కారణమని పగ పెంచుకున్నాడు. ఈక్రమంలో 2018 మే 4న చీమకుర్తి నుంచి బైక్‌పై ఇంటికి వెళుతున్న రమణయ్య మార్గమధ్యలో ఆగి సెల్‌ఫోన్ మాట్లాడుతున్నాడు. అప్పటికే ఆ మార్గంలో మాటు వేసి ఉన్న వెంకటేశ్వర్లు, రాంబాబు, రాము, బాలకృష్ణలు ఒక్కసారిగా రమణయ్యపై కత్తితో దాడి చేసి గొంతు కోసి హతమార్చారు. ఈమేరకు మృతుడి సోదరుడు యల్లమంద చీమకుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఒంగోలు రూరల్ సీఐ మురళీకృష్ణ దర్యాప్తు చేశారు. అనంతరం కేసును ట్రైనీ ఎస్పీగా ఉన్న సమిత్‌గరుడ్ కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతికుమారి వాదనలు వినిపించారు.

9 వరకు అభ్యంతరాల స్వీకరణ

ఒంగోలు విద్య, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన ప్రాథమిక సీనియారిటీ జాబితాలపై ఈనెల 9వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను యాజమాన్యం సబ్జెక్టు వారీగా పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. టీచర్ అన్ఫర్మేషన్ సిస్టమ్‌లో ఉపాధ్యాయులు తమకు తాముగా అప్‌లోడ్ చేసి ప్రధానోపాధ్యాయులు ధృవీకరించిన టిస్ వివరాల మేరకు ఈ సీనియారిటీ జాబితాలు రూపొందించి విడుదల చేశారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న సీనియారిటీ జాబితాలు టీచర్ల జీవిత కాలం ఉంటాయి. ఎప్పుడు ఉద్యోగోన్నతులు ఇచ్చినా ఈ జాబితా ప్రకారమే ఇస్తారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని టీచర్లు జాబితాల్లోని తమ వివరాలను సరి చూసుకొని తప్పులు ఉంటే సరి చేయించుకోవాలన్నారు. ఈనెల 9 వరకు టీచర్లు తమ అభ్యంతరాలను ఆర్‌జేడీ, డీఈవో కార్యాలయాల్లో అందజేయాలని కోరారు.

ఎస్పీకి డ్రోన్ కెమెరాల అందజేత


రాంబాబుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ దామోదర్

జరుగుమల్లి, మార్చి6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు పోలీసు అవసరాల కోసం అత్యాధునిక సాంకేతికతతో కూడిన డీజేఐ ఎయిర్ 3ఎస్ డ్రోన్ కెమెరాలను గురువారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ దామోదర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ కాపాడటంలో, నేరాలు, ట్రాఫిక్ నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా, విపత్తుల సమయంలో ఆపదలో ఉన్నవారిని కాపాడేందుకు, పోలీసింగ్ అవసరాలకు డ్రోన్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం రాంబాబు ఇచ్చిన డ్రోన్‌ను జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా రాంబాబుకు ఎస్పీ దామోదర్ ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, జరుగుమల్లి ఎస్సై మహేంద్ర పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్‌చాన్స్‌లర్ మూర్తి, విద్యార్థులు

ఒంగోలు విద్య, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిపాలన భవన్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోస్టర్‌ను వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి ఆవిష్కరించారు. గురువారం స్థానిక యూనివర్సిటీలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువతీ, యువకుల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. మారిన కాలానికి అనుగుణంగా యువత తమ మేధా సంపత్తితో భారతావనని ప్రతి రంగంలోనూ ముందుకు తీసుకెళ్లాలని, యువత యూత్ పార్లమెంట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హర్షప్రీ తమ్‌దేవ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.నిర్మలామణి, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ కమల్‌షా తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

● జిల్లా అధ్యక్షుడు రియాజ్ పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14వతేదీన జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పిలుపునిచ్చారు. ఒంగోలులోని రవిప్రియామాల్‌లో గురువారం రాత్రి కొండపి, దర్శి నియోజక వర్గాల జనసేన పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ వేడుకలను జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు తరలి వచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకుడు కంది రవిశంకర్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో క్యాన్సర్ వైద్య పరీక్షల నిర్వహణ


గుండాయపాలెంలో క్యాన్సర్ పరీక్షలను పరిశీలిస్తున్న డాక్టర్ వాణిశ్రీ

ఒంగోలు(రూరల్), మార్చి 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వాణిశ్రీ తెలిపారు. ఒంగోలు మండలంలోని గుండాయపాలెం, దేవరంపాడు గ్రామాల్లో జరుగుతున్న వైద్యసిబ్బంది సర్వేను ఆమె పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలకు బీపీ, షుగర్, క్యాన్సర్‌లపై సర్వేను పూర్తి చేయాలన్నారు. క్యాన్సర్ అనుమానితులను ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు పంపాలని, ఈ వ్యాధి ప్రాథమిక దశలో గుర్తిస్తే త్వరంగా నయం చేయవచ్చని చెప్పారు. పలు ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ సుందరప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తపట్నం ఎస్ఐ దాతృత్వం

● వృద్ధురాలికి రూ.10 వేల ఆర్థికసాయం

కొత్తపట్నం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం ఎస్ఐ వి.సుధాకర్ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఓ వృద్ధురాలి దీనస్థితిని చూసి చలించిపోయిన ఆయన రూ.10వేలను అందజేశారు. ఈతముక్కల గ్రామానికి చెందిన వేము వెంకాయమ్మ భర్త అంకయ్య ఈ నెల మూడవ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఆర్థిక పరిస్థితులు బాగు లేకపోవటం, ఈ పరిస్థితుల్లో వెంకాయమ్మ కాలు విరిగి మంచంలో ఉండటంతో చికిత్స అందించేందుకు కూడా డబ్బులు లేక పోవటంతో మనస్థాపానికి గురైన భర్త ఆత్మహత్యాయత్నం చేసిన అంకయ్య, రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఈ నెల 5వ తేదీన మరణించాడు. దీంతో వెంకాయమ్మ ఒంటరిగా మిగిలిపోయింది. నా అనే దిక్కులేక కదలలేని స్థితిలో పూరి గుడెసెలో ఉంటున్న ఆమె దీనస్థితిని తెలుసుకున్న ఎస్ఐ గురువారం ఆమె ఇంటికి వెళ్ళి రూ.10 వేలు అందజేసి ఆదుకున్నారు. స్థానికులు ఎస్ఐ దాతృత్వాన్ని కొనియాడారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

కొత్తపట్నం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీ కొత్తపట్నంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న కళ్యాణమండపంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు బ్యాంకు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు ఉపాస్ హాస్పిటల్ వైద్యులు వైద్యపరీక్షలు చేస్తారని, మందులు ఉచితంగా అందజేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య సూత్రాలను విధిగా పాటించాలి


వైద్యచికిత్సలను అందిస్తున్న డాక్టర్ రుచిత

మర్రిపూడి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య సూత్రాలు విధిగా పాటించాలని కాకర్ల వైద్యాధికారి సాయిరుచిత చెప్పారు. మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని పిన్నికవారిపాలెంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. ఫీవర్ సర్వే ప్రతి ఇంటికీ నిర్వహించామన్నారు. జ్వరాలు వచ్చి తగ్గినప్పటికీ వివిధ నొప్పులతో రోగులు బాధపడుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా నొప్పులతో బాధపడుతున్న పలువురికి వైద్య చికిత్సలు అందించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఏడుకొండలు, సీహెచ్‌వో సాయి, ఏఎన్ఎం బుజ్జమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలతో పిల్లల్లో మనోవికాసం

మద్దిపాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పిల్లల మనోవికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడతాయని సూపర్‌వైజర్ జ్యోతి పేర్కొన్నారు. గురువారం మద్దిపాడులో పూర్వ ప్రాథమిక విద్యా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ వస్తువులతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రాలకు పంపి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లోపాలే.. శాపాలుగా..!

పైపులైను లీకులతో తాగునీరు రోడ్డుపాలు ● పట్టించుకోని కార్పొరేషన్ యంత్రాంగం


రంగరాయుడు చెరువు సమీపంలో లీకు కారణంగా వృథాగా పోతున్న నీరు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. గతంలో వేసవిలో మాత్రమే తాగునీటి కోసం తంటాలు పడిన ప్రజానీకం నేడు అన్ని కాలాల్లోనూ అదే సమస్య ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే నగరంలో అధిక శాతం ఏరియాల్లో పాత పైపులైనులే ఉండటంతో పదేపదే లీకులు ఏర్పడుతుండగా, వాటిని నియంత్రించడంలో విఫలమయ్యారనే విమర్శలు బాగానే వినిపిస్తున్నాయి. గురువారం స్థానిక రంగరాయుడు చెరువు సమీపంలో లీకు కారణంగా తాగునీరు రోడ్డుపై పారుతోంది. దీంతో అటువైపు రాకపోకలు సాగించేవారు ఇబ్బందిపడ్డారు. ఇప్పటికైనా నగరంలో విచ్చలవిడిగా ఉన్న లీకులను పూర్తి స్థాయిలో నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అధికారులు నగరంలో డివిజన్‌ల వారీగా లీకుల జాబితా సిద్ధంచేసి, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పవన్‌కల్యాణ్‌పై జగన్ వ్యాఖ్యలు గర్హనీయం

మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌బాబు ● చీమకుర్తిలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేసిన జనసేన పార్టీ నేతలు


బస్టాండ్‌సెంటర్‌లో జగన్ దిష్టిబొమ్మ దహన చేస్తున్న చైర్మన్ విజయ్‌బాబు, నాయకులు

చీమకుర్తి, మార్చి6(ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌బాబు ధ్వజమెత్తారు. చీమకుర్తి బస్టాండ్ సెంటర్‌లో గురువారం సాయంత్రం జగన్‌మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను జనసేన పార్టీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చైర్మన్ అజయ్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి కందుకూరి బాబు, పార్టీ మండల అధ్యక్షుడు పల్లపు శివప్రసాద్ మాట్లాడారు. ఎన్నికల్లో 151 సీట్ల నుంచి 11సీట్లకు పడిపోవటంతో కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదన్న అసహనంలో జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని విమర్శించారు. తమ ఆరాధ్య నాయకుడు పవన్‌కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు అన్ని వర్గాల ప్రజలను మనస్థాపానికి గురి చేశాయన్నారు. మొదటిసారి కాబట్టి నిరసనలతో సరిపెడుతున్నామని, మరోసారి తమ అధినేతపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. పేటీఎం బ్యాచ్ తోకముడవటంతో చేసేదేమి లేక జగన్‌మోహన్‌రెడ్డినే స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్, నాయకులు ముత్యాల సురేష్, షేక్ యాసిన్, జొన్నలగడ్డ కోటి, వాసుబాబు, మురళి, వెంకట్రావు, కోటేశ్వరరావు, చంద్రశేఖర్, బ్రహ్మయ్య,రాజేష్, పి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు సేవ చేయడం నా అదృష్టం

● పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు
● ఘనంగా సత్కరించిన రైతులు


ఒంగోలులో ఈడీ శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న రైతు నాయకులు

ఒంగోలు(రూరల్), మార్చి6(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతుల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేశానని, వారి కోసం సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు టుబాకో బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శ్రీధర్‌బాబు ఉద్యోగోన్నతిపై బదిలీ కాగా గురువారం ఒంగోలులోని పొగాకు బోర్డు వేలంకేంద్రం-2లో ఆయనకు సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తాను జన్మించింది ఒంగోలులో అని, ఈక్రమంలో ఇక్కడి రైతులుకు సేవ చేసే అదృష్టం తనకు దక్కిందన్నారు. ఐఏఎస్‌గా ఇప్పటికి తనకు 16 సంవత్సరాలు సర్వీసు పూర్తయిందని, ఏడున్నరేళ్ల పొగాకు బోర్డులో కార్యదర్శిగా, ఈడీ పని చేసినట్లు తెలిపారు. రైతులతో ప్రయాణం ఎంతో సంతృప్తి ఇచ్చిందని, బోర్డులో రైతుల మేలు కోసం అనేక మార్పులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. రైతులకు ఎప్పటికీ తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం రైతు నాయకులు శ్రీధర్‌బాబు ను గజమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వేలం నిర్వహణాధికారి జె.తులసి అధ్యక్షతన జరిగి కార్యక్రమంలో బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్, ప్రొడక్షన్ మేనేజర్ కోవి రామాంజనేయులు, ఆర్ఎం ఎం.లక్ష్మణరావు, బోర్డు వైస్‌చైర్మన్ బొడపాటి బ్రహ్మయ్య, సభ్యుడు పొద వరప్రసాద్, పెనుబోతు సునీల్, వడ్లెళ్ల వరప్రసాద్, పోతుల నరసింహారావు, యర్రంనేని వెంకటశేషయ్య ,కాకుమాను వెంకటశేషయ్య, పోలవరపు వెంకటరామయ్య, బండారు రామాంజనేయులు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: పొగాకు రైతులకు సేవ చేసుకునే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ బాబు చెప్పారు. స్థానిక టుబాకో బోర్డు ఆవరణలో గురువారం ఆయనను రైతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, టుబాకో బోర్డు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు, ప్రొడక్షన్ మేనేజర్, వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు, రైతు సంఘం అధ్యక్షుడు పోతుల నరసింహారావు, రైతునాయకులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మక్కెన వెంకట్రావు తదితరలుఒ పాల్గొన్నారు.

ఎస్టీలపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

● ప్రజాసంఘాల నాయకుల డిమాండ్



ధర్నాలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

చీమకుర్తి, మార్చి6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన యానాది కుల మహిళలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించారు. అణగారిన కులాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఎరుకలహక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎం.ధర్మ, కేవీఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుడ్డు వెంకట్రావు, గిరిజన ప్రజాపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం, ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ తొరటి ఆనంద్ మాదిగ ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. ఎస్టీలపై హేయమైన రీతిలో దాడి నిర్వహించటమే కాక తిరిగి బాధితులపై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీ మహిళలకు తగిన సత్వరన్యాయం జరగకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. తదుపరి తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు బిరఘురామ్, రావినూతల కోటి, పాలడుగు విజయేంద్ర, దాసరి సుందరం, చావలి సుధాకర్, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, దాసరి రవి, రాంబాబు, వీరాంజనేయులు, పిన్నిక శ్రీనివాస్, చింతలపాలెం యలమందబాబు, వంశీ, ఇస్తర్ల శంకర్, జంగాల కోటేశ్వరరావు, బత్తుల మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలి

● డీఏహెచ్‌వో బేబీరాణి


మహిళా ఉద్యోగులతో కలిసి నృత్యం చేస్తున్న డాక్టర్ బేబీరాణి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ప్రావీణ్యత సాధించి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారి (డీఏహెచ్‌వో) బేబీరాణి పేర్కొన్నారు. ఒంగోలులోని అంబేద్కర్‌భవన్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలకు సమాజంలో ప్రత్యేక స్థానం సంపాదించుకునేందుకు ప్రభుత్వం అనేక అవకాశాలను కల్పించిందన్నారు. మహిళ ఏరంగంలోనైనా విజయం సాధిస్తుందని తెలిపారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళా ఉద్యోగులతో కలిసి బేబీరాణి నృత్యం చేశారు. కార్యక్రమంలో మార్కాపురం డీడీ రాఘవయ్య, వీపీసీ డీడీ డాక్టర్ జగత్ శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసు తిరుపాలు, గురవయ్య, శశి తదితరులు పాల్గొన్నారు.

నగరం కంపుకొడుతోంది..!

చెత్త సేకరణకు సక్రమంగా రాని సిబ్బంది
వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే..
నిర్లక్ష్యం వీడని శానిటేషన్ విభాగం


సీఆర్పీ క్వార్టర్స్ వద్ద చెత్తను తగలబెట్టిన సిబ్బంది


ఐడీఎస్ఎంటీ స్థలాల వద్ద పేరుకున్న చెత్తాచెదారం


దారవారితోట రోడ్‌లో పోగుపడిన చెత్త

పారిశుధ్యం మెరుగుకు పెద్దపీట.. స్వచ్ఛ ఒంగోలు సాధనే లక్ష్యం.. రియల్ టైం మానటరింగ్ సిస్టమ్‌తో ఇంటింటి చెత్త సేకరణ.. ఇదీ ఒంగోలు నగరపాలక సంస్థ అధికారుల వైపు నుంచి వినిపిస్తున్న మాట. ఆచరణలో అందుకు పూర్తిగా విరుద్ధం. నగరంలో ఇంటింటి చెత్త సేకరణ పరమ అధ్వానంగా మారింది. వీధులన్నీ చెత్తమయంగా మారాయి. ఏ వీధిలో చూసినా కుప్పలు తెప్పలుగా ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తున్నది. ఫలితంగా దోమల విజృంభణ. ఇదిలా ఉండగా, కాలువల్లో పూడిక తీత పనులు పట్టించుకునేవారు కరువయ్యారు. నగరపాలక సంస్థ నిర్లక్ష్యం కారణంగా మురుగునీరు రోడ్లపై ఏరులై పారుతున్నది. ఇప్పటికైనా శానిటేషన్ అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజారోగ్యం పట్టించుకోవాలని కోరుతున్నారు. గతంలో ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ జరగ్గా, ప్రస్తుతం ఆ విధానం రద్దు చేసి, పాత పద్ధతిలోనే పుష్‌కార్టుల ద్వారా, ఇంటింటి చెత్త సేకరణ జరుగుతుందని అధికారులు వెల్లడించారు. అయితే వీధుల్లో చెత్తను పట్టించుకునే నాధుడే కరువైపోగా, ఇంటింటి చెత్త సేకరణకు ఒకరోజు వస్తే వారం రోజులు పారిశుధ్య సిబ్బంది రాకపోడంతో రోజుల తరబడి చెత్త ఇంటికే పరిమితం అవుతుంది. దీంతో నగరంలోని పారిశుధ్యంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

● నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం అన్నవరప్పాడు సర్వేనెంబరు 7లో మార్కెట్‌విలువతో నాల్గవ తరగతి ఉద్యోగులకు కేటాయించిన స్థలాలను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిగుంట వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక సంఘ కార్యాలయంలో నాయకులు పూల శ్రీనివాసరావు, గోసు సుబ్బారాయుడుతో కలిసి గురువారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ విలువ ప్రకారం 1972లో 9.70 ఎకరాలు కేటాయించగా ఆ భూమిలో నాల్గవతరగతి ఉద్యోగులకు 144ప్లాట్లుగా విభజించి ఇచ్చారన్నారు. మరో 1.10 ఎకరాల భూమిని రిజర్వుగా ఉంచారని, అయితే ఆ స్థలాన్ని చిరంజీవి అనే వ్యక్తి ఆక్రమించుకొని ఆ భూమిని ప్లాట్లుగా విభజించి అమ్మకాలు చేశారని చెప్పారు. ఈ విషయాన్ని తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళామనే ఉద్దేశంతో తమపై తప్పుడు ఫిర్యాదులు చేస్తూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తమపై అనేక తప్పుడు కేసులు కూడా పెట్టారన్నారు. అనేక అక్రమాలకు పాల్పడిన చిరంజీవిపై అనేక కేసులు కూడా నమోదయ్యాయని, అయినా తమపై అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ మానసికంగా ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని వారు కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జరిగిన ఎమ్మెలీసీ ఎన్నికల్లో బీజేపీ, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులు విజయం సాధించడంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిరసనగండ్ల శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమిప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాజశేఖర్, శ్రీనివాసనాయుడు, తెలంగాణ నుంచి అంజిరెడ్డి, కొమరయ్య గెలుపొందారని తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

రేపు వైసీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం కార్యక్రమాలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఈనెల 8వతేదీన జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో మహిళలు అధికంగా సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ మహిళావిభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ కోరారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని నియోజకవర్గాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు, నియోజకవర్గాల నాయకులు, మహిళా కార్యకర్తల కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి, నాయకులు భూమిరెడ్డి రమణమ్మ, ఇందిర, పేరం ప్రసన్న, సయ్యద్‌అఫ్సర్, ఝాన్సీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రణాళికలు

ఒంగోలు క్రైం, మార్చి6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా తెలిపారు. గురువారం ఒంగోలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాయలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 30 మండలాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించారు. కార్యకర్తలు, నాయకులు పనిచేసి పార్టీకి పూర్వ వైభవ తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మన్నం ప్రసన్నరాజు, నాయకులు వెంకటకృష్ణరెడ్డి, పాలపర్తి విజేష్‌రాజు పాల్గొన్నారు.

కార్మికులకు సామగ్రి అందజేత

మద్దిపాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యదర్శి నూరుల్లా, వార్డు సభ్యుడు నూనె శ్రీనివాసరావు చేతులమీదుగా గురువారం పారిశుధ్య సామగ్రి అదజేశారు. ఈ సందర్భంగా కొబ్బరినూనె, సబ్బులు, వాటర్ ప్రూఫ్ మాస్ మొదలైన వస్తువులను వారు అందించారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

మద్దిపాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ శివరామయ్య పేర్కొన్నారు. గురువారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీ నుంచి నూతన వాహన చట్టం అమల్లోకి వచ్చిందని, దాని ప్రకారం హెల్మెట్ ధరించని వాహనదారులకు రూ.1000 జరిమాన విధిస్తామన్నారు. బైక్ వెనుక కూర్చున్న వారికి సైతం హెల్మెట్ తప్పనిసన్నారు. కొత్త వాహన చట్టం గురించి మండలవ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని వివరించారు.

సొసైటీ ద్వారా వ్యాపార రుణాలు

మద్దిపాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నందిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు వాణిజ్య వ్యాపారాలకు సహకారం అందించనున్నట్లు సంఘం చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మద్దిపాడులోని సొసైటీ కార్యాలయం వద్ద రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు పంట రుణాలతో పాటు వాణిజ్య కార్యకలాపాలుకు సైతం రుణాలు అందిస్తామన్నారు. రికార్డులు కంప్యూటీకరణ చేస్తామని తెలిపారు. సీఈవో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సొసైటీ ద్వారా కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామని , రైతులు విరివిగా డిపాజిట్లు చేసుకోవాలని, అధిక వడ్డీ ఇస్తామన్నారు. పాత సభ్యత్వాలు కలిగిన వారు రూ.10వేలు డిపాజిట్ చేస్తే ఓటు హక్కు వస్తుందని ఆయన పేర్కొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు

కొండపి, మార్చి6 (ఆంధ్రజ్యోతి): ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియెట్ (ఇంగ్లీషు మీడియం)లో ప్రవేశానికి దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 13వ తేదీకి వరకు పొడిగించిందని ఎంఈవో-2 కె. సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు విద్యార్థినుల ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం పద్మజ

సింగరాయకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతసింగరాయకొండ హైస్కూల్‌కి చెందిన విద్యార్థినులు మోటుపల్లి అఖిలాండేశ్వరి, అద్దంకి వర్షిణి సైన్స్‌పట్ల ఆసక్తిని పెంపొందించడానికి కేంద్రప్రభుత్వం అందజేసే ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికయ్యారు. దీంతో ఒక్కొక్క విద్యార్థినికి ప్రాజెక్ట్ తయారీకి రూ. 10 వేలు ప్రభుత్వం అందజేస్తుంది. వీరు తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయిలో ప్రదర్శిస్తారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థినులను హెచ్ఎం సీహెచ్.పద్మజ, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు అభినందించారు.

వ్యవసాయానికి 9 గంటల నిరంతర విద్యుత్ : ఏఈ

మద్దిపాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయానికి 9 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ చెన్నారెడ్డి గురువారం తెలిపారు. ఎటువంటి కోతలు విధించటం లేదని, మండలంలో విద్యుత్ సమస్యలు ఉండటంతో కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేశామన్నారు. లోవోల్టేజీ సమస్య అధిగమించేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలో 24 గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అధిక లోడు ఉన్న గ్రామాల్లో ఇప్పటికే సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అవీ..ఇవీ

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతి చెందిన వెంకటరమణ

బేస్తవారపేట, మార్చి6(ఆంధ్రజ్యోతి): స్తంభంపై వీధిలైట్లు బిగిస్తూ, విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పీవీ.పురం గ్రామంలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన మీనగ వెంకటరమణ(23) కొన్ని రోజులుగా సంబంధిత లైన్‌మెన్ వద్ద ఒప్పంద పద్ధతిన పనిచేస్తున్నాడు. గురువారం వీధిలైట్లు బిగిస్తుండగా షాక్‌కు గురై మృతి చెందాడు. వెంకటరమణ తండ్రి మతిస్థిమితం లేకుండా ఉన్నాడు. దీంతో తల్లిదండ్రులను వెంకటరమణ పోషిస్తున్నాడు. ఆయన మృతితో కుటుంబ శోకసముద్రంలో మునిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచార ఘటనపై కేసు నమోదు

త్రిపురాంతకం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారం చేశాడన్న ఆరోపణలో యువకుడిపై త్రిపురాంతకం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మండలంలోని ఎండూరివారిపాలెంకు చెందిన మానసిక దివ్యాంగురాలు(25) మంగళవారం రాత్రి గేదెలకు గడ్డి వేసేందుకు వెళ్లింది. అదే గ్రామానికి చెందిన చప్పిడి కోటేశ్వరరావు తన గేదె కనిపించడంలేదని ఆ యువతి వద్దకు వచ్చాడు. సమీపంలో దిబ్బ వద్దకు లాక్కెళ్లి అత్యాచారం చేసినట్లు బాధిత యువతి పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొంది. అనంతరం పొలం నుండి వచ్చిన తన తమ్ముడి సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్.శివబసవరాజు తెలిపారు.

కందిపైరు, వరిగడ్డి దగ్ధం


దగ్ధమవుతున్న కంది పైరు

తర్లుపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక ఉన్న పొలాల్లో గురువారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు వేయడంతో కందిపైరు, వరిగడ్డి వాములు, పొలాల్లో ఉన్న స్ప్రింక్లర్ పైపులు దగ్ధమయ్యాయి. దీంతో రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. గుమ్మ చిన్న వెలుగొండయ్య పొలంలో 3 ఎకరాల్లో ఉన్న కందిపంట పూర్తిగా దగ్ధమైంది. బుర్రి నరసింహులు చేలోని వరిగడ్డి వామి, అలాగే పొలంలో ఉన్న స్ప్రింక్లర్ పైపులు, కేబుల్ వైరు పూర్తిగా దగ్ధమయ్యాయి. పెను గాలులు వీయడంతో దాదాపుగా 20 ఎకరాల పొలంలో ఎండుగడ్డికి నిప్పు అంటుకొని దగ్ధమైంది. ఈ విషయాన్ని మార్కాపురం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వాహనం రావడం ఆలస్యం కావడంతో గ్రామంలో ఉన్న నీళ్ల ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకుని ప్రజలు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. తర్వాత మార్కాపురం నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపులోనికి తెచ్చింది. మరో నిమిషం ఆలస్యం అయితే బుర్రి నరసింహుల పొగాకు పాకాకు నిప్పు అంటుకుని భారీ నష్టం వాటిల్లేది. నష్టపోయిన కంది పంటకు, పైపులకు, వరిగడ్డికి నష్ట పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

- గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఘటన


వైద్యశాలలో చికిత్స పొందుతున్న కాశిరెడ్డి

మార్కాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం సాయంత్రం సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో మండలంలోని రాయ వరం గ్రామానికి చెందిన కంది చిన్నకాశిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు చిన్నకాశిరెడ్డి వ్యక్తిగత పనులు చూసుకుని మార్కాపురం నుంచి మోటార్ సైకిల్‌పై రాయవరం వెళ్తున్నాడు. ఈ క్రమంలో సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి చిన్నకాశిరెడ్డి ఎగిరిపడ్డాడు. గాయాలపాలైన క్షతగాత్రున్ని 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- సుందరయ్య కాలనీ వాసులు ఆందోళన


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దదోర్నాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుందరయ్య కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.సోమయ్య మాట్లాడుతూ కొన్నిరోజులుగా కాలనీలో నీటి సమస్య తలెత్తిందన్నారు. కూలికి వెళ్లేవారు సైతం పనులు మానుకొని నీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. డబ్బులిచ్చి నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి శివకోటేశ్వరరావుకు అందజేశారు. స్పందించిన కార్యదర్శి మాట్లాడుతూ సాయంత్రానికి నీటిసమస్య లేకుండా చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తదనంతరం విద్యుత్ కార్యాలయం వద్దకు వెళ్లి స్తంభాలకు తీగలు లేవని, ఉన్నా సరఫరా సక్రమంగా ఉండడం లేదని తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పత్రాన్ని ఏఈనాయక్‌కు అందజేశారు. పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, దావీదు, ఏసోబు, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈవోగా నాగయ్య

గిద్దలూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం జెల్లివారి పుల్లలచెరువు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీనెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా మల్లవరపు నాగయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు బాపట్ల జిల్లా అగస్త్యేశ్వరస్వామి దేవస్థాన ఈవోగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై బదిలీ అయి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోగా పని చేస్తున్న రమేష్ వల్లూరమ్మ దేవస్థానానికి బదిలీ అయ్యారు.

సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

- మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి
- మహిళాదినోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలన
- లోటుపాట్లుకు తావివ్వకూడదని ఆదేశం


సీఎం పర్యటన ఏర్పాట్లపై మాట్లాడుతున్న మంత్రి స్వామి

మార్కాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలకు మార్కాపురం రానున్నారని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని సాయిబాలాజీ స్కూల్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ప్రధానవేదికను ఆయన పరిశీలించారు. అల్లూరి పోలేరమ్మ గుడివద్ద కార్యకర్తల సమావేశం కోసం జరుగుతున్న వేదిక పనులను, కొండేపల్లి వెళ్లే దారిలోని హెలీప్యాడ్‌లను కూడా మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను యుద్ధప్రాతిపదికన శుక్రవారం మధ్యాహ్నానికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి స్వామి మాట్లాడుతూ మార్కాపురం లాంటి వెనుకబడిన ప్రాంతంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం అదృష్టంగా భావించాలన్నారు. మహిళాదినోత్సవ వేడుకల్లో విజన్- 2047లో భాగంగా మహిళల స్వావలంబన కోసం మెప్మా, డీఆర్‌డీఏలతో కొన్ని ఎంవోయూలు చేసుకుంటా రన్నారు. మహిళల కోసం ఉద్దేశించి రూపొందించిన శక్తియాప్‌ను కూడా ఈ కార్యక్రమంలోనే ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. అన్నిరంగాల్లోని మహిళలతో రెండు గంటలపాటు ముఖాముఖి ఉంటుందన్నారు. మహిళల సాధికారత, భద్రత, అభివృద్ధి తదితర అంశాలపై చర్చ సాగుతుందన్నారు. కార్యక్రమం అనంతరం పార్టీకి వెన్నుదన్నులాంటి కార్యకర్తలతో సమావేశం జరుగుతుందన్నారు. కార్యకర్తలతో నేరుగా మాట్లాడి వారి కష్ట, సుఖాలు, పార్టీపరిస్థితి, పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడుతారన్నారు. కార్యక్రమ అనంతరం జిల్లా అభివృద్ధిపై పలు కీలక విషయాలపై జిల్లా అధికారులతో సమీక్ష ఉంటుందన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పనులు, జిల్లాకు అవసరమైన మేర జరగాల్సిన అభివృద్ధిపై అధికారులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. కార్యక్రమంలో మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్, మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, జిల్లా, డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

శరవేగంగా ఏర్పాట్లు

ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి తొలుత ఎస్‌వీకేపీ కళాశాల, దరిమడుగు వద్ద స్థలాలను బుధవారం ఎంపిక చేశారు. కానీ కళాశాలలో పరీక్షలు ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు అక్కడ నిర్వహించలేమని తేల్చారు. అంతేకాక కార్యక్రమం పొదిలికి మారిందంటూ వదంతులు వ్యాపించడంతో గందరగోళం నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే నారాయణరెడ్డి వేకువజాము నుంచి తర్లుపాడు రోడ్డులోని పలు ప్రాంతాలను పరిశీలించారు. చివరికి 2023లో మూడు రోజులపాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బసచేసిన సాయిబాలాజీ స్కూల్ సమీపంలోని స్థలాన్నే ఎంపిక చేశారు. దీనికి జిల్లా అధికారులు కూడా అంగీకారం తెలిపారు. స్కూల్ ఎదురుగా ఉన్న 5 ఎకరాల పొలంలో మహిళా దినోత్సవ వేడుకల వేదికతోపాటు స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు మార్కింగ్ ఇచ్చి పనులు ప్రారంభించారు. అదేవిధంగా కార్యకర్తలతో సమావేశానికి కూడా అక్కడికి సమీపంలో అల్లూరి పోలేరమ్మ దేవస్థానం ఎదురుగా ఉన్న స్థలాన్ని ఎంపిక చేశారు. హెలీప్యాడ్‌కు కూడా నూతన స్థలాన్ని ఎంపిక చేశారు. పోలేరమ్మ గుడిదాటిన తర్వాత కొండేపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలోని స్థలాన్ని అనువైనదిగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి ఏర్పాట్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏర్పాట్లను శుక్రవారం మధ్యాహ్నానికే పూర్తి చేయాలని మంత్రి స్వామి ఆదేశించడంతో ఆ దిశగా జిల్లా అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా పూలసుబ్బయ్య కాలనీ చివరి నుంచి సభాస్థలి వరకు రహదారి 250 మీటర్ల మేర ఛిద్రమైంది. దాన్ని కూడా యుద్ధప్రాతిపదికన పునర్నిర్మిస్తున్నారు. పనులను అన్ని శాఖలకు చెందిన అధికారులకు జిల్లా కలెక్టర్ కేటాయించి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి పోలీసు స్టేషన్ నుంచి అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన ప్రాంతాలకు శుక్రవారం మధ్యాహ్నానికి చేరుకోవాలని సూచించారు.

పనుల్లో నాణ్యత తగ్గకుండా చూడాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు


హాస్టళ్ల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల మరమ్మతు పనుల్లో నాణ్యత తగ్గకుండా చూడాలని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అధికారులకు సూచించారు. దోర్నాలలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఎగువచెర్లోపల్లి పంచాయతీకి స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ద్వారా కేటాయించిన ట్రాక్టర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఇటీవల మంజూరైన రూ.30లక్షల నిధులతో చేపట్టిన ఎస్సీ, బీసీ వసతిగృహాల భవనాల మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా నిర్మాణ పనులు చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ క్రమంలో ఎస్టీ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషారావు ఎస్టీ బాలుర పాఠశాలకు స్థలం కేటాయించారన్నారు. పాఠశాల భవనం లేక హాస్టల్‌లో తరగతులు నిర్వహించాలసి వస్తోం దని, శాశ్వత భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించాలని గూడూరిని కోరారు. పూర్తి నివేదికలతో ప్రభుత్వానికి అందజేసి మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పంచాయతీ గ్రామ కార్యదర్శి నలగాటి శివకోటేశ్వరరావు, టీడీపీ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, షేక్ మాబు, ఈదర మల్లయ్య, చంటి, కే.సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ భాష, చల్లా వెంకటేశ్వర్లు, ఎలకపాటి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వివిధ పోటీ పరీక్షలలో పాల్గొనే విద్యార్థులు కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జనవిజ్ఞాన వేదిక పట్టణ కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. స్థానిక నెహ్రూ బజార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐక్యూ కోచింగ్ సెంటర్‌లో రామాంజనేయులు మాట్లాడారు. ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్, ఎన్‌ఎంఎంఎస్ తదితర ప్రవేశపరీక్షల విద్యార్థులకు అవసరమైన చేతిరాతశిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు భాషలో ప్రావీణ్యతను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు జి.సాయి కృష్ణచౌదరి, ఎ.శంకర్‌రెడ్డి, జేవీవీ నాయకుడు ఏనుగుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం


సభ్యత్వం నమోదు చేస్తున్న యూనియన్ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలోని కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఏపీఈఈయూ 1104 యూనియన్ సీనియర్ నాయకులు తాటిపర్తి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక విద్యుత్ కార్మిక భవనంలో ఆ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. యూనియన్ ఏ ఒక్క కులానికో, వర్గానికో చెందినది కాదన్నారు. కార్మికుడే నాయకుడిగా ఉంటూ కార్మిక సమస్యలను పరిష్కరించేందుకు యూనియన్ ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాంతీయ శాఖ కార్యవర్గ సభ్యులు సురేష్, ఏవీ ప్రతాప్, యూ.రవిశంకర్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.మల్లికార్జునరావు, రవికాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ ఉస్మాన్, నాయకులు షేక్ ముబారక్, ఖాదర్ బాషా, నన్నే సాహెబ్, శివరామకృష్ణ, రమణారెడ్డి, జోసఫ్, రామలింగారెడ్డి, రమణమూర్తి, బంగారు రెడ్డి, ఎ.రమేష్, సయ్యద్ రెహమాన్, బి.పుల్లారెడ్డి, కె.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

చెంచుగిరిజనుల అభ్యున్నతికి సమష్టి కృషి

శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్



మాట్లాడుతున్న శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి) చెంచుగిరిజనుల అభ్యున్నతికి సమష్టిగా కృషి చేయాలని శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన కుటుంబాలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్న వారి జీవితాల్లో పూర్తి స్థాయిలో మార్పులు రావడం లేదన్నారు. వారి కుటుంబాల్లో మార్పులు రావాలంటే చదువుకోవాలని కోరారు. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, ప్రజలు కలిసి వారి అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాస్టీ రంగారావు మాట్లాడుతూ 39 సంవత్సరాల నుంచి గిరిజన కుటుంబాల కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. మార్కాపురం, గోళ్లపల్లి, వెల్దుర్తిలలో బాలికలకు, బాలురులకు వసతిగృహం ఏర్పాటు చేసి విద్య అందిస్తున్నామన్నారు. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో 34 గ్రామాలలో ఈ ప్రాజెక్టు ద్వారా నీరు, విద్య, రోడ్లు, పొలాలు సాగు తదిర వాటి అభివృద్ధి కోసం మూడు సంవత్సరాలుగా పని చేయనున్నట్లు తెలిపారు. వారి అభివృద్ధి కోసం తమ సంస్థ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ హ్యూమన్ రిసోర్స్ పర్సన్ జాస్టీ విష్ణుప్రియం, ఎంఈవో పి. ఆంజనేయులు, ఐటీడీఏ ఎర్రగొండపాలెం ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు, గిరిజనుల కార్పొరేషన్ డైరెక్టర్ చెవుల అంజయ్య, వెంకటాద్రిపాలెం, గంజివారిపల్లి, గారపెంట సర్పంచులు బోడా శ్రీశైలపతినాయుడు, సుబ్బారెడ్డి, సిబ్బంది టి.రామరావు, పి రవి బాబు, మూర్తి, ఏ.శ్రీనివాసరావు, డి వెంకట్రావు, గిరిజనులు పాల్గొన్నారు.

మినీ గురుకులాన్ని తనిఖీ చేసిన పీవో

ఎర్రగొండపాలెం రూరల్ : బాలికల విద్య పట్ల ఏవరైన అశ్రద్ధ చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వెంకటశివప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని మిల్లంపల్లిలోని మినీ బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బాలికవిద్య పురోగతిని పరిశీలించారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో ఎక్కడైన విద్యార్థులు చదవడం, రాయడం వచ్చి ఉండాలన్నారు. ప్రతి పాఠశాలలో డ్రాపౌట్ అనేది ఉండకూడదని 100 శాతం హాజరు ఉండాలని అన్నారు. సెలవుల సమయంలో వారి వారి గ్రామాలకు వెళ్లిన పుడు తిరిగి రాకుండ అక్కడే ఉంటే ఉపాధ్యాయ, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యయ సిబ్బంది బాలికల విద్య, వసతి, ఆరోగ్యం తదితర వాటిపై అశ్రద్ధ చేయరాదన్నారు. స్టడి నిర్వాహణ ఎప్పటికప్పుడు ఐటీడీఏ వాట్సప్ గ్రూపులో పోటోలు పెట్టాలని సూచించారు. ఆయన వెంట వై.పాలెం ఐటిడీఏ ప్రత్యేకా ధికారి నాగేశ్వరరావు, బాలికల విద్యాలయ ప్రదానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు

- ఏవో జవహర్‌లాల్ నాయక్

పెద్దదోర్నాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిసేద్యంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో జవహర్‌లాల్‌నాయక్ అన్నారు. మండలంలోని చిల్లంచెర్ల గ్రామంలో గురువారం 'పొలంపిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని, సిఫారసు మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. వేపనూనె, కషాయాల ద్వారా చీడపీడలను అరికట్ట వచ్చన్నారు. కార్యక్రమంలో వీఎస్ఏ సద్రక్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

గిద్దలూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వాసవి వనితాక్లబ్ ప్రతినిధులు పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి వనితాక్లబ్ అధ్యక్షురాలు గర్రె సాహితీ, కార్యదర్శి రజని, చిన్నిసేవాసంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్, హెచ్‌ఎం అనురాధ పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవ పూజ

గిద్దలూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మాగాంధీ సెంటర్‌లో వెలసిన శ్రీసర్వసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో గురువారం 21వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహాగణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రాలలో తనిఖీ

గిద్దలూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ ఆంజనేయరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గణితం, బోటని, సివిక్స్ ఒకేషనల్ పరీక్షలు నిర్వహించారు. 971 మందికి 108 మంది గైరుహాజరు కాగా 863 మంది పరీక్షలు రాశారు.

ఆటపాటలతో అంగన్‌వాడీ కేంద్రాల్లో సందడి

కంభం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక తెలుగువీధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆటపాటలతో సందడి చేశారు. స్త్రీశక్తి, మహిళ సాధికారతపై అవగాహన కల్పిస్తూ పలు ఆటల పోటీలు నిర్వహించారు. మహిళల హక్కులను, బాధ్యతలను వివరించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగచెంచులక్ష్మి, అంగన్‌వాడి కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు


పెచ్చులూడుతున్న తహసీల్దార్ కార్యాలయ గది

కంభం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. ముఖ్యంగా మండల తహసీల్దార్ కార్యాలయం, విద్యుత్ ఏడీ, బిల్లుల చెల్లింపు గదుల్లోని పైకప్పు పెచ్చులూడి ఇనుప చివ్వలు దర్శనమిస్తున్నాయి. సిబ్బంది పనిచేసే సమయంలో పైపెచ్చులూడి మీద పడడంతో భయం భయంగా పనులు చేయాల్సి వస్తుంది. పైకప్పు పెచ్చులూడుతున్న కార్యాలయాల పరిస్థితిపై గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి కలెక్టర్, ఉన్నతాధికారులకు నివేదికలు అందించినా నిధులు విడుదల చేయలేదని అధికారులు వాపోతున్నారు. వర్షాకాలంలో పెచ్చులూడిన ప్రాంతంలో వర్షం నీరుగారి ఎక్కడ నెత్తిన పడుతుందని విధులు నిర్వహిస్తున్న సిబ్బంది భయంగా కాలం వెల్లదీస్తున్నారు. వీఆర్‌వోల గదిపై రావిచెట్టు మొలచి వేర్లు గదుల్లో రావడంతో గోడల వెంట చెమ్మకారుతోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఉన్నతాధి కారులు స్పందించి గదుల మరమత్తులు చేయించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

వైభవంగా రుక్మిణి సత్యభామ శ్రీకృష్ణ కల్యాణం

- లక్ష్మీనారాయణస్వామికి బ్రహ్మోత్సవాలు
- ఇడమకల్లులో పట్టాభిరామస్వామి ఆలయ జీర్ణోద్ధరణ

మార్కాపురంవన్‌టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన ఆమలక లక్ష్మీ నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం వేదపండితులు రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుని కళ్యాణం భక్తజన రంజకంగా నిర్వహించారు. రుక్మిణి సత్యభామ శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కల్యాణానికి ముత్యాలు తలంబ్రాలు సమర్పించారు. కమిటీ సభ్యులు డా.డీవీ.కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, ఎస్.యోగిరెడ్డి, వెంకటరెడ్డి, మహిళా కమిటీ, వికాస తరంగిణి సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.


కల్యాణంలో రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుడు, పాల్గొన్న భక్తులు

కొమరోలు : మండలంలోని ఇడమకల్లు గ్రామంలో కల్యాణ, పట్టాభిరామస్వామి ఆలయ జీర్ణోధరణ ధ్వజ స్తంభ, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఈ నెల 6 నుంచి 10వరకు నిర్వహించనున్న మని నిర్వాహకులు తెలి పారు. 6న గురువారం ఉదయం గణపతిపూజతో ప్రారంభమై పంచాంగ శ్రవణం, రక్షాబంధన్, మాతృకాపూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ, వాస్తు , సర్వతో భద్రద్రి మండల ఆరాధన, ఆవహనాలు, జప పారాయణ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ ప్రత్యేక తిరునాళ్లను బద్వేలు బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణ శర్మతో వేదపండితుల పర్యవేక్షణలో భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్త తంగా పూజలు నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్టను గ్రామస్థులు కలసిమెలసి నిర్వహిస్తున్నారు. ముందుగా గ్రామానికి చెందిన దంపతులతో యాగశాలను ప్రారంభించారు. అంకురార్పణ, అగ్నిప్రతిష్ట, దీక్షాహోమ ము, రాత్రి 9 గంటలకు రామయణంలోని కొన్ని అంశా లను నాట్యంరూపంలో భరతనాట్యంను ప్రదర్శించారు. ఈనెల 8న శనివారం రాష్టస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలను నిర్వహించనున్నారు.


ఇడమకల్లులో ప్రాణప్రతిష్టకు సిద్ధంగా ఉన్న సీతారాముల విగ్రహాలు

ముఖాముఖి

అన్నిగ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

టి.త్యాగరాజు, ఎస్‌ఐ, దొనకొండ



ప్రశ్న: మండలంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారా ?

జవాబు: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజలకు మెరుగైన సేవలందించాలనే ధ్యేయంతో గ్రామాల్లోని ప్రధాన కూడళ్ళ వద్ద గ్రామస్థుల సహకారంతో ఆధునిక సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. దాతలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరిస్తే టెక్నాలజీ ద్వారా ప్రజలకు వేగంగా సేవలందించే అవకాశం ఉంటుంది.

ప్ర: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు ?

జ: ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు విజుబుల్ పోలీస్ నిర్వహణ కొనసాగిస్తూ వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. హెల్మెట్ లేనివారిని, పరిమితికి మించి ప్రయాణికులతో వస్తున్న వాహనాలను, మద్యం సేవించి వాహనాలు నడిపే వారు, సీట్ బెల్ట్ పెట్టుకోని వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తూ ప్రభుత్వం నిర్ధేశించిన మేరకు చలానాలు వేస్తున్నాం.

ప్ర: గ్రామాల్లో నేరాల నియంత్రణకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు ?

జ: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 15 రోజులకొకసారి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఆసమయంలో గ్రామస్థులతో మమేకమై వారి సహకారంతో నేరాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. గ్రామాలను కానిస్టేబుళ్లకు దత్తత ఇస్తున్నాం. గ్రామాల్లోని ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ ప్రత్యేక నిఘాపెట్టి నేరాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం.

గ్యాస్ సిలిండర్ లీకై గృహోపకరణాలు దగ్ధం

దొనకొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ లీకై గృహోపకరణాలు దగ్ధమైన ఘటన మండలంలోని సిద్ధాయిపాలెంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన జి.నాగరాజు ప్రధాన రహదారి పక్కన దుకాణం ఏర్పాటుచేసుకొని నిత్యావసర వస్తువులతో పాటు సాయంత్రం తినుబండారాలు విక్రయిస్తుంటారు. ఈక్రమంలో సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. ఆసమయంలో అక్కడ ఉన్న ప్రజలు భయాందోళనలతో పరుగులు తీశారు. అప్రమత్తమైన పలువురు మంటలపై మట్టి, నీళ్లు పోసి ఉధృతం కాకుండా అదుపుచేశారు. ఈప్రమాదంలో నిత్యావసర వస్తువులు దగ్ధమై దాదాపు రూ.20 వేలు నష్టం జరిగినట్లు సమాచారం.

సాగర్ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కురిచేడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కురిచేడు సమీపంలోని సాగర్ ప్రధాన కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం వెలుగుచూసింది. కాటంవారిపల్లె గ్రామం వద్ద రైతులు కాలువ మీదుగా విద్యుత్ వైర్లు వేలాడదీశారు. ఆవైర్లు నీటిని తాకుతున్నాయి. కాలువ పైభాగం నుంచి ఓగుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చి విద్యుత్ వైర్లకు తట్టుకుని ఆగింది. వ్యక్తి మెడమీద గాయాలున్నట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. విద్యుత్ వైర్లను తాకి ఆగిన మృతదేహం కొద్దిసేపటికి దిగువకు కొట్టుకుపోయింది.

వీరాంజనేయస్వామి దేవాలయంలో హుండీ చోరీ

కురిచేడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కురిచేడు పంచాయతీ కాటంవారిపల్లె గ్రామంలోని వీరాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. హుండీని పగులకొట్టి అందులోని సుమారు రూ.40 వేలు అపహరించారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ శివ మార్కాపురం క్లూస్ టీంను పిలిపించారు. దేవాలయం పరిసరాలు, లోపల కొన్ని వేలిముద్రలు సేకరించారు. కార్యక్రమంలో ఎఐ శివ, క్లూస్‌టీం ఏఎస్‌ఐ ఇబ్రహీం, కానిస్టేబుల్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

సీఎస్‌పురం(పామూరు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరమణ రైతులకు సూచించారు. తద్వార తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చునని చెప్పారు. గురువారం మండలంలోని రేగులచిలకలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి సాగులో యాజమాన్య పద్ధతుల ద్వారా రైతులకు ఖర్చుతగ్గి అధిక ఉత్పత్తితో పాటు ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో బి.సంపత్‌కుమార్, కమ్యూనిటీ హెల్త్ అధికారి పి.శైలజ, విస్తరణాధికారి పావలి తిరుపతయ్య, వీఏఏ చిరంజీవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డుదారులకు పని కల్పించాలి

» డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్



సుంకరవారిపాలెంలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్

ముండ్లమూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డుఉన్న ప్రతిఒక్కరికి పని కల్పించాలని డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. గురువారం మండలంలోని సుంకరవారిపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.300 వేతనం పడేటట్టుగా కూలీలు పని చేయాలన్నారు. పని ప్రదేశంలో వడ దెబ్బకు గురి కాకుండా ఉండేందుకు షామియానాలు, మంచినీరు ఉంచాలన్నారు. ప్రతిరోజు మండలంలో 3500 నుంచి పదివేలలోపు కూలీలు పనికి వచ్చేవిధంగా చూడాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు మాత్రమే చేయాలన్నారు. జాబ్ కార్డు ఉన్న వారి స్థానంలో ఒకరికి బదులు, మరొకరు పని చేయటానికి వీల్లేదన్నారు. పని ప్రదేశంలోనే హాజరు తీసుకోవాలన్నారు. ప్రతి రైతు పొలంలో ఫాం పాండ్స్ నిర్మించుకొనే విధంగా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. మండలంలో వెయ్యి ఫాం పాండ్స్ లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు.

పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వం రాయితీ కూడా కల్పిస్తుందన్నారు. పశుపోషకులు ముందుకు వచ్చినట్లయితే ఎక్కువ గోకులం షెడ్లు మంజూరు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలనూ ఉపాధి నిధులతో చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ ఆర్.లలితకుమారి, ఏపీవో కె.నాగరాజు, ఈసీ శివరామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్‌లు నాగార్జున, బలరామ్, శ్రీనివాసులు, భారతి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు రామలక్ష్మయ్య, నందయ్య తదితరులు పాల్గొన్నారు.

కోనేరు అభివృద్ధికి చర్యలు

తాళ్లూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పవిత్రపుణ్యక్షేత్రమైన గుంటిగంగ సన్నిధిలో పాడుబడ్డ కోనేరును అభివృద్ధిచేసి పూర్వవైభవం తీసుకువస్తామని డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ తెలిపారు. మండలంలో గుంటిగంగ సన్నిధిలో నిరుపయోగంగా ఉన్న కోనేరును గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం మాట్లాడుతూ గతంలో కోనేరు నిత్యం ప్రవహిస్తూ ఉండేదన్నారు. గత కొంతకాలంగా కోనేరు పూడిపోయిందన్నారు. ఉపాధి పథకం ద్వారా నిధులు సమకూర్చి కోనేరు, పక్కనున్న పెద్దకుంటలో పూడిక తీతపనులు చేయించాలన్నారు. కోనేరుకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. దీనిపై స్పందించిన పీడీ జోసెఫ్ కోనేరులో పూడికతీత పనులకు అంచనాలు తయారు చేసి పంపాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ లలితకుమారి, ఈసీ గురుబాబు, టీఏ కోటేశ్వరరావు, ఎఫ్ఏ చాట్ల డానీ, తదితరులు పాల్గొన్నారు. పవిత్రపుణ్యక్షేత్రమైన గంగమ్మను డ్వామా పీడీ జోసెఫ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గురుబ్రహ్మం పీడీని శాలువాతో సత్కరించారు.

శరవేగంగా టీటీడీ కల్యాణ మండపం నిర్మాణ పనులు



దర్శి పట్టణంలోని తూర్పుగంగవరం రోడ్డులో జరుగుతున్న టీటీడీ కల్యాణ మండపం నిర్మాణ పనులు

దర్శి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని తూర్పుగంగవరం రోడ్డులో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చొరవతో నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో 2021 డిసెంబర్‌లో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి అప్పటి టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శంకుస్థాపన చేశారు. నిబంధనల ప్రకారం దాతల సహకారంతో రూ.50 లక్షల డిపాజిట్లు కూడా చెల్లించారు. ఆతర్వాత కల్యాణ మండపం నిర్మాణం గురించి వైసీపీ పాలకులు పట్టించుకోలేదు.

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కదలిక వచ్చింది ఎంపీ మాగుంట, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాత ఫైల్‌ను మళ్లీ కదిలించి నిధులు మంజూరు చేయించారు. గత డిసెంబర్‌లో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రూ.2 కోట్లతో నిర్మిస్తున్న టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం పనులు జరుగుతున్నాయి. నిర్మాణ పనులు పూర్తయితే దర్శి ప్రజలకు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు అనువుగా ఉంటుంది. ప్రస్తుతం ప్రైవేట్ కల్యాణ మండపాల్లో అద్దెలు విపరీతంగా ఉన్నాయి. టీటీడీ కల్యాణ మండపం అందుబాటులోకి వస్తే సామాన్యులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

» ఎంపీడీవో బ్రహ్మయ్య



మాట్లాడుతున్న ఎంపీడీవో బ్రహ్మయ్య

పామూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రవేశ పెట్టనున్న ఆదరణ - 3 పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు వెలుగు సీసీలు, వీవోఏలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఆదరణ - 2 పథకంలో ఇచ్చిన ఉపకరణలు బాగున్నాయా, లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం త్వరలో ఆదరణ - 3 పథకాన్ని ప్రవేశపెట్టనుందన్నారు. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైనవారు సద్వినియోగం చేసుకొనేలా చూడాలని కోరారు. గతంలో లబ్ధిదారులకు సంబంధించి కొందరికి డీడీలు ప్రభుత్వానికి చెల్లించినా ఇంత వరకు వారికి ఉపకరణాలు రాలేదని కొందరు ఆయన దృష్టికి తెచ్చారు. గతంలో ఇచ్చిన డీడీలు బీసీ కార్పొరేషన్‌లో ఉన్నాయని, వాటి వివరాలను అడిగి తెలుసుకొంటానని ఎంపీడీవో తెలిపారు. సమావేశంలో ఈవోపీఆర్డీ జీవీ అరవింద, కార్యాలయ పరిపాలనాధికారి చెన్నకేశవరెడ్డి, ఏపీఎం విద్యాసాగర్, ఆవుల రమణమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఓ.సుబ్బమ్మ, ఉమ్మడి పద్మ, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ

సీఎస్‌పురం(పామూరు) మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం మండలపరిషత్ అభివృద్ధి అధికారిగా పామూరు ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం.రంగ సుబ్బరాయుడు అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లారు. దీంతో తాత్కాలిక ఎంపీడీవోగా బ్రహ్మయ్యను నియమిస్తూ జడ్పీ సీఈవో కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. దీంతో బ్రహ్మయ్య బాధ్యతలు స్వీకరించారు.

పర్యావరణ సంరక్షణ జాతీయసభ్యుడిగా మస్తాన్‌వలి



జాతీయ సభ్యుడిగా నియమితులైన మస్తాన్‌వలి

తాళ్లూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ సంర క్షణ జాతీయ సభ్యుడిగా తూర్పుగంగవరం వాసి నియ మితులయ్యారు. తూర్పుగంగవరం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి దక్కన్ క్లాప్ ఇండియాస్ ఫస్ట్ పెయిటింగ్ కమ్ వాటర్ ప్రూఫింగ్ సర్వీస్ కంపెనీని ఢిల్లీలో ఏర్పాటుచేశారు. ప్రముఖ కంపెనీగా జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకుంది. ఈఅవార్డును గురువారం ఢిల్లీలోని లీలా ప్యాలెస్‌లో మస్తాన్‌వలి అందుకున్నారు.

అలాగే, వరల్డ్ కల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కమిషన్ ఇన్నోవేట్ ఎంటర్‌ప్రెన్యూర్ కేటగిరిలో మస్తాన్‌వలికి డాక్టరేట్ అందజేశారు. నేషనల్ మెంబర్ ఆఫ్ వరల్డ్ కల్చర్ అండ్ ఎన్విరాన్ మెంట్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యుడిగా నియమించారు. ఈనెల 5న ఢిల్లీలోని నెహ్రూ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో మస్తాన్‌వలిని సత్కరించి నియామకపత్రాన్ని అందజేశారు. అనేక అవార్డులు అందుకున్న దక్కన్ క్లాస్ సంస్థ నిర్వహకుడు షేక్‌మస్తాన్‌వలిని ప్రధానమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. పీఎం కార్యాలయం నుంచి మస్తాన్‌వలికి ప్రధాని మోడీ సంతకంతో అభినందన పత్రాన్ని అందజేశారు. పేద కుటుంబంలో జన్మించి స్వశక్తితో ఎదిగి ప్రధానమంత్రి మోదీ మనస్సు గెలుచుకున్న మస్తాన్ వలిని పలువురు అభినందించారు.

‘రక్షిత నీటితో ఆరోగ్యం’



ఫ్లోరైడ్ బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న సెంట్రల్ కమిటీ సభ్యులు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రక్షిత మంచినీటితో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జలజీవన్ సెంట్రల్ కమిటీ సభ్యులు ప్రవీణ్ సంతోష్, రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన సీఎస్‌పురంలో గురువారం జలజీవన్ మిషన్ సెంట్రల్ కమిటీ బృందం పర్యటించింది. వేసవి కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టేందుకు సెంట్రల్ కమిటీ బృందాలు రాష్ట్రంలో పర్యటిస్తున్నాయి. అందులో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సూచనల మేరకు సీఎస్‌పురంలో పర్యటిస్తున్నట్టు సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు మండల ప్రజలకు జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రక్షిత నీటిని అందించడమే లక్ష్యంగా సర్వే చేపడుతున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా మండలంలో తాగు నీటి కోసం నది జలాల వినియోగం గురించి బావులు, బోర్లు, స్టోరేజ్ ట్యాంకులు, వాగులను పరిశీలించారు. ఫ్లోరైడ్ ప్రభావం గురించి స్థానికులు, కిడ్నీ బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఇందుకుసంబంధించి జల్‌జీవన్ మిషన్‌కు నివేదిక అందజేస్తామని సభ్యులు తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మన బోయిన వెంగయ్య, సర్పంచ్ శ్రీరాం పద్మావతి, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ విశ్వనాథరెడ్డి, ఏఈలు జి.మోహన్‌రావు, వై.రమేష్, పంచాయతీ కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

సీఎస్‌పురం(పామూరు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సమస్యల పట్ల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరిని విడనాడి పరిష్కరించాలని రైతు సంఘం నాయకుడు ఊసా వెంకటేశ్వర్లు కోరారు. గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జాతీయ రహదారుల నిర్మాణంతో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించడంలో తాత్సారం చేస్తున్నారని అన్నారు. మూడు నెలలు గడుస్తున్నా బాధ్యతాయుతంగా అధికారులు వ్యవహరించడంలేదని ఆయన ధ్వజమెత్తారు. ఒకరికి నష్టపరిహారం అందిస్తే మరికొంత మంది వస్తారని రెవెన్యూ అధికారులు చెప్పటం దారుణమన్నారు. అధికారుల ప్రవర్తనతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎం.రత్నారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

వీసీపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీవో ప్రభాకర్‌శర్మ తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా 90 రోజులపాటు కుట్టు శిక్షణ ఇస్తుందన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు సచివాలయాలు, ఎంపీడీవో కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం కుట్టు మిషన్‌లను ఉచితంగా ఇస్తామని తెలిపారు.

త్వరితగతిన సర్వేలను పూర్తిచేయాలి

ముండ్లమూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ- 4 సర్వే ఎంతో ఉపయోగమని ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. గురువారం మండలంలోని మారెళ్ళ, జమ్మలమడక, ఈదర, పూరిమెట్ల గ్రామ పంచాయతీలను ఆయన సందర్శించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పీ - 4 సర్వే ను పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలను సిబ్బంది త్వరితగతిన పూ ర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులను ఈనెలాఖరుకు వంద శాతం పూర్తి చేయాలన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి వర్మీ కంపోస్టును తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జె.రాధాకృష్ణ, జె.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లింగంగుట్ల సర్పంచ్ చెక్ పవర్ రద్దు

కనిగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హనుమంతునిపాడు మండలం లింగంగుట్ల గ్రామ సర్పంచ్ రూ. 5 లక్షల మేర నిధులు దుర్వినియోగం చేసినట్లు అభియోగాలపై చెక్ పవర్ రద్దుచేస్తూ జిల్లా పంచాయతీ అధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో 15వ ఆర్థిక సంఘం నిధులను పనులు చేయకుండానే గోల్‌మాల్ చేశారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణచేసి రుజువైతే చర్యలు తీసుకోవాలని హనుమంతునిపాడు ఎంపీడీవోకు ఆదేశాలు జారీ చేశారు.

ఆరుతడి పంటలతో అధిక దిగుబడులు

ముండ్లమూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆరు తడి పంటలతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని దర్శి వ్యవసాయ పరిశోధనా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సంధ్యారాణి అన్నారు. గురువారం మండలంలోని వేంపాడులో మొక్కజొన్న పైరును ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఎటువంటి తెగుళ్ళు లేవన్నారు. ఈదిశలో పైరుకు క్రమం తప్పకుండా నీటి తడులు పెట్టాలని రైతులకు సూచించారు. మొక్కజొన్న ఆకులు చుట్టుకున్నట్టు కన్పిస్తే నీటి ఆవశ్యకత ఉన్నట్టుగా గుర్తించాలన్నారు. నీటి ఆధార పంటలు సాగుచేసి దిగుబడులు రాక రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రతిరైతు మొక్కజొన్న సాగు చేసుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు, మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకీర్తి, వ్యవసాయ శాఖ సహాయకుడు బాలవెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రామభద్రాపురంలో పూర్తయిన రీసర్వే

తాళ్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రామభద్రాపురం గ్రామంలో రీసర్వే పూర్తయినందున తప్పు ఒప్పులను పరిశీలించనున్నట్టు తహసీల్దార్ సంజీవరావు తెలిపారు. ఇందుకు రెవెన్యూ ఉద్యోగులు సన్నద్ధం కావాలన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రామభద్రాపురంలో రీసర్వే చేసిన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ మరణించిన రైతు వారసులకు, ఇతరులలో ఉన్న భూములకు, ఇతర హక్కుపత్రాలు ఉన్న రైతుల పేర్లను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసేందుకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ జె.ఇమ్మానియేల్‌రాజు, మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, రీసర్వే డీటీ ప్రశాంత్, వీఆర్వో చంద్రశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌ను సందర్శించిన విద్యార్థినులు

కురిచేడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కురిచేడు పోలీస్ స్టేషన్‌ను గురువారం కురిచేడులోని శ్రీ రాఘవేంద్ర ఉన్నత పాఠశాల విద్యార్థినులు సందర్శించారు. స్టేషన్‌లోని ఎస్‌ఐ గది, లాకప్ గదులు, విచారణ గదులు, ప్రత్యేకించి మహిళల విచారణ కోసం కేటాయించిన గదులను ఎస్‌ఐ శివ దగ్గరుండి చూపారు. తుపాకీ పనితీరును వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటినుంచి సీఐటీయూ శిక్షణ తరగతులు

దర్శి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా శిక్షణ తరగతులు ఈనెల 8, 9 తేదీల్లో దర్శి పట్టణంలో జరుగుతాయని ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.రంగారావు తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు రెండు రోజులపాటు నాలుగు అంశాలపై జరుగుతాయని తెలిపారు. అధిక సంఖ్యలో కార్మికులు, సీఐటీయూ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైసీపీ మండల కన్వీనర్‌ల నియామకం

దొనకొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ దొనకొండ మండల కన్వీనర్‌గా నరసింహనాయునిపాలెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కాకర్ల కృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు సమాచారం.

ముండ్లమూరు: వైసీపీ ముండ్లమూరు మండల కన్వీనర్‌గా పసుపుగల్లు మాజీ సర్పంచ్ చింతా శ్రీనివాసరెడ్డిని నియమితులయ్యారు. ఈమేరకు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి గురువారం నియామక ఉత్తర్వులు పంపారు.

తాళ్లూరు: వైసీపీ తాళ్లూరు మండల కన్వీనర్‌గా లక్కవరం గ్రామానికి చెందిన తూము వెంకటసుబ్బారెడ్డి రెండోసారి నియమితులయ్యారు. ఈమేరకు ఆపార్టీ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

కాంగ్రెస్ పార్టీ కురిచేడు మండల అధ్యక్షుడిగా మీరావలి

కురిచేడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కురిచేడు మండల అధ్యక్షుడిగా షేక్ చాంద్ మీరావలిని ఎంపిక చేశారు. డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా గురువారం ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. మండలంలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఈసందర్భంగా సైదా పేర్కొన్నారు. పార్టీ పటిష్టతకు తనవంతకు కృషిచేస్తానని మీరావలి తెలిపారు. తనను మండల పార్టీ అధ్యక్షుడిగా ఎంపిక చేసిన సైదాకు కృతజ్ఞతలు తెలిపారు.

తాళ్లూరు: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆదేశానుసారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా ఆపార్టీ తాళ్లూరు మండల అధ్యక్షుడిగా కూకట్ల వీరబ్రహ్మంను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. లక్కవరం గ్రామానికి చెందిన వీరబ్రహ్మం ప్రస్తుతం వైసీపీ జిల్లా ట్రేడ్ యూ నియన్‌లో కార్యదర్శిగా ఉన్నారు. ఆయనను కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించటం గమనార్హం.

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభం

సీఎస్‌పురం(పామూరు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా స్వామివార్ల విగ్రహాలకు నిర్వాహకులు పిడుగు బాబురావు ఆధ్వర్యంలో అర్చకులు నారాయణం వెంకట దీక్షితులు పర్యవేక్షణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పోలీస్‌స్టేషన్‌కు కంప్యూటర్ బహూకరణ

తాళ్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌కు తూర్పుగంగవరంకు చెందిన గూడా వెంకటరెడ్డి, సుబ్బమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం గూడా కుటుంబీకులు సీఐ రామారావుకు కంప్యూటర్ అందజేశారు. పోలీస్‌స్టేషన్‌లో కంప్యూటర్ లేక సిబ్బంది ఇబ్బంది పడుతుండటంతో గూడా కుటుంబీకులు ముందుకువచ్చి తమవంతుగా వితరణ అందజేశారు. పోలీస్ స్టేషన్‌కు కంప్యూటర్‌ను బహూకరించటం పట్ల సీఐ రామారావు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.మల్లికార్జునరావు, గూడా ప్రసాద్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సాయిఫణీంద్రరెడ్డి, చిన్నబ్రహ్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాబా బంగారు ప్రతిమ అందజేత

కనిగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సాయిబాబా బంగారు ప్రతిమను ప్రముఖ వ్యాపారవేత్త ముచ్చర్ల ధర్మారావు, పద్మజ దంపతులు బాబా ఆలయానికి గురువారం బహూకరించారు. బాబా ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రమణ్యం, పెన్నా వెంకటేశ్వర్లుకు ప్రతిమను అందజేశారు. సుమారు రూ.4 లక్షల విలువ గల్గిన బంగారు బాబా ప్రతిమను అందజేసిన ముచ్చర్ల ధర్మారావు దంపతులను అభినందించారు. బాబా బంగారు ప్రతిమకు విశేష పూజలు, అభిషేకాలు, వెండి పూలతో అష్టోత్తరం నిర్వహించారు. కార్యక్రమంలో బాబా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘పోలీసుల నిబంధనలతో ఇబ్బందులు పడుతున్నాం’

తాళ్లూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వాహనాలకు సంబంధించిన పత్రాలు లేవంటూ నిత్యం పోలీసులు అపరాధ రుసుం విధిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని గురువారం కొర్రపాటిపాలెం గ్రామస్థులు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వద్ద వాపోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసులు కొత్తనిబంధనలు పాటిస్తూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తాము పనుల నిమిత్తం నిత్యం తాళ్లూరుకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈక్రమంలో పోలీస్ స్టేషన్ సమీపాన వాహనాలను ఆపుతూ కాగితాలు లేవంటూ కేసులు రాస్తున్నారన్నారు. పోలీసులు కేసులు రాయకుండా చూడాలని డాక్టర్ లక్ష్మికి విన్నవించారు. దీనిపై ఆమె స్పందిస్తూ కూలీలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎస్సై మల్లికార్జునరావుకు సూచించారు.

టీడీపీ సీనియర్ నేత లక్ష్మీనారాయణ మృతిపట్ల సంతాపం

తాళ్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ కొర్రపాటి లక్ష్మీనారాయణ మృతి పట్ల ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పలువురు నేతలు సంతాపం తెలిపారు. ఇటీవల మృతి చెందిన లక్ష్మీనారాయణ దశదిన కర్మ కార్యక్రమంలో గురువారం ఆమె పాల్గొని సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య బుధవారం రాత్రి లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులను పరామర్శించారు. పరామర్శించినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, వేణుబాబు, కె.రామయ్య, కె.నరసింహారావు, పిన్నిక రమేష్, ఐ.శ్రీనివాసరెడ్డి, తూము శివనాగిరెడ్డి, చిరంజీవి, వెంకట్రావు, నుసుం ఆదినారాయణరెడ్డి, కల్యాణ్ చక్రవర్తి, లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.





రైతుల కోసం.. రైతుల పేరిట ఏర్పాటు చేసిన సహకార సంఘాలు అక్రమాలకు నెలవుగా మారాయి. సాంకేతిక పరిజ్ఞానంతో ఇక నుంచి అక్రమాలకు ఆస్కారం లేకుండా.. రుణాల విషయంలో పారదర్శక పద్ధతి అవలంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల సహకార వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సహకార వ్యవస్థను పట్టాలెక్కించే దిశగా అడుగులు వేస్తోన్నది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే పీఏసీఎస్‌లలో జరిగిన అక్రమాలపై దృష్టి పెట్టి అవి పునరావృతం కాకుండా డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే సొసైటీల్లో దాదాపు 95 శాతం ఖాతాలను ఆన్‌లైన్‌చేశారు. సొసైటీలలో జరిగే అవకతవకలకు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా అడ్డుకట్ట పడనుందని తద్వారా పీఏసీఎస్‌ల బలోపేతానికి కంప్యూటరీ కరణ ద్వారా ప్రభుత్వం తొలి అడుగు వేసినట్లయింది.

- సొసైటీల్లో కొలిక్కి వచ్చిన కంప్యూటరీకరణ

సహకారం.. సాంకేతికం

- ఏప్రిల్ నుంచి పీఏసీఎస్‌ల్లో డిజిటల్ లావాదేవీలు


గతంలో అక్రమాలకు సహకారం

ఐదేళ్ల వైసీపీ హయాంలో పీఏసీ ఎస్‌లను అన్ని విధాలుగా కునారిల్లేలా చేసింది. ప్రతిఏటా సొసైటీల్లో ప్రవేశపెట్టే ఆడిట్ నివేదికలను కూడా తొక్కిపట్టి పెద్దఎత్తున అక్రమాలకు తెరతీసింది. అర్హత లేని ఎంతోమందికి రాజకీయ పరపతి ద్వారా సొసై టీల్లో ఉన్న సొమ్ములను దోచిపెట్టింది. త్రీమెన్ కమి టీల పేరిట ఐదేళ్ల పాటు ఓ ప్రహసనాన్ని నడిపింది. సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులను పర్మినెంట్ చేసే ప్రక్రియలో కూడా ముడుపుల పర్వానికి తెరతీసి అర్హత కలిగిన ఎంతోమందికి వేదనను మిగిల్చింది.

నేడు కూటమి బలోపేతం

డీసీసీబీ శాఖల్లోని ఖాతాలను ఆన్‌లైన్ చేయడంతో పాటు సొసైటీలు సొంతంగా నిలదొక్కుకునే విధంగా కూడా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఆయా సహకార సంఘాల ద్వారా ఇతర వ్యాపారాల కోసం ఆసక్తి ఉన్న వారికి డీసీసీబీ ద్వారా రుణాలు ఇప్పించి వాటిని బలోపేతం చేసి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని రైతుల కోసం ఖర్చు పెట్టాలనే ఆలోచనను ప్రభుత్వం చేసింది. మొత్తంగా చూస్తే పీఏసీఎస్‌లకు జవసత్వాలు కల్పించడం ద్వారా సహకార సొసైటీల వ్యవస్థ సుదీర్ఘ కాలం రైతులకి సేవలందిస్తూ ఉండాలని, అందుకు కావాల్సిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సమాయత్తమవుతోంది.

- ఆన్‌లైన్‌తో డీసీసీబీ శాఖల్లో అవకతవకలకు అడ్డుకట్ట
- అన్నివిధాలుగా సొసైటీలను కునారిల్లేలా చేసిన గత ప్రభుత్వం
- సహకార వ్యవస్థను పట్టాలెక్కించే దిశగా అడుగులు వేస్తోన్న కూటమి ప్రభుత్వం



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాంకేతిక సహకారంతో సహకార వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇంతకాలం సహకార వ్యవస్థ అక్రమాలతో నిండిపోగా పాలకవర్గాలు, ఉద్యోగుల అవినీతితో రైతులకు అందాల్సిన రుణాలు పక్కదారి పట్టాయి. దీనికితోడు గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్ణయాలతో మొత్తం వ్యవస్థే గాడి తప్పింది. దీంతో కూటమి ప్రభుత్వం పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం)ల్లోని ఖాతాలన్నింటినీ ఆన్‌లైన్ చేసేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. తద్వారా సంబంధిత లావాదేవీల్లో జరిగిన లొసుగులు బయటపడడంతో పాటు అక్రమార్కులపై చర్యలు తీసుకోవడానికి వీలుంటుందనేది ప్రభుత్వ ఆలోచన. ఇది చేపట్టి ఇప్పటికే నాలుగు నెలలు గడుస్తుండగా ఖాతాల కంప్యూటరీకరణ కొలిక్కి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డీసీసీబీ పరిధిలో 167 పీఏసీఎస్‌లు ఉన్నాయి. బాపట్ల జిల్లాకు వచ్చేసరికి ఈ సంఖ్య 112గా ఉంది. ఇందులో గుంటూరులోని డీసీసీబీ పరిధిలో 44 పీఏసీఎస్‌లు ఉండగా, ఒంగోలులోని డీసీసీబీ కింద 68 సహకార సొసైటీలు ఉన్నాయి. వీటికి సంబంధించి దాదాపు 95 శాతం ఖాతాల ప్రక్రియ ఆన్‌లైన్ పూర్తయింది. ఉమ్మడి గుంటూరు పరిధిలోని పీఏసీఎస్‌లలో 90 శాతం ఖాతాల డిజిటలైజేషన్ కొలిక్కి రాగా ఈ నెల పదిహేను కల్లా వందశాతం ఖాతాల ఆన్‌లైన్ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసిన ప్రభుత్వం మొత్తం డిజిటలైజేషన్ దాని ద్వారానే చేపడుతోంది. ఏప్రిల్ నుంచి లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయని తద్వారా రోజువారీ ప్రగతి నివేదికలు తెలుసుకోవడానికి (మిగతా 8వ పేజీలో)



పల్నాడు ప్రథమం

- లక్ష్యం కంటే అధికంగా సీసీఆర్ కార్డుల పంపిణీ
- కొద్దిగా వెనకబడిన గుంటూరు, బాపట్ల జిల్లాలు
- ఈ-క్రాప్, వ్యవసాయ రుణాలకు మార్గం సుగమం

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల కష్టాలు తీరిపోతున్నాయి. ఈ-క్రాప్ బుకింగ్, వ్యవసాయ రుణాలు పొందేందుకు ఇంతకాలం అవస్థలు పడిన కౌలు రైతులకు మేలు చేసేలా క్రాప్ కల్టివేటర్ రైట్స్(సీసీఆర్) కార్డుల మంజూరుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అయితే ఈ కార్డుల మంజూరులో పల్నాడు జిల్లా లక్ష్యాలను అధిగమించింది. కేటాయించిన లక్ష్యం కంటే అధికంగా పంపిణీ చేసి ఉమ్మడి గుంటూరు జిల్లాలో పల్నాడు ప్రథమస్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ లక్ష్యాన్ని 10 జిల్లాలు అధిగమించగా అందులో పల్నాడు జిల్లా ఒకటిగా నిలవడం విశేషం. మరోవైపు గుంటూరు, బాపట్ల జిల్లాలు కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు ఇవ్వడంలో కొంత వెనకబడ్డాయి. సాధ్యమైనంత త్వరగా లక్ష్యాన్ని అధిగమించాలని ప్రభుత్వం రెండు జిల్లాల అధికారులను ఆదేశించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పల్నాడు జిల్లాలో 65 వేల మంది కౌలురైతులకు సీసీఆర్ కార్డులు మంజూరు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించగా 65,126 కార్డులు మంజూరు చేసి 100 శాతం లక్ష్యాన్ని అధికారులు అధిగమించారు. మరోవైపు గుంటూరు జిల్లాకు 46,670 సీసీఆర్ కార్డులు లక్ష్యం ఇవ్వగా 39,424 కార్డులు మంజూరు చేసి 84 శాతం పురోగతిని నమోదు చేయగలిగింది. బాపట్ల జిల్లాకు గుంటూరు, పల్నాడు కంటే అధిక లక్ష్యాన్ని ప్రభుత్వం ఇచ్చింది. ఈ జిల్లాలో 1,06,670 కార్డులు వ్యవసాయ సీజన్‌లో మంజూరు చేయాల్సిందిగా లక్ష్యం కేటాయించగా 88,219 కార్డులు మంజూరు చేసి 83 శాతం పురోగతిని సాధించింది. ప్రస్తుతం రబీ సీజన్ కూడా ముగింపు దశకు చేరుకున్నది. ఈ నేపథ్యంలో వచ్చే ఖరీఫ్ సీజన్‌కి అయినా ఎక్కువ సంఖ్యలో సీసీఆర్ కార్డులు మంజూరు చేయాల్సిన బాధ్యత ఆయా జిల్లా యంత్రాంగాలపై ఉన్నది. మరో రెండు నెలల్లో ఖరీఫ్ రుణాల పంపిణీ మొదలు అవుతుంది. ఈ దృష్ట్యా ఇప్పటి నుంచే వాటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నది.

త్వరలో కౌలు రైతుల కోసం చట్టం..

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో చాలావరకు కౌలు రైతులే పంటలు సాగు చేస్తున్నారు. అయితే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వీరికి ఎలాంటి నష్టపరిహారం అందడం లేదు. మరోవైపు పంటలు సాగుకి బ్యాంకర్ల నుంచి రుణాలు కూడా పొందలేని పరిస్థితి. ఇందుకు కారణం భూమికి సంబంధించిన హక్కులన్నీ సంబంధిత యజమాని ఆధీనంలోనే ఉంటాయి. తాను పంట వేయకపోయినా బ్యాంకుల నుంచి రుణం తీసుకోగలుగుతాడు. అలానే ప్రకృతి విపత్తులు చోటు చేసుకున్నప్పుడు అధికారుల వద్ద ఉన్న డేటాలో యజమాని పేరే ఉంటుంది కాబట్టి ఆయనే నష్టపరిహారం పొందుతున్నాడు. కౌలురైతుల కోసం గత ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా అవి వారికి అక్కరకు రాలేదు. కూటమి ప్రభుత్వం కౌలురైతుల చట్టాన్ని సవరించి వారికి లబ్ధి చేకూర్చేందుకు ఇటీవలే రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నది. త్వరలోనే కొత్త చట్టం అమలులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నది.

సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం

- పురుగు మందులతో ఆరోగ్యానికి హాని
- ప్లాస్టిక్, రసాయనిక ఎరువులతో క్యాన్సర్
- వార్షిక ప్రణాళికపై సమీక్షలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, వాటి ఉత్పత్తులను మరింతగా పెంచాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సేంద్రియ వ్యవసాయ వార్షిక ప్రణాళికపై అనుబంధశాఖల అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగుమందులు వినియోగం లేకుండా పంటలు సాగు చేయాలని చెప్పారు. సాంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం సాగు చేస్తేనే ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించగలమన్నారు. ఎరువులు, పురుగుమందులు వాడకం పెరగడంతో ప్రజల ఆరోగ్యానికి భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్, రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగంతో క్యాన్సర్ వంటి రోగాలకు ప్రజలు గురవుతున్నారన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించాలంటే సాంప్రదాయ వ్యవసాయానికి అనుకూలంగా రైతులు నడుం బిగించాలన్నారు. రైతులే స్వయంగా విత్తనాలు, జీవామృతం వంటి సేంద్రియ ఎరువులను తయారు చేసుకుని వినియోగించుకోవాలన్నారు. 2025వ సంవత్సరంలో జిల్లాలో 1,07,165 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలోనే పంటలు సాగు చేయాలని వార్షిక ప్రణాళిక రూపొందించినట్లు ప్రకటించారు. 62,097 మంది రైతులను సేంద్రియ వ్యవసాయ పద్ధతిలోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సంవత్సరం వరి, శనగ, మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న, కూరగాయలు, పండ్ల తోటల సాగు విస్తృతంగా చేపట్టాలన్నారు. సేంద్రియ వ్యవసాయంపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ నెల 30లోగా ఖరీఫ్ పంటల సాగుపై గ్రామస్థాయిలో సమగ్రప్రణాళిక రూపొందించాలని సూచించారు. పంటచేతికి వచ్చిన తదుపరి రైతులకు మంచి ధర లభించేలా మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రామకృష్ణ, సేంద్రియ వ్యవసాయం ఏపీసీఎన్‌ఎఫ్‌డీపీఎమ్ వాణిశ్రీ, మోహన్‌కుమార్, ఉద్యానశాఖ ఏడీ జెన్నెమ్మ, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి



ఎంసీఏ హాలును పరిశీలిస్తున్న జేసీ, ఏఎస్పీ, ఆర్డీవో

మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు

- హాజరుకానున్న మంత్రులు అనగాని, పార్థసారథి
- రేపల్లెలో ఎంసీఏ హాలు పరిశీలించిన జేసీ, ఏఎస్పీ

రేపల్లె, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం స్థానిక మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్(ఎంసీఏ) హాలును పరిశీలించినట్లు జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఈ నెల 8న జరిగే మహిళా దినోత్సవానికి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి, అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి హాజరుకానున్నట్లు చెప్పారు. మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఏఎస్పీ విఠలేశ్వర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవానికి మంత్రులు రానున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ మూర్ల శ్రీనివాసరావు, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావుతో పాటు అనగాని శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలి

- 14న శింగరకొండ తిరునాళ్లను విజయవంతం చేయాలి
- వివిధ శాఖల అధికారులతో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

అద్దంకి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ తిరునాళ్లలో భక్తులకు సేవ చేస్తున్నామన్న దృక్పథంతో అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. శింగరకొండ 70వ వార్షిక తిరునాళ్ల ఏర్పాట్లపై గురువారం శింగరకొండలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి ఈ నెల 14న జరిగే తిరునాళ్ల విజయవంతానికి కృషి చేయాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తాగునీరు, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎస్పీ మొయిన్ మాట్లాడుతూ తిరునాళ్లలో విద్యుత్ ప్రభలపై ఎలాంటి అశ్లీల, అర్ధనగ్న నృత్యాలకు అనుమతులు లేవన్నారు. బాణసంచా కాల్చరాదన్నారు. రద్దీని ముందుగా గుర్తిం చేందుకు సీసీ కెమెరాలు, డ్రోన్లను ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులను కోరారు. తిరునాళ్ల రోజు అద్దంకి పట్టణంలో మద్యం షాపులు మూసి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆర్డీవో కోరగా కలెక్టర్ అనుమతి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఈవో తిమ్మానాయుడు, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు,తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, సీఐ సుబ్బరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.22 (శుక్రవారం)
సహరి : 5.05 (శనివారం)

బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలి

చిలకలూరిపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు గురువారం కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో వివిధ పార్టీల, రైతు సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు.



హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అమరావతి మండలం లేమల్లె గ్రామంలోని దయాక్షేత్రంలో గురువారం 48వ గుడారాల పండగ ప్రారంభమైంది. వేలాదిగా తరలివచ్చిన దైవజనులు, విశ్వాసుల సమక్షంలో నాలుగు రోజుల కార్యక్రమాల్ని దక్షిణాఫ్రికాకు చెందిన పాస్టర్ జాషువా మోజెస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్‌పాస్టర్ జాన్‌వెస్లీ, రమేష్, పైడిపాల్, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

-అమరావతి

ముగిసిన లాటరీ

- గీత కులాలకు 12 మద్యం దుకాణాలు కేటాయింపు

బాపట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గౌడ, గౌడ్ సామాజిక వర్గాలకు కేటాయించిన మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం, చీరాల, పర్చూరు, అద్దంకి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో గీతకులాల వారికి 12 మద్యం దుకాణాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఆయా దుకాణాలకు 159 దరఖాస్తులు రాగా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఎక్సైజ్ జిల్లా అధికారి జి.దేవదత్తు లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించారు. దరఖాస్తుదారుల సమక్షంలో వీడియో రికార్డింగ్ ద్వారా లాటరీ ప్రక్రియ జరిగింది. నాన్‌రిఫండబుల్ ఫీజు రూపంలో రూ.31.80 లక్షలు, ఇన్‌స్టాల్‌మెంట్ రూపంలో రూ.60 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.



గీతకులాల వారికి మద్యంషాపులు కేటాయిస్తున్న జేసీ ప్రఖర్‌జైన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి దేవదత్తు



బండ్ల బాపయ్య కళాశాలను పరిశీలించిన ఏఎస్పీ విఠలేశ్వర్

అపరిచితులను గుర్తించండి

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

వేటపాలెం(చీరాల), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పరీక్షా కేంద్రాల పరిసరాల్లో అపరిచితులను గుర్తించి అదుపులోకి తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ టీవీ విఠలేశ్వర్ అన్నారు. ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు గురువారం వేటపాలెం మండల పరిధిలోని బండ్ల బాపయ్య జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయా పరిసరాల్లో బందోబస్తుపై ఆరా తీశారు. పరీక్షలు ప్రశంతంగా జరిగేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు, నిర్వాహకులను మాత్రమే అనుమతించాలని సూచించారు. ఇతరులపై జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. ఏఎస్పీ వెంట వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

నేడు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆదరణ-3 పథకంలో బీసీ కార్పొరేషన్ ద్వారా కులవృత్తిదారులకు వృత్తిపరమైన పరికరాలను అందించేందుకు ఏర్పాటుచేసే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో కులవృత్తి సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో లక్ష్మీ నారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని కుల వృత్తిదారుల సంఘాల సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

మాలిక్యులర్ బయాలజీతో అవకాశాలు



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : బీఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులు మాలిక్యులర్ బయాలజీ వైపు దృష్టి సారించినట్లయితే ఉన్నత శిఖరాలను అందుకుంటారని చీరాల ఐకాన్ హాస్పిటల్ వైద్యుడు డా.కొండలరావు అన్నారు. సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో బీ ఫార్మసీ ఆఖరి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో వీడ్కోలు సభను నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. కొండలరావు పలు అభివృద్ధి మార్గాలు వివరించారు. ఫార్మా రీసెర్చ్ వంటి వాటి ప్రయోజనాలు చెప్పారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వీవీ నాగేశ్వరరావు, డైరక్టర్ డా.సుబ్బారావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.జగదీష్, మేనేజర్ రమణమూర్తి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి పీ-4 సర్వే

అద్దంకిటౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాలలో ఈనెల 8వ తేదీ నుంచి 18వ రకు పీ-4 సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య తెలిపారు. అట్టగున్న ఉన్న 20శాతం మంది పేదలను ఈ సర్వే ద్వారా గుర్తిస్తారని తెలిపారు. ఈ సర్వే రెండు దశలలో జరుగుతుందని, మొదటి దశలో ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా కొన్ని కుటుంబాలను గుర్తిస్తారన్నారు. సచివాలయ సిబ్బంది 27 అంశాలతో సర్వే చేస్తారన్నారు. ఇప్పటి వరకు బ్యాంక్ అకౌంట్ లేని, వంట గ్యాస్ లేని, పక్కా ఇల్లు, తాగునీరేఉ అందుబాటులో లేని కుటుంబాలను గుర్తించి నమోదు చేస్తారన్నారు. పేద కుటుంబాలకు అత్యధిక ఆదాయం కలిగిన 20శాతం కుటుంబాల సహాయ సహకారాలతో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తారని తెలిపారు. కుటుంబ అనుమతితోనే సర్వే చేస్తారని, 24వ తేదీలోపు గ్రామ సభల ఆమోదం తీసుకుంటామని చెప్పారు. ఉగాది నుంచి ఈ పథకం అమలులోకి వస్తుందని ఎంపీడీవో సింగయ్య తెలిపారు.

18 వతేదీ లోపు సర్వేని పూర్తి చేయాలి

మార్టూరు : పేదవారిని ఆర్థికంగా బలోపేతం చేయలనే ఉద్దేశంతో పీ-4 సర్వేను ప్రభుత్వం ఏర్పాటుచేసిందని, ఈ నెల 8వ తేదీ నుంచి 18 వవరకు సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీవో వై.శ్రీనివాసరావు అన్నారు. గురువారం కార్యాలయంలో మండలంలోని గ్రామ సచివాలయ ద్యోగులకు పీ4 సర్వేపై శిక్షణ తరగతులను నిర్వహించారు. సర్వేను పారదర్శకంగా చేయాలని ఎంపీడీవో సూచించారు.

కారంచేడు (పర్చూరు) : పీ-4 సర్వేపై ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. 10 శాతం సంపన్నులు 20 శాతం అట్టడుగున ఉన్న పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నేతాజీ తెలిపారు. ఈనెల 8 నుంచి సర్వే ప్రారంభమవుతుందన్నారు.

అగ్నిగుండం కాదు.. సూర్యాస్తమయం



అద్దంకిలో గురువారం సాయంత్రం సూర్యాస్తమయం సమయంలో ఆకాశం ఎరుపెక్కి కనువిందు చేసింది. అద్దంకి పట్టణంలోని వేలమూరిపాడు రోడ్డులో సూర్యాస్తయంలో ఆకాశంలో ఈ దృశ్యం కనువిందు చేసింది.

- అద్దంకి, (ఆంధ్రజ్యోతి)

పర్యావరణ సంరక్షణ జాతీయ సభ్యుడిగా మస్తాన్‌వలి

తాళ్లూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ సంర క్షణ జాతీయ సభ్యుడిగా తూర్పుగంగవరం వాసి నియ మితులయ్యారు. తూర్పుగంగవరం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి దక్కన్ క్లాప్ ఇండియాస్ ఫస్ట్ పెయిటింగ్ కమ్ వాటర్ ప్రూఫింగ్ సర్వీస్ కంపెనీని ఢిల్లీలో ఏర్పాటుచేశారు. ప్రముఖ కంపెనీగా జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకుంది. ఈఅవార్డును గురువారం ఢిల్లీలోని లీలా ప్యాలెస్‌లో మస్తాన్‌వలి అందుకున్నారు.

శిథిలావస్థలో చరిత్ర కలిగిన దోబీఖానా


- దయనీయంగా నిర్వాహకుల పరిస్థితి
- కూటమి ప్రభుత్వ ప్రకటనపై హర్షం
- మరమ్మతులు చేపట్టి వాడకంలోకి తేవాలంటూ విజ్ఞప్తి



నిరుపయోగంగా ఉన్న దోబీఖానా



మరమ్మత్తులకు గురైన విద్యుత్ మోటారు



శిథిలావస్థకు చేరిన బావి

చీరాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల పురపాలక సంఘం పరిధిలోని 24వ వార్డు గాంధీనగర్‌లోని రజక సామాజికవర్గానికి చెందిన సుమారు 50 కుటుంబాలు ఆ ప్రాంతంలోనే ఉన్న దోబీఖానాపై ఆధారపడి జీవించేవారు. పట్టణమంతా వస్త్రాలను సేకరించి దోబీఖానాలో శుభ్రపరచి వివిధ శాఖల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు అందజేసి జీవనం సాగించే వారు. నిత్యం వస్త్రాల యజమానులతో రోజువారి పనులతో కళకళలాడే సుమారు 60 సంవత్సరాలు చరిత్ర కలిగిన దోబీఖానా నేడు దీన స్థితికి చేరింది. సుమారు నాలుగేళ్లుగా విద్యుత్ మోటారు, వినియోగంలో ఉన్న మోటు బావి మరమ్మతులకు గురికాగా పట్టించుకోని పాలకులు, అధికారులు వైఫల్యంతో దానిపై ఆధారపడి జీవిస్తున్న రజక కుటుంబాల జీవన మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. దాదాపుగా యాభై కుటుంబాలు రోజువారీ విధివిధానాలతో వస్త్రాలను సేకరించి జీవనం సాగించేవారు. అయితే వినియోగంలోని దోబీఖానా మూతపడడంతో కుటుంబాలకు రోజు గడవడం కష్ట తరంగా మారింది. వృత్తిపరమైన వ్యవస్థలకు ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తుండడంతో దోబీఖానాను వాడకంలో తీసుకువచ్చి వారి భుక్తికి తోడ్పాటును అందించాలని ఆవర్గానికి చెందిన కుటుంబాలు వేడుకుంటున్నాయి.

విషసర్పాలతో పొంచివున్న ప్రమాదం

గతంలో వందలమంది జనాభాతో కళకళలాడే దోబీఖానా మరమ్మతులకు గురి కావడంతో ఆ పరిసరాలు చిల్లచెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ఈక్రమంలో విషసర్పాలు సంచరిస్తున్నాయి. ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు సైతం బెంబేలెత్తుతున్నారు. అంతేకాకుండా అసాంఘిక కార్యక్రమాలకు సైతం అడ్డాగా మారనుంది. ఈ నేపథ్యంలో దోబీఖానాను వెంటనే వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతయినా ఉందని స్థానికులు కోరుతున్నారు.

గతంలో పలుమార్లు వినతులిచ్చాం



దోబీఖానా సమస్యను పరిష్కరించాలని గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలను అందజేశాం. అయినా మా సమస్య పరిష్కారం కాలేదు. ఈక్రమంలో కుటుంబ పోషణ భారంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం కులవృత్తులను ఆదుకుంటామని ప్రకటించడం ఆనందకరం. వెంటనే దోబీఖానాను అందుబాటులోకి తీసుకొచ్చి రజకులకు సహకారం అందించాలి.

- చీదెళ్ల శ్రీనివాసరావు, రజకుడు

ప్రస్తుతం పనికి చాలా ఇబ్బంది



చాలా కాలంగా దోబీఖానా మూతపడింది. మా పూర్వీకుల కాలం నుంచి ఇక్కడే పనులు చేసుకుని జీవనం సాగించాం. కానీ ప్రస్తుతం దోబీఖానా మూతపడడంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉంది. పాలకులు, అధికారులు మా గోడు పట్టించుకోవాలి.

- గొల్లపల్లి రమణయ్య, రజకుడు

కొటికలపూడిలో ఫాంపాండ్ల తనిఖీ

- రైతులు పథకాలను సద్వినియోగపర్చుకోవాలి
- డ్వామా పీడీ విజయలక్ష్మి



కొటికలపూడిలో పంట కుంట పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ విజయలక్ష్మి, ఏపీడీ కోటయ్య నాయక్ తదితరులు

అద్దంకిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా అందిస్తున్న పలు రకాల పథకాలను సద్వినియోగపర్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని కొటికలపూడి గ్రామ పంచాయతీ పరిధిలో పంట కుంట పనులు చేస్తున్న ప్రాంతాన్ని ఆమె స్థానిక అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి జిల్లా పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆకస్మిక తనిఖీ చేయాలనే సందేశాలను ఆయా జిల్లా పీడీలకు సీఆర్‌డీఏ అధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో గ్రామాలలో ఆకస్మికంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో భాగంగా ఆమె కొటికలపూడి గ్రామ పంచాయతీ పరిధిలో పంట కుంట పనులను పరిశీలించారు. అక్కడ పనులకు వచ్చిన కూలీల హాజరును, ఫీల్డ్ అసిస్టెంట్ వేసిన హాజర్ మస్టర్‌ను తనిఖీ చేశారు. పనులు సక్రమంగా జరుగుతుండడం చూసి ఆనందించారు. ఉపాధి పనుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని పీడీ సూచించారు. పనులుకు ఎక్కువ మంది కూలీలు వచ్చేలా చేయాలన్నారు. అలాగే రైతులు పంట కుంటల పథకాలను సద్వినియోపర్చుకోవాలని, రైతులకు అవగాహన కల్పించి పంట కుంటను ఎక్కువ తవ్వకునేలా చూడాలని సూచించారు. పీడీ విజయలక్ష్మి వెంట ఏపీడీ కోటయ్య నాయక్, ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్, టెక్నికల్ రిసోర్స్‌పర్సన్ మహేష్, ఏపీవో గాయత్రిదేవి, ఈసీఎం నాగరాజు, టీఏలు మురళీమనోహర్, కొండయ్య, నాగేశ్వరరావు, హనీష్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

సహకారం.. సాంకేతికం

(7వ పేజీ తరువాయి)

వీలుంటుందనేది ప్రభుత్వ ఆలోచన. మరోవైపు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా లక్షన్నర ఖాతాలు ఆన్‌లైన్ కాగా వీటికి సంబంధించి వేల ఖాతాల్లో అక్రమాలు బయటపడినట్లు సమాచారం. వీటిపై చర్యల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు అధికారులు చెప్తున్నారు.

వాణిజ్యం.. సహకారం

ఇప్పటి వరకు సహకార సంఘాల పాత్ర రైతులకు పంట రుణాలు అందించడంతో పాటు అరకొరగా ధాన్యం సేకరణకు మాత్రమే పరిమితమయ్యేది. అంతంతమాత్రంగా ఉన్న సొసైటీల ఆర్థిక పరిస్థితి గత ప్రభుత్వం అవలంబించిన విధానాలతో పూర్తిగా గందరగోళంలో పడిపోయింది. ఈ క్రమంలో వాటిని తిరిగి పట్టాలెక్కించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంది. తొలుత పీఏసీఎస్‌ల డిజిటలైజేషన్ మీద దృష్టి పెట్టిన ప్రభుత్వం మలిదశలో వాటిని వాణిజ్యం వైపు నడిపించడానికి బృహత్తర ప్రణాళికలను తయారు చేసే విధంగా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని డీసీసీబీ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి సొసైటీలు చేయాల్సిన వ్యాపారాలను గుర్తించడంతో పాటు ఆసక్తి ఉన్న వారికి రుణాల మంజూరు ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది. దీనిలో భాగంగా పెట్రోలు బంకులు, ఎరువుల వ్యాపారం, గోడౌన్ల నిర్మాణం, విలువ ఆధారిత ఉత్పత్తులు, కల్యాణ మండపాలు, బియ్యం తదితర వ్యాపారాలను గుర్తించి ఆ దిశగా పీఏసీఎస్‌లను మళ్లించడానికి అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుంది. ఇప్పటి వరకు పంట రుణాలపై వచ్చే కమీషన్లపైనే సంఘాలు ఆధారపడేవి. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వారా రుణాలపై నామమాత్రపు వడ్డీతో పాటు కొన్ని వ్యాపారాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా పీఏసీఎస్‌ల ఆదాయం పెరగనుంది. తద్వారా సొసైటీలకు వచ్చే ఆదాయాన్ని తిరిగి రైతుల మేలు కోసం ఖర్చు పెట్టాలని నిర్ణయించింది. తద్వారా సహకార రంగాన్నే బలోపేతం చేసినట్లవుతుందనేది ప్రభుత్వ ఆలోచన. ఈ చర్యలతోపాటు త్వరలోనే ఎన్నికలు జరిపి పాలకవర్గాలను కొలువదీర్చాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

బొబ్బేపల్లి కొండపై మంటలు

మార్టూరు, మార్చి6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొబ్బేపల్లి గ్రామానికి చెందిన ఫారెస్టుకు చెందిన గ్రావెల్ కొండపై గురువారం రాత్రి మంటలు కనిపించాయి. కొండపై రెండు మూడు చోట్ల మంటలు కనిపించాయి. వేసవి కాలం కావడంతో ఈ మంటలు మరింతగా వ్యాప్తిచెందుతాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయం కావడంతో కొండపైకి వెళ్లే అవకాశం లేకపోవడంతో శుక్రవారం ఉదయం నాటికి కొం డపైకి వెళ్లి మంటలు ఉన్న ప్రదేశాలను పరిశీలిస్తామని సర్పంచ్ తాళ్లూరి లావణ్య, ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు, మాజీ సర్పంచ్ దండా వీరాంజనేయులు తదితర గ్రామస్థులు తెలిపారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే మంటలను రాజేశారా లేదా కాకతాళీయంగా మంటలు వ్యాపించాయా అన్న ఆలోచనలో వారు పడిపోయారు. ఈ విషయమై కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్‌బాబు మాట్లాడుతూ కొండపై మంటలు వ్యాపించడం తమ దృష్టికి వచ్చిందన్నారు. రాత్రి సమయం కావడంతో పరిశీలించలేమన్నారు. శుక్రవారం కొండపైన మంటలు రేగిన ప్రదేశాలను పరిశీలిస్తామన్నారు. కావాలనే ఎవరైనా వ్యక్తులు మంట పెట్టినట్లయితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

వేతనంతో కూడిన మెటర్నరీ లీవులు ఇవ్వాలి

చినగంజాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్తలకు వేతనంతో కూడిన మెటర్నరీ సెలవులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల యూనియన్(సీఐటీయూ) పిలుపు మేరకు గురువారం విజయవాడలో జరుగుతున్న ధర్నాకు సంఘీభావంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు పనిభారం, ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనం అందజేయాలని అన్నారు. వయో పరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మట్టి ఖర్చులు, ఇన్సూరెన్స్ తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారన్నారు. నిరసన కార్యక్రమం అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జె.ప్రభాకరరావుకు ఆశా కార్యకర్తలు అందజేవారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

10 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

అద్దంకిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఆర్థికంగా ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బీసీ, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, ఆర్యవైశ్య, క్షత్రియ, ఈబీసీ సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇచ్చే కార్యక్రమం జరుగుతుందని ఆసక్తి ఉన్న మహిళలు సద్వినియోగపర్చుకోవాలని ఎంపీడీవో బత్తిన శింగయ్య గురువారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నెల 10 నుంచి మండల కేంద్రంలో శిక్షణ ప్రారంభం అవుతుందని, 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డుతో సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను, పంచాయతీ కార్యదర్శిని, డిజిటల్ అసిస్టెంట్‌ను సంప్రదించి ఓబీఎంఎంఎస్ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలం 45 రోజులు, 60 రోజులు, 90 రోజులు ఉంటుందని, శిక్షణలె 75శాతం హాజరు అ యినవారికి, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టుమిషన్ ఉచితంగా అందించడం జరుగుతందని తెలిపారు.

వసతులు లేని రెస్ట్ ఏరియాలు

- ఆహారం, మంచినీరు కూడా లేదు
- లారీ డ్రైవర్లు, క్లీనర్ల అగచాట్లు
- పట్టించుకునేదెప్పుడు



రాజుపాలెం కూడలిలో తూర్పువైపున ఉన్న రెస్ట్ ఏరియాలో ఆగిన లారీలు

తెరుచుకోని రెస్టారెంట్



లారీ దగ్గర వంట చేసుకుంటున్న డ్రైవర్, క్లీనర్

మార్టూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండి అన్నట్లుగా ఉంది మార్టూరు మండల పరిధిలో రాజుపాలెం రెస్ట్ ఏరియాలలో వాహనదారుల పరిస్థితి. సుదూరప్రాంతాల నుంచి లారీలపై సరుకులుగాని, ఇతరత్రా వాటిని రవాణా చేస్తున్న సమయంలో డ్రైవర్లు కొంత సమయం విశ్రాంతి తీసుకోవడానికి రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఎంతో దూరం నుంచి అలసిపోయి వాహనాలను నడిపే లారీ డ్రైవర్లు రాత్రి సమయంలో ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన రెస్ట్ ఏరియాలో కనీస వసతులను కూడా ఏర్పాటు చేయలేదు. మార్టూరు మండల పరిధి 216వ జాతీయరహదారికి ఇరువైపులా రాజుపాలెం కూడలి సమీపంలో రెండు రెస్ట్ ఏరియాలను దాదాపుగా మూడేళ్ల కిందట ఏర్పాటు చేశారు. చెన్నై నుంచి కోల్‌కతా వెళ్లే ఈ జాతీయ రహదారిపై వాహనదారులు ముఖ్యంగా లారీడ్రైవర్ల కోసం, వారు విశ్రాంతి తీసుకోవడానికి అన్నివిధాలా అనుకూలమైన వసతులతో రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో హైవే వారు నిధులను మంజూరు చేశారు. తూర్పు, పడమర వైపున ఏర్పాటు చేసిన రెండు రెస్ట్ ఏరియాలలో ఇప్పటివరకు కనీస వసతులను ఏర్పాటు చేయలేదని డ్రైవర్లు, క్లీనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంచినీరు, ఆహారం లేదు

హైవేపై ఒంగోలు, గుంటూరు వైపు దాదాపుగా 10 ఎకరాల విస్తీర్ణంలో రెండు రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేశారు. వాటిలో విశ్రాంతి తీసుకోవడానికి గదుల కోసం భవనం, క్యాంటీన్ కోసం మరో భవనం, షాపులు కోసం కొన్నిగదులు, ఇంకా తదితర భవనాలను నిర్మించారు. వాటి భద్రత కోసం సెక్యూరిటీ గార్డులను కూడా ఏర్పాటు చేశారు. కానీ విశ్రాంతి తీసుకోవడానికి అటువైపు ఎవరూ కన్నెత్తి కూడా చూడటంలేదు. మిగిలిన భవనాల తలుపులు ఎప్పుడూ మూసివేసి ఉంటాయి. రెస్ట్ ఏరియాకు వచ్చిన లారీ డ్రైవర్లు లేదా కార్లు, ప్రైవేటు బస్సులకు సంబంధించిన డ్రైవర్లు రెస్ట్ ఏరియాకు వస్తే కనీసం తాగడానికి మంచినీరు కూడా ఇక్కడ లేదు. ఆహారం తిందామంటే క్యాంటీన్ సౌకర్యం లేదు. అర్ధరాత్రి ఎక్కువగా వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి రెస్ట్ ఏరియాలకు వస్తుంటారు ముఖ్యంగా రాష్ట్రం నుంచి కాకుండా చైన్నై, కేరళ, మహారాష్ట్ర, బీహార్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి ప్రయాణించే లారీలు రెస్ట్ ఏరియాకు వస్తుంటారు. ఈ సమయంలో వారు తినడానికి తిండి, తాగడానికి మంచినీటి కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మార్టూరు సెంటరుకు రావాల్సిందే. దాంతో కొంతమంది వాహనదారులు ఈ రెస్ట్ ఏరియాలవైపు కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలవైపు చూస్తున్నారు. వాస్తవానికి రోజూ 70 నుంచి 100 దాకా పైగా వాహనాలు రెండు రెస్ట్ ఏరియాలకు వస్తుంటాయి. గతంలో తూర్పు వైపు ఉన్న రెస్ట్ ఏరియాలో రాత్రి సమయంలో ఒక లారీలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం కూడా చేశారు. ఈ నేపథ్యంలో రెస్ట్ ఏరియాలలో వాహనదారులకు భద్రత ఉండేవిధంగా నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టాలి. దూర ప్రాంతాలు నుంచి ప్రైవేటు వాహనాలలో వచ్చే ప్రయాణికులలో మహిళలు, చిన్నపిల్లలు ఉంటారు కనుక రెస్ట్ ఏరియాలో భద్రత ఉంటుందనే నమ్మకాన్ని వాహనదారులకు కలిగించాలి. అంతేగాకుండా ఏఏ నిబంధనలతో, ఉద్దేశాలతో, వాహనదారుల కోసం ఏర్పాటుచేస్తామన్న పూర్తి వసతులతో నేషనల్ హైవే వారు రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేశారో వాటిని పూర్తిగా అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

టీ లేదు.. మంచినీళ్లులేవు



మాది బిహార్, ఇక్కడ ఏమీ బాగాలేదు. వంట లారీ దగ్గరే చేసుకుంటున్నాం. మంచి నీళ్లు, టీ, ఆహారం దొరకదు. రాత్రి లారీలోనే పడుకున్నాం. పెట్రోలు బంకు ఉంటే బాగుంటుంది.చాలా వసతులు ఏర్పాటు చేయాలి.

- బిజయ్‌కుమార్, లారీ డ్రైవర్, బిహార్

ముఖాముఖి

సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి

చీరాల ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం



గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగింది. ఉపాధి అవకాశాలు లేక జీవన మనుగడ సాగక సామాన్యులు దీన స్థితిలో ఉన్నారు. ఈక్రమంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించింది. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. ఈనేపథ్యంలో పీ-4 సర్వేపై ఎంపీడీవోతో ఆంధ్రజ్యోతి ముఖాముఖి.

ప్రశ్న: ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జవాబు: గత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఈక్రమంలోనే తాజాగా పీ-4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని ప్రారంభించాం. అన్ని ప్రాంతాల్లో సర్వే నిర్వహించి ఉద్యోగ, నిరుద్యోగ, వ్యాపారవేత్తలను గుర్తించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

ప్ర: ఈ సర్వేతో అర్హులకు ఇబ్బందులు తలెత్తి, పథకాలు పోతాయేమో?

జ: పీ-4 సర్వేతో అర్హులకు ఎలాంటి నష్టం వాటిల్లదు. పైగా కొత్త పథకాలు అందించేందుకు అవకాశం కలుగుతుంది. అపోహలు అవసరం లేదు.

ప్ర: పీ-4 ఎప్పుడు ప్రారంభిస్తారు ?

జ: ఈ సర్వే అన్ని ప్రాంతాల్లో వచ్చే శనివారం నుంచి ప్రారంభమై ఈనెల 18వ తేదీతో ముగుస్తుంది.

ప్ర: ఆచరణ ఎప్పుడు ?

జ: పారదర్శకంగా జరిగిన డేటాను 18వ తేదీ తరువాత ఆన్‌లైన్ చేస్తాం. ఉగాది నుంచి ఆచరణ అమలులోకి వస్తుంది. సర్వేలో దాదాపుగా అభివృద్ధిలో ఉన్న మొదటి 10 శాతం మందిని గుర్తిస్తాం. అలాగే అట్టడుగున ఉన్న చివరి 20 శాతం మందికి సహకరించేలా సూచనలు చేస్తాం. వీరితో ప్రభుత్వం కూడా తోడ్పాటు కల్పిస్తుంది

ప్ర: ప్రభుత్వం నిరుద్యోగులకు ఎలాంటి అవకాశాలు ఇవ్వబోతోంది ?

జ: పీ-4 ముగిశాక త్వరలోనే సబ్సిడీ రుణాలు అందించనుంది. ఈక్రమంలోనే ఇప్పటికే ఓబీ ఎంఎంఎస్ సైట్ ఓపెన్ అయి ఉంది. బీసీ, ఈబీసీ యువతీ యువకులు, నిరుద్యోగులు సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం ఇంటర్వ్యూ ద్వారా అర్హులకు రుణాలు అందిస్తాం. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు త్వరలోనే సబ్సిడీ రుణాలు అందిస్తాం.

వైసీపీ పాపం.. విద్యార్థులకు శాపం!



తిమ్మాయపాలెం జడ్పీహెచ్‌ఎస్‌లో పని చేయని వాటర్ ప్లాంట్

- నాడు-నేడులో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌లు మూలకు
- మరమ్మతులకు ముందుకు రాని కాంట్రాక్టర్
- తాగునీటి కల్పనకు విద్యాశాఖ అధికారుల ప్రత్యామ్నాయ చర్యలు

అద్దంకిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ శాపం కారణంగా పాఠశాల విద్యార్థులు దాహం కేకలు వేస్తున్నారు. విద్యార్థులకు సురక్షిత తాగునీటిని అందించేందుకు గత వైసీపీ ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌లు మూలనపడ్డాయి. దీంతో విద్యార్థులు దాహంతో అల్లాడుతున్నారు. వేసవి కాలం రాబోతుండడంతో విద్యాశాల ఉన్నతాధికారులు ఆదేశాలలో పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్ల మరమ్మతులకు ప్రాధానోపాధ్యాయులు చర్యలకు పూనుకున్నారు.

మండలంలో 31 వాటర్ ప్లాంట్‌లు మంజూరు

గత వైసీపీ హయాంలో పాఠశాలలో నాడు-నేడు కింద 31 వాటర్ ప్లాంట్‌లను మంజూరు చేసింది. విద్యార్థుల సంఖ్యను ఆధారంగా రూ.75వేలు, రూ.1.50లక్షలు, రూ.2.50లక్షల విలువైన మూడు రకాల వాటర్‌ప్లాంట్‌లను పేజ్-1లో మంజూరు చేసింది. అయితే ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ రెండు మూడు నెలలు కూడా పని చేయకుండా మూలన పడ్డాయి. మరమ్మతులకు సంబంధిత కాంట్రాక్టర్‌లకు ఎన్ని సార్లు చెప్పినా వచ్చి చూడడం తప్ప వాటిని మరమ్మతులు చేయలేదు. దీంతో అవి ఏళ్ల తరబడి నిరుపయోగంగా పడిఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం పాఠశాలలు చెందిన ఫండ్స్‌ను ఇవ్వకపోవడంతో వాటర్‌ప్లాంట్‌ల మరమ్మతులను హెచ్‌ఎంలు చేయించలేదు. దీంతో అవి ఆలంకారప్రాయంగానే మిగిలిపోయ్యాయి.



గోరకాపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్

తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

నాటి ప్రభుత్వం ఇచ్చిన వాటర్ ప్లాంట్‌లు నిరుపయోగంగా మారడంతో పలు పాఠశాలలో విద్యార్థులకు తాగునీటిని అందించేందుకు గ్రామంలోని వాటర్ ప్లాంట్‌ల వద్ద నుంచి వాటర్ క్యాన్‌లతో నీటిని కొనుగోలు చేసి దాహం తీరుస్తున్నారు. మరి కొన్ని పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ల ద్వారా విద్యార్థుల దాహార్తిని తీరుస్తున్నాయి.

విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో మరమ్మతులకు చర్యలు

వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలో మూలనపడిన నాడు-నేడు వాటర్‌ప్లాంట్‌ల పరిస్థితిని పరిశీలించి వెంటనే తగు మరమ్మతులకు ఆయా పాఠశాలల ప్రాధానోపాధ్యాయులు చర్యలు చేపట్టారు. వాటర్‌ప్లాంట్‌ల పరిస్థితి ఏమిటి ఎంత ఖర్చు అవుతుంది, వాటికి సంబంధించిన వస్తువుల కోనుగోలు వంటివి ఏర్పాటు చేసి ప్లాంట్‌లను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పాఠశాలలకు సంబంధించిన ఫండ్స్‌ను విడుదల చేయడం, వాటిని తోడు కొంత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఖర్చు చేసి ప్లాంట్‌లను వినియోగంలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఒకటి రెండు పాఠశాలల్లో ఉన్న వాటర్‌ప్లాంట్‌లను మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. లక్షలు ఖర్చు చేసి నిరుపయోగంగా పెట్టిన వాటర్‌ప్లాంట్‌లను మరమ్మతులు చేయించి విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది లేకుండా తీసుకుంటున్న చర్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గోరకాయపాలెం పాఠశాలలో తాగునీటి కోసం పెట్టిన వాటర్ క్యాన్

మూలనపడిన ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ

- ఏలూరి ఆదేశంతో నీటిపారుదల శాఖ డీఈ పరిశీలన
- రైతులకు నిర్వహణ అప్పగింత

ఇంకొల్లు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో నిర్వహణ సక్రమంగా లేక ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మూలనపడ్డాయి. ఆ పథకాలను తిరిగి పనరుద్ధరించి రైతులకు ఉపయోగపడేలా మహారాష్ట్ర రాష్ట్రంలో లాగే రైతులే సొసైటీగా ఏర్పిడి నిర్వహణ చేసుకునేలా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి చేస్తున్నారు. ఇందుకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలను పరిశీలించి మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేసేందుకు రిటైర్డు నీటిపారుదల శాఖ డీఈ సత్యనారాయణను కోరారు. ఈ మేరకు మండలంలోని నిరుపయోగంగా ఉన్న రెండు ఎత్తిపోతల పథకాలను సత్యనారాయణ గురువారం ముప్పాళ్ల (కొణికి), గొల్లపాలెం ఎత్తిపోతల పథకాలను పరిశీలించారు. రైతులను అడిగి వాటి నిర్వహణ విధివిధానాలు తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు చేయాల్సిన మరమ్మతులపై చర్చించారు. ఈ రెండు ఎత్తిపోతలను పునరుద్ధరిస్తే రైతులకు మేలు జరుగుతుందని రైతులు తెలిపారు. ఎమ్మెల్యే కృషిని వారు అభినందించారు. ఎత్తిపోతలను పరిశీలించిన వారిలో టీడీపీ నాయకులున్నారు.



కొణికి ఎత్తిపోతలను పరిశీలిస్తున్న బృందం



బెస్ట్ అటాకర్‌గా నిలిచిన శివారెడ్డిని అభినందిస్తున్న క్రీడామంత్రి రాంప్రసాద్‌రెడ్డి

వరల్డ్ కప్ పోటీలో ఖోఖో బెస్ట్ అటాకర్ శివారెడ్డిని అభినందించిన మంత్రి

పంగులూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో జనవరిలో జరిగిన ప్రపంచ కప్ ఖోఖో పోటీలలో ఇండియా జట్టులో పాల్గొని బెస్ట్ అటాకర్‌గా నిలిచిన పంగులూరు ఎస్ఆర్ ఖోఖో అకాడమీ క్రీడాకారుడు పి.శివారెడ్డి గురువారం క్రీడల శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో తనను కలిసిన ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డిని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో ఖోఖో క్రీడలో ప్రతిభచాటిన శివారెడ్డికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని అకాడమీ నిర్వాహకులు, ఖోఖో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి మంత్రికి విన్నవించారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందని, క్రీడాకారులకు ప్రభుత్వ పక్షాన తగిన తోడ్పాటును అందిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సీతారామిరెడ్డి తెలిపారు.

ఫలితాల సాధనకే వంద రోజుల ప్రణాళిక



వల్లాపల్లి పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఈవో గంగాధర్

బల్లికురవ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఫలితాలు సాధించే లక్ష్యంతోనే ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో వంద రోజు ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ఉపాధ్యాయులు బాధ్యతతో పని చేయాలని చీరాల డిప్యూటీ ఈవో జి.గంగాధర్ తెలిపారు. గురువారం మండలంలోని వల్లాపల్లి సీపీయూపీఎస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ పాఠశాలలో రెండో పోస్టు అవసరమని యజమాన్యం దరఖాస్తు చేయగా తనిఖీలు చేసి ఉన్నత అధికారులకు నివేదిక అందిచేందుకు వచ్చిన్నట్లు ఆయన తెలిపారు. ఆనంతరం బల్లికురవ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ తనిఖీలో ఎంఈవో రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

బల్లికురవ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా ప్రమాదాలు జరగకుండా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సంతమాగులూరు సర్కిల్ సీఐ కె.వెంకట్రావు కోరారు. గురువారం బల్లికురవ పోలీసు స్టేషన్‌కు పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు అవగాహన లేక మైనర్లకు వాహనాలను ఇస్తున్నారని, దీంతో ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆలానే కూలీలను ఆటోలలో పరిమితికి మంచి ఎక్కిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, హెల్మెట్ తపనిసిగా ఉండాలని సూచించారు.

యవతిని వేధించిన కేసులో వ్యక్తికి రిమాండ్

వేటపాలెం(చీరాల), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించమని యువతిని వేధించిన కేసులో నిందితుడిని వేటపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన వివరాల ప్రకారం.. చీరాలకు చెందిన యువతిని అదే ప్రాంతానికి చెందిన యువకుడు కొంత కాలంగా వేధిస్తున్నాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు గురువారం వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అలాగే కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

ముసలి, కొండచిలువ సంచారం

పరిశీలించిన అటవీశాఖ అధికారులు



నరసింహాపురం రెవెన్యూ పరిధిలో ముగ్గు వాగును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

అద్దంకి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసింహాపురం (డీ పాపులేటెడ్ విలేజ్) రెవెన్యూ పరిధిలో గుండ్లకమ్మ నది సమీపంలో ముగ్గు వాగు పరిసర ప్రాంతంలో ముసలి, కొండ చిలువ సంచారంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడురోజుల కిందట మొసలి కన్పించగా, గురువారం కొండచిలువ కనిపించినట్లు రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు ఆ ప్రాంతంలో పరిశీలించగా ముసలి, కొండచిలువ ఆనవాళ్లు కనిపించలేదు. రైతులు తాము తీసిన వీడియోలను అధికారులకు చూపించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని కూకట్లపల్లి బీట్ ఆఫీసర్ రమేష్ సూచించారు. సెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం

చినగంజాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమైన సంఘటన చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాలలో గురువారం జరిగింది. సోపిరాలకు చెందిన తుమ్మలపెంట జయరావుకు చెందిన రెండు ఎకరాలు, పల్లపోలు వెంకటేశ్వర్లులకు చెందిన రెండు ఎకరాల గడ్డి వాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. పక్కపక్కనే ఉన్న గడ్డివాములలో జయరావుకు చెందిన గడ్డివాము దగ్ధం కావడం చూసిన గ్రామస్థులు చీరాల ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందజేశారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. ఇటీవల ఎకరం గడ్డి రూ.20వేల చొప్పున కొనుగోలు చేసి గడ్డి వాములు వేశామని బాధితులు తెలిపారు. గడ్డివాములు పూర్తిగా దగ్ధం కావడంతో రూ.80వేలు నష్టం పోయామని, పశువులకు పశుగ్రాసం లేకుండా పోయిందని అన్నారు. సంఘటనా స్థలాన్ని గ్రామ రెవెన్యూ అధికారి ఆమంచి సత్యనారాయణ పరిశీలించారు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది



అంకమ్మతల్లి విగ్రహాన్ని తాకిన భానుడి కిరణాలు

అంకమ్మ తల్లి విగ్రహానికి సూర్యకిరణాభిషేకం

మార్టూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో అంకమ్మ దేవత శక్తి క్షేత్రంలో గురువారం ఉదయం అంకమ్మ తల్లి విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకాయి. ఏటా మార్చిలో అమ్మవారి విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకడం ఆనవాయితీగా వస్తున్నదని ప్రధాన పూజారి అళహరి పూర్ణచంద్రరావు తెలిపారు. ఆలయంలో ఈ దృశ్యాన్ని భక్తులు చూసి పరవశించిపోయారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



పార్టీ సభ్యత్వ కార్డులతో టీడీపీ నాయకులు

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను పార్టీ నాయకులు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సభ్యత్వ నమోదు కార్డులు యద్దనపూడిలోని పార్టీ కార్యాలయానికి చేరాయి. అక్కడ నుంచి వివిధ గ్రామాలకు చెందిన నాయకులు సభ్యత్వ కార్డులను తీసుకువెళ్లి కార్యకర్తలకు అందచేశారు. కార్యక్రమంలో నల్లపనేని రంగయ్యచౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, రావిపాటి సీతయ్య, గుదే తారకరామారావు, కొరిటాల వంశీకృష్ణ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర ఇవ్వాలని వినతి

ఇంకొల్లు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చి, రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ వెంకటరత్నంకు వినతిపత్రం అందజేసారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, ఈ ఏడాది రైతులు తీసుకున్న రుణాలను రద్దు చేయాలని, పొగాకు బోర్డును ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కలిపించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, మాదాల అంజియ్య, రైతులు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న జనసేన పార్టీ మార్కండేయులు, విజయ్, అరుణ, స్వాములు, కార్యకర్తలు

అభివృద్ధి పథంలో రాష్ట్రం

అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సభ్యుడు మార్కండేయులు

చీరాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పథంలో ముందకు సాగుతోందని, అందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విశేష కృషి చేస్తున్నారని జనసేన అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సభ్యుడు వడ్లాణం మార్కండేయులు, ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ అన్నారు. జనసేన రాష్ట్ర నాయకులు ఆమంచి స్వాములు గురువారం వేటపాలెం జాతీయ రహదారిలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానం సమీపంలో నియోజకవర్గ అధికారక పార్టీ కార్యాలయానికి భూమిపూజను నిర్వహించారు. పార్టీ నాయకులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కండేయులు స్వాములు సేవలను కొనియాడారు. అనుకోని రీతిలో స్వాములు పార్టీకి రాజీనామా చేసినట్లు చెప్తున్నా పార్టీ అధిష్టానం అంగీకరించలేదని చెప్పారు. అలాగే స్వాములు మాట్లాడుతూ సోషల్ మాధ్యమాల్లో డిప్యూటీ సీఎంపై చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. పిఠాపురంలో ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

నాణ్యత ఉంటేనే బిల్లుల చెల్లింపు

బల్లికురవ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల గ్రామాలలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల పనుల్లో నాణ్యతగా ఉంటేనే బిల్లులు చెల్లిస్తామని ఒంగోలు క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఈఈ ఎంవీ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముక్తేశ్వరం, గొర్రెపాడు, వెలమవారిపాలెం, కూకట్లపల్లి, ఎస్ఎల్ గుడిపాడు గ్రామాలలో ఇటీవల రూ.90 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు ప్రత్యేక మిషన్ ద్వారా తనిఖీలు చేశారు. పనుల్లో నాణ్యతను పరిశీలించారు. రోడ్లు బాగున్నాయని వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఏఈ సీహెచ్ శ్రీనివాస్, మండల పీఆర్ఏఈ మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంకొల్లులో రోడ్ల తనిఖీ

ఇంకొల్లు : ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్మించిన రోడ్లను గురువారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. ఇంకొల్లు సంతరావూరు రోడ్డు, గంగవరం ఆర్ అండ్‌బీ రహదారులు పూర్తిగా అధ్వానంగా మారాయి. దీంతో కూటమి ప్రభుత్వం రోడ్లకు మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణ చర్యలు తీసుకుంది. కాంట్రాక్టర్ చేపట్టిన రోడ్ల నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు డీఈ నాగేంద్రబాబు, జేఈ సుబ్రహ్మణ్యం, ఏఈ శ్రీకాంత్ పరిశీలించారు.

తిరునాళ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

చీరాల డీఎస్పీ మొయిన్




తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న చీరాల డీఎస్పీ మొయిన్

అద్దంకి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ 70 వ వార్షిక తిరునాళ్ల ఈ నెల 14వ తేదీన జరగనున్న నేపథ్యంలో అద్దంకి పట్టణంతోపాటు తిరునాళ్ల జరిగే ప్రాంతంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చీరాల డీఎస్పీ మొయిన్ అన్నారు. తిరునాళ్లకు స్వామి వారి దర్శనానికి వెళ్లే భక్తుల క్యూలైన్‌లు, ఎంట్రెన్స్ ఎగ్జిట్ ద్వారాలు, దర్శనం వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం దేవస్థానం ముందు, భవనాసి చెరువు కట్ట వద్ద, గోపాలపురం సమీపంలో ఏర్పాటు చేయనున్న వాహనాల పార్కింగ్ ప్రాంతాలలో పరిశీలించారు. ప్రధానంగా నామ్ రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు, అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో రద్దీ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తిరునాళ్లకు 700 మందితో పోలీస్ సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సీఐ సుబ్బరాజు, రూరల్ ఎస్సై రవితేజ తదితరులు ఉన్నారు.



ఉత్తమ రైతు పురస్కారాలు అందుకున్న రైతులతో కలెక్టర్ ఆనంద్, డీఏవో, ప్రకృతి వ్యవసాయం డీపీఎం

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
7

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 7 మార్చి 2025

ప్రకృతి వ్యవసాయానికి రైతులను ప్రోత్సహించాలి

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, ఆ దిశగా రైతులను, ప్రజలను ప్రోత్సహించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గురువారం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్-2025 అమలుపై సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు అవగాహన కల్పించి, భూమి సారవంతానికి అవసరమయ్యే నవధాన్య విత్తనాలను ఉత్పత్తి చేసి, రైతులకు సరఫరా చేసేలా తోడ్పాటు అందించాలన్నారు. పెరటి తోటల పెంపకంపై ఆసక్తి కలిగిన మహిళలను గుర్తించి వారికి విత్తనాలు. సాంకేతిక సహకారాన్ని అందించాలని తెలిపారు. మండల, గ్రామ స్థాయిలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ అమలుపై అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ఉపయోగాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తదుపరి ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులు వరలక్ష్మి, కళావతి, సుబ్బమ్మ, రామ్మోహన్, వెంగల్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయం డీపీఎం మాల కొండయ్య, డీఏవో పీ.సత్యవాణి, డీహెచ్‌వో సుబ్బారెడ్డి, ఏపీఎంఐడీ పీడీ శ్రీనివాసులు, డీఆర్డీఏ, వ్యవసాయశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి అమ్మవారిని వివిధ పరిమళ పుష్పాలతో అభిషేకిస్తున్న అర్చకులు

రాజరాజేశ్వరికి స్వర్ణోత్సవ పుష్పయాగం

ఓం చతుర్భుజే చంద్రకళావ్రతం సే కుచోన్నతే కుంకుమ రాగశోణే.... పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణ హస్తే నమస్తే నమస్తే జగదేకమాత..' అంటూ అర్చకుల వేద మంత్రాల మధ్య గురువారం రాత్రి నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి సుగంధ పరిమళ పుష్పాలతో వైభవంగా అభిషేకం జరిగింది. నగర నాయకిగా విరాజిల్లుతున్న రాజరాజేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ స్వర్ణోత్సవ (50 ఏళ్ల పూర్తి) వేడుకలు కనులపండువగా జరిగాయి. ఉదయం అమ్మవారికి విశేష నవావరణ పూజలు, పుష్పాలంకరణ జరిగాయి. సాయంత్రం ప్రత్యేకంగా వేసిన పుష్పవేదికపై రాజరాజేశ్వరి విగ్రహం ఏర్పాటు చేశారు. అనంతరం ఉభయదాతలకు ఆహ్వానం, గ్ర్యాహవచనం, గణపతి పూజ, వేదపఠనం, లలితా సహస్ర నామపారాయణంతో పుష్పయాగం నయనానందకరంగా సాగింది. భక్తులు సమర్పించిన పుష్పాలను అమ్మవారికి అభిషేకించారు. ఈ సందర్భంగా కుంభహారతులు, మంత్ర పుష్పం, నివేదన కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు రఘురామమూర్తి, వేద పండితులు రామకృష్ణమాచార్యులు, రవిశర్మ, ఇతర అర్చక బృందం నిర్వహించారు. ఉభయకర్తలుగా సన్నపురెడ్డి పెంచలరెడ్డి-పద్మావతమ్మ, వల్లూరు నిషాంత్‌రెడ్డి-స్వాతి, చెన్నూరు శశిధర్‌రెడ్డి-స్వప్న దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కే.జనార్దన్‌రెడ్డి,జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, దాల్‌మిల్ అసోసియేషన్ నాయకులు, వివిధ వాణిజ్య, సంఘాల ప్రతినిధులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉరకలేసి..
విజేతలుగా నిలిచి!

క్రీడల్లో సత్తా చాటిన మహిళా ఉద్యోగులు

నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగినులకు కాస్త ఆటవిడుపు లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం (ఈ నెల 8న) సందర్భంగా మూడురోజులపాటు ప్రత్యేక అనుమతి లభించడంతో వారిలో దాగిఉన్న క్రీడా ప్రతిభకు పదును పెట్టారు. ఉద్యోగినిగా, గృహిణిగానే కాదు.. క్రీడల్లోనూ తాము ఏమీ తీసిపోమంటూ ఉత్సాహంగా.. ఉల్లాసంగా తలపడ్డారు. తమలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసి వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నలిచారు. ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం మహిళా ఉద్యోగులకు ఉత్సాహంగా క్రీడాపోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి వెంకట శివారెడ్డి మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల్లో నూతనోత్సాహన్ని నింపేందుకు, మానసిక ప్రశాంతత కలిగేందుకు ప్రతి ఏడాది క్రమం తప్పకుండా క్రీడా పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మూడు రోజులు జరిగే ఈ క్రీడల్లో ఉద్యోగినులంతా ఉత్సాహంగా పాల్గొని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వి.సుజాత, అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ కె.శోభారాణి, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఆలపర్తి విద్యాసాగర్, మహిళా విభాగం చైర్‌పర్సన్ ఉదయగిరి చిన్నమ్మ, నిర్వాహక కార్యదర్శి జగదీష్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర రావు, జిల్లా అధ్యక్షుడు ఎం.పెంచలరావు తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)









త్రో బాల్ విసురుతూ..

మానులు.. మోడులై!

కంచే చేను మేసిందన్న చందంగా ఉదయగిరి అటవీ శాఖలో కొందరు ఉద్యోగుల తీరు విమర్శలకు తావిస్తోంది. గతంలో వరికుంటపాడు మండలం కనియంపాడు, విరువూరు ప్రాంతాలలో మొక్కలు నాటే క్రమంలో జరిగిన అవినీతి బాగోతం మరువకముందే మరో దందాకు తెరలేపారు. అడిగేవారు లేరన్న ధీమాతో కొంతమంది క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమార్కులతో చేతులు కలిపి తమ శాఖ పరిధిలోని జామాయిల్ చెట్లను నరికించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇదంతా తెలిసినా అధికారులు సైతం మౌనం వహిస్తున్నారన్న ప్రచారం జోరుగా నడుస్తోంది.

ఉదయగిరి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లోని అటవీ శాఖకు చెందిన వేలాది ఎకరాల్లో ఉన్న జామాయిల్ చెట్లు తరిగిపోతున్నాయి. ఎవరికీ ఎలాంటి అనుమానాలు రాకుండా టెండర్ల ప్రక్రియను సాకుగా చూపి అక్రమార్కులు వృక్షాలను నరికేస్తు న్నారు. అంతా నిబంధనల ప్రకారమే చేస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న అటవీ ఉద్యోగులు కొంతమేర టెండరుదారుడికి అప్పగించి మిగిలిన కర్రను గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల వరికుంటపాడు మండలం రామదేవులపాడు భూముల్లో సుమారు రూ. 50 లక్షల విలువైన జామాయిల్ కర్ర మాయమయినట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు తమ సిబ్బందిని కాపాడాలనే తాపత్రయంతో నామమాత్రపు విచారణ సాగించి చేతులు దులుపుకున్నట్లు గుసగుసలు వినిపి స్తున్నాయి. అలాగే దుత్తలూరు మండలం నందిపాడులోనూ అలాంటి భాగోతం బయటపడటంతో వీఎస్ఎస్ కమిటీకి కొంత నగదు అందజేసి విషయం బయటకు పొక్కనీయలేదు. అందులోనూ ఇదేమిటని ప్రశ్నించిన కొంతమంది వీఎస్ఎస్ సభ్యులను నయానో, భయానో తమకు అనుకూ లంగా మార్చుకోవడంతో అటవీ ప్రాంతాల్లో ఇంటి దొంగలు అక్రమంగా సాగించే అవినీతి వ్యాపారం బయటకు పాకే అవకాశం లేకుండా పోతోంది.

• ఉన్నతాధికారులు ఆరా తీస్తేనే..

అటవీ భూముల్లో ఆడిందే ఆట పాటిందే పాటగా మారుతున్న అవినీతి దందాపై శాఖాపరమైన ఉన్నతాధి కారులతో పాటు విజిలెన్స్, సీఐడీ అధికారులు సమగ్ర విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. అలాంటి వారిపై చర్యలు చేపట్టకపోతే భవిష్య త్తులో రూ. కోట్లు విలు వ చేసే ప్రభుత్వ సంపద కనుమరుగయ్యే ప్రమాదం ఉందని కొంతమంది వీఎస్ఎస్ సభ్యులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం బయటకు చెబితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని నోరు మెదిపేం దుకు భయాందోళనలతో వెనకడుగు వేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ఏదిఏమయి నప్పటికీ అక్రమార్కుల గుట్టురట్టు చేసి అవినీతి వ్యాపారానికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రామదేవులపాడులో కర్రను నరికివేయడంతో మోడుగా మారిన చెట్లు

• అటవీ శాఖలో ఇంటి దొంగల బాగోతం

చర్యలు చేపట్టాలి

నందిపాడు బీట్‌లోని 30 హెక్టార్లలో జామాయిల్ చెట్ల నరికివేతలో చేతివాటం ప్రదర్శించిన ఉద్యోగులపై చర్యలు చేపట్టాలి. ఏడాది క్రితం 34 లారీల కర్రను తరలించి రికార్డుల్లో మాత్రం కేవలం 16 మాత్రమే చూపిస్తున్నారు. అప్పట్లో లారీల నంబర్లు, స్లిప్పులు కూడా ఇవ్వకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశా. దీంతో తమ ఉద్యోగాలు పోతాయని కాళ్లా, వేళ్లా పడి బతిమిలాడుకున్న ఉద్యోగులు ప్రస్తుతం అంతా సర్దుబాటు చేసుకొని మీకు ఇష్టమైన చోట చెప్పుకోమని బెదిరింపులకు పాల్పడుతున్నారు. అప్పటి నుంచి వీఎస్ఎస్‌కు చెందాల్సిన నగదు కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

- పెంచల్ రెడ్డి, ఎస్సీ, బీసీ వీఎస్ఎస్ చైర్మన్, ఏపిలగుంట

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : 6.22
సహరి (శనివారం) : 5.06

రేపు జాతీయ లోక్ అదాలత్

నెల్లూరు (లీగల్), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి సీ. యామిని తెలిపారు. జిల్లా కోర్టులో గురువారం మధ్యాహ్నం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాజీకి యోగ్యమైన అన్ని రకాల కేసులను ఈ లోక్‌అదాలత్‌లో పరిష్కరిస్తారని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా భార్యాభర్తల కేసులు, సివిల్ తగాదాలు, క్రిమినల్, మోటార్ యాక్సిడెంట్, లేబర్ కోర్టు కేసులు వంటివి పరిష్కరిస్తారని ఆమె వివరించారు. ఈ సమావేశంలో ఐదవ అదనపు జిల్లా న్యాయాధికారి సరస్వతి, పోక్సో కోర్టు స్పెషల్ న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ, సీనియర్ సివిల్ న్యాయాధికారి కరుణ కుమార్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కే. వాణి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'కేదీ
ఉపశమనం!

• జాడలేని మెడికల్ కిట్లు, టార్పాలిన్ • మండుతున్న ఎండలతో కూలీల అవస్థలు

మండుతున్న ఎండలతో ఉపాధి కూలీలు తల్లడిల్లి పోతున్నారు. వేసవికి ముందే భానుడు మండిపోతున్నాడు. మధ్యాహ్నం 12 గంటలకే నగరం, పట్టణాల్లోని కూడళ్లు, వీధులు దాదాపు ఖాళీ అవుతున్నాయి. ఇలా ఉష్ణోగ్రతుల పెరుగుతున్నా 'ఉపాధి' కూలీలకు వసతులు కల్పించడలో అధికారులు చేతులెత్తేశారు. దీంతో మండుటెండలోనే కూలీలు చెమటలు చిందిస్తూ పనులు చేసి అలసిపోతున్నారు.

- ఉదయగిరి/వలేటివారిపాళెం (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సుమారు 2.78 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 4.38 లక్షల మంది కూలీలు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు సరాసరిన 44 వేల మంది ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. 2017-18లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కూలీలకు నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని విస్మరించింది. ఎండల తీవ్రత పెరుగుతుం డటం, కూలీల వద్ద కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో పనులు చేసేందుకు కూలీలు వెనుకంజ వేస్తున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతా లైన ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రి పాడు, అనంతసాగరం, ఆత్మకూరు, కొండాపురం, కలిగిరి తదితర మండ లాల్లో భూమి సైతం గట్టిగా ఉండటం, గడ్డపార దిగకపోవడంతో కూలీలు అధికంగా శ్రమించాల్సి వస్తుంది.

• జాడలేని కిట్లు, టార్పాలిన్

వేసవిలో కూలీలకు పని చేసే ప్రదేశంలో నీడ కోసం టార్పాలిన్ పట్టలు ఏర్పాటు చేయాలి. అలాగే పని చేసే సమ యంలో పొరపాటున గడ్డ పార తగిలి గాయమైతే ప్రథమ చికిత్స కోసం మెడికల్ కిట్లు అందుబాటులో ఉండాలి. అంతేగాక కూలీలకు మంచినీటి సౌకర్యం కల్పించాలి. నిబంధనల ప్రకారం ఒక్కో శ్రమశక్తి సంఘానికి ఒక టార్పాలిన్, మెడికల్ కిట్లు ఇవాల్సి ఉంది. ఒక్కో సంఘానికి ఇచ్చేది దేవుడెరుక అసలు ఏ ఒక్క పని ప్రదేశంలోనూ మెడికల్ కిట్లు, టార్పాలి న్ పట్టలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచి నీరు లేవు. దీంతో కూలీలు చెట్ల కింద సేద తీరుతు న్నారు.



ఎర్రని ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

చెట్టు లేని ప్రదేశంలో మండు టెండలోనే సేద తీరాల్సిన పరిస్థితి నెలకొంది. కూలీలు తమ ఇళ్ల నుంచే తాగునీరు బాటిల్‌లో తెచ్చుకుంటున్నారు.

• ఊసేలేని గడ్డపారలు

పనుల వద్ద కూలీలు మట్టి తవ్వేందుకు గడ్డపారలు లేవు. కూలీలే తమ సొంత డబ్బులతో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిబంధనల ప్రకారం 20 మంది కూలీలకు కలిపి ఒక శ్రమశక్తి సంఘాన్ని ఏర్పాటు చేసుకుంటే నాలుగు గడ్డపారలతో పాటు ఒక మెడికల్ కిట్, ఒక టార్పాలిన్ పట్ట ఇవ్వాలి. అయితే, ఇవేమీ ఇవ్వడం లేదు. ఇప్పటికైనా అధికారులు పని ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆదేశాలు జారీ చేశాం

ఉపాధి కూలీలు పని చేసే ప్రదేశంలో నీడ, నీటి సౌకర్యం కల్పించడంతోపాటు ప్రథమ చికిత్స బాక్సులు అందుబాటులో ఉంచాలని ఏపీవోలకు ఆదేశాలు జారీ చేశాం. వేసవి దృష్ట్యా కూలీలు పనులకు త్వరగా వెళ్లాలి. ఎండ ముదరకముందే ఇళ్లకు చేరుకుంటే మంచిది.

- గంగాభవాని, డ్వామా పీడీ

'ఉపాధి' భోక్తలపై
చర్యలేవీ!?

- వైసీపీ హయాంలో రూ.2.30 కోట్లు స్వాహా
- సామాజిక తనిఖీల్లో వెలుగులోకి..
- రికవరీలో రూ.51.80 లక్షల పెండింగ్
- అవినీతి సిబ్బందిపై చర్యలు శూన్యం

నెల్లూరు (జడ్పీ), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆకలి తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గత వైసీపీ హయాంలో కొంతమంది అధికారులు, సిబ్బంది భారీగా అవినీతికి పాల్పడ్డారు. 2019 నుంచి 2023వ సంవత్సరం వరకు జరిగిన పనుల్లో రూ.2.30 కోట్లు కొంతమంది సిబ్బంది తినేశారు. గత వైసీపీ హయాంలో జిల్లాలోని 37 మండలాల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి కొంతమంది ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్ట్, కంప్యూటర్ ఆపరేటర్లు అక్రమాలకు తెరలేపారు. ప్రతిరోజూ పనులకు వచ్చే వారికి మాత్రమే వారి బ్యాంకు ఖాతాలో కూలి జమ చేయాల్సి ఉంది. అయితే, కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఎక్కువ మంది కూలీలను లెక్కల్లో చూపి రానివారి కూలి నగదును తమ జేబుల్లో వేసుకున్నారు. అలాగే అలాగే చేసిన పనులకు కొలతలను తీసి దానికి చెల్లించాల్సిన మొత్తాన్ని కూలీలకు జమ చేయాల్సి ఉండగా కొంతమంది టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇంజనీరింగ్ కన్సల్ట్‌లు కుమ్మక్కై ఎక్కువ పని చేసినట్లు కొలతల్లో తేడాలు చూపెట్టారు. అలా ఎక్కువ మొత్తంలో కొలతలు చూపి ప్రభుత్వ సొమ్మును దిగమింగేశారు. వీరి అవినీతి వ్యవహారమంతా సామాజిక తనిఖీల్లో బయటపడ్డాయి. గత ఐదేళ్లల్లో రూ.2.30 కోట్ల మేర తినేయడాన్ని ఆడిట్ అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించి రూ.9.9 లక్షలు జరిమానా విధించారు. అయితే ఇందులో రూ.1.86 కోట్లను రికవరీ చేయగా రూ.51.80 లక్షలు ఇంకా పెండింగ్‌లో ఉంది. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో దుర్వినియోగం అయిన నిధులు రానంటున్నాయి. అలాగే అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులు, సిబ్బందిపై కఠినచర్యలు లేకపోవడంతో పేదల కడుపులు నింపాల్సిన ఉపాధి నిధులు యేటా దుర్వినియోగం అవుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పటిష్ఠ చర్యలు తీసుకుని అవినీతిపరులపై కఠిన చర్యలు చేపట్టి భవిష్యత్తులో అక్రమాలకు తావులేకుండా ఉపాధి నిధులు పేదలకే అందించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

లింగసముద్రంలో భూ బకాసురులు

- ప్రభుత్వ భూములు 8వేల ఎకరాలకుపైగానే..
- ఆక్రమణలకు గురైంది 2,500 నుంచి 3వేల ఎకరాలు
- 2012లోనే లెక్కతేల్చిన అధికారులు
- ఆక్రమిత భూముల్లో వాణిజ్య పంటల సాగు
- రూ. కోట్లు ఆర్జిస్తున్న కబ్జాదారులు

లింగసముద్రం, మార్చి6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ భూములను పలువురు దర్జాగా ఆక్రమించి, పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో అనాధీనం, గయాళు, మేత పోరంబోకు, పంచాయతీ గ్రేజింగ్, రోడ్డు పోరంబోకు భూములను ఆక్రమణకు గురయ్యాయి. కొన్నేళ్లనుంచి రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి సాగు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో మండలంలో రోజురోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి.

● నిగ్గు తేల్చినా... చర్యలేవి..?

2012లో ప్రభుత్వ భూములు ఆక్రమణలు ఎక్కువవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. వారి లెక్కల ప్రకారం సుమారు 8వేలకు ఎకరాల పైగానే ప్రభుత్వ భూములున్నాయని, వీటిలో సుమారు 2500ఎకరాల మేర ఆక్రమణలకు గురైనట్టు నిగ్గుతేల్చారు. ఆ భూముల్లో పలు పంటలు సాగుచేసినట్టు గుర్తించి, ఆక్రమణలను తొలగించేందుకు కబ్జాదారులకు నోటీసులిచ్చారు. తరువాత ఆక్రమణలను పట్టించు కోలేదు. ప్రస్తుతం 3వేల ఎకరాల వరకు ప్రభుత్వ భూముల ఆక్రమణలకు గురై ఉండొచ్చని భావిస్తున్నారు.

● ఖాళీగా కనిపిస్తే కబ్జానే..

లింగసముద్రం, పెంట్రాల, ఆర్ఆర్ పాలెం, మొగిలిచెర్ల, రాళ్లపాడు, పెదపవని, వెంగళాపురం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాల్లో యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరిగాయి. ముఖ్యంగా లింగసముద్రంలోని పంచాయతీ గ్రేజింగ్ భూములు మూడు నాలుగు వందల ఎకరాలు ఆక్రమణలు జరిగినట్టుగా భావిస్తున్నారు.అలాగే వెంగళాపురంలోని పంచాయతీలోని 155 ఎకరాల గ్రేజింగ్ భూములను పలువురు ఆక్రమించి, దర్జాగా బోర్లు వేసి పంటలు సాగు చేస్తున్నారు. మరికొందరు తిమ్మారెడ్డిపాలెం, కందుకూరు వారికి పంటల సాగుకు కౌలుకు ఇస్తుండడం గమనార్హం. అలాగే పెంట్రాలలో కూడా ఈ గ్రేజింగ్ భూములలో ఆక్రమణలు ఉన్నాయి.ఇక ఆర్ఆర్ పాలెంలో సర్వే నంబర్లు 242నుంచి 314 వరకు సుమారుగా 250 ఎకరాల ప్రభుత్వ అనాధీనం భూములు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. ఇక ముత్యాలపాడు రెవెన్యూ పరిధిలోని పెదపవనిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు 1500 ఎకరాలకుపైగా ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ గ్రామంలో ప్రభుత్వ భూములను ఆక్రమించడం, ఆ భూములకు అధికారుల నుంచి ఏదోవిధంగా ఒక ధ్రువపత్రం పుట్టించడం, ఎవరైనా అభ్యంతరం చెబితే కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకోవడం జరుగుతోంది.మండలంలో కొన్నేళ్ల నుంచి ప్రభుత్వ భూములు ఆక్రమణలు జరుగుతున్నా, అధికారులు వాటి వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. రాళ్లపాడులో కూడా ఇదే పరిస్థితి.అయితే చాలామంది ఈ భూములకు నకిలీ డీకే పట్టాలు, పాసు పుస్తకాలు సృష్టించి బ్యాంకుల్లో రుణాలు పొందినట్టుగా ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి ఆక్ర మణదారుల చెర నుంచి ప్రభుత్వ భూములను విడిపించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


వెంగళాపురం గ్రేజింగ్ భూముల్లో సాగు చేసిన కంది పైరు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

మండలంలోని ప్రభుత్వ భూముల్లో జరిగిన ఆక్రమణను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఆక్రమణలు చేపట్టిన వారిని పిలిపించి భూములు తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ప్రస్తుతం ఈ భూముల పంటలు సాగు చేస్తామని వాటిని దిగుబడులు తీసుకున్న అనంతరం ఖాళీ చేస్తామని వారు సమాధానం ఇచ్చారు. ఈ భూముల్లో బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

- సీతామహాలక్ష్మి,
తహసీల్దారు లింగసముద్రం

ధాన్యం కొనుగోళ్లపై పర్యవేక్షణ ఉండాలి

● కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



కావలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్యం కొనుగోళ్ల, పొలాలు ల్యాండ్ కన్వర్షన్ విషయంపై కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి గురువారం అసెంబ్లీలో గళం విప్పారు. ధాన్యం కొనుగోలు చేసే విషయంలో కోఆపరేటివ్ సొసైటీలకు అధికారాలు ఇస్తున్నందున రైతులు, సొసైటీల మధ్య సఖ్యత కొరడిందన్నారు. బస్తాలు సకాలంలో ఇవ్వడం లేదని. ఇచ్చిన మిల్లుల వద్ద తేమ శాతం ఎక్కువ ఉందని చెప్పి తరుగు తీస్తున్నట్లు తెలిపారు. ధాన్యం తూకాలు చేసిన అనంతరం బి ల్లులు ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యతో డబ్బులు ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. కనుక సివిల్‌సప్లయ్ ఉద్యోగులను నేరుగా రైస్ మిల్లుల వద్దకు పంపి అక్కడే తేమశాతం చూ సిబిల్లులు ఇచ్చేట్లు చూడాలని ఎమ్మెల్యే కోరారు.

రెండు చోట్ల ఫీజులు వసూలు సిస్టం సరిచేయాలి

పొలాలు విక్రయాలు జరుపుకునే సమయంలో రెండుచోట్ల ఫీజులు వసూలు చేసే ట్లుగా ఉన్న నిబంధనలను సరిచేయాలని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తెలిపారు. కొన్ని పొలాలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిట్ ఫార్ హౌస్‌సైట్స్ అని ఉండ టంతో వాటి రిజిస్ట్రేషన్ సమయంలో 7.5శాతం అదనంగా ఫీజు వసూలు చేస్తున్నారని వాపోయారు. ఈ పొలాలను వ్యవసాయేతర భూములకు మార్చుకునేందుకు ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తులు చేసుకుంటే మరలా అక్కడ కూడా ప్రభుత్వానికి ఫీజులు చెల్లించాల్సి ఉందన్నారు. దీనివలన ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా ఆ పొలాలు కొన్న వ్యక్తులు రెండు చోట్ల ఫీజులు చెల్లించాల్సి రావటంతో నష్టపోతున్నాట్లు చెప్పారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంతో ప్రభుత్వానికి అనేక రకాలుగా టాక్స్‌ల రూ పంలో ఆదాయం చేకూరే అవకాశం ఉన్నా రియల్ ఎస్టేట్‌ను ప్రోత్సహించేందుకు పొలాలకు రెండు చోట్ల ఫీజలు వసూలు చేయకుండా సరి చేయాలని రెవెన్యూ మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి అలగాని సత్య ప్రసాద్ రెవెన్యూ రికార్డులో అనేక మార్పులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారని ఈ సమస్య త్వరలో పరిష్కారం అవుతుందన్నారు.

భూ అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోండి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వహయాంలో కోట్ల విలువైన భూములను కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగా అన్యాక్రాంతం చేశారని, వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో భూ సమస్యలపై ప్రస్తావించారు. గత నెల 15న కందుకూరులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబునాయుడు దశాబ్దాలుగా రైతులకు పెనుసమస్యగా ఉన్న గర్భకం ద్రిక భూములు 1800ఎకరాలను రైతులకు పట్టాదారు హక్కులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవటంపై కృతజ్ఞతలు తెలిపారు. లింగసముద్రం మండలం పెదపవని సర్వే నెంబరు 439లోని గ్రామకంఠం భూ మిపై తప్పుడు పొజిషన్ సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని చెప్పారు. అది ముస్లిం కమ్యూనిటీకి చెందిన పీర్లచావిడి స్థలమని, రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని నాగేశ్వరరావు కోరారు. అలాగే పెదపవనిలో వైసీపీ జడ్పీటీసీ కుటుంబ సభ్యులు 7.89ఎకరాల ఈనాం స్థలంను భూ రికార్డులో ఎక్కించుకున్నారని, తక్షణం వాటిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లింగసముద్రం మండలం ఎర్రారెడ్డిపాలెం గ్రామకంఠం భూమి ఎం జోమెంటు భూమిగా రికార్డులో నమోదవటంతో రిజిస్ట్రేషన్లు జరగటం లేదన్నారు. దీనిపై రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన వాటిపై ఇప్పటికే కోర్టులో కేసు నడుస్తుందని, అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

బిట్రగుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం నాగులవరం- చెంచులక్ష్మీపురం గ్రామాల మధ్య గురువారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటరు బైక్‌పై ఉన్న నాగులవరం చెందిన పసుపులేటి వెంకబాబు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని వాహనదారులు గుర్తించి అతన్ని చికిత్సనిమిత్తం 108లో నెల్లూరుకు తరలించారు. కారులో వెళుతున్న ఏటీ.కంద్రికకు చెందిన మోజస్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మాకు యూనిక్ నెంబరు రాదా.. సంక్షేమ పథకాలు అందవా ?

- మండలంలో 700మంది డీకేటీ పట్టాలున్న రైతులు
- నెంబరు కేటాయింపునకు ఆన్‌లైన్ తీసుకోదంటున్న అధికారులు

వలటివారిపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నాయి. అన్నదాతలకు ఈ సంక్షేమ ఫలాలు అందిం చేందుకు ప్రస్తుతం వివిధ పద్ధతులను అవలంభిస్తున్నాయి. అయితే భవిష్యత్‌లో రైతులకు అందజేసే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పంటల బీమా, సబ్సిడీ పరికరాలు, పంటల నష్ట పరిహారం, ఎరువుల రాయితీ, కనీస మద్దతు ధర తదితర పథకాలను ప్రత్యేక కార్డు ద్వారా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. అందుకోసం అర్హులైన ప్రతి రైతుకూ ఆధార్‌కార్డు తరహాలో వ్యవసాయశాఖ ద్వారా 14అంకెల యూనిక్ ఐడీ కేటాయిస్తుంది. అయితే ఇప్పటివరకు సొంత పట్టాలు భూములున్న రైతుల వివరాలను మాత్రమే నమోదు చేస్తున్నారు. కానీ డీకేటీ పట్టాలున్న రైతుల వివరాలు నమోదు చేయడం లేదు. ఇందుకు ఆన్‌లైన్‌లో అనుమతించడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో డీకేటీ పట్టాలు కలిగిన రైతులు తమకు పథకాల నిధులు, పరిహారం అందుతాయో లేదో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సొంత పట్టాలకే నమోదు..

మండలంలో 21గ్రామ పంచాయతీల్లో 5,960మంది రైతులున్నారు. వారిలో 4,560మంది రైతులకు యూనిక్ నంబర్ కేటాయింపు నమోదు పూర్తి చేశారు. ఇంకా 7వందల మంది రైతులు వివరాలు నమోదు చేయాల్సి ఉంది. అయితే వీళ్ల కాకుండా 700మంది డీకేటీ పట్టాలున్న రైతులు యూనిక్ నంబర్‌ను నమోదు చేయడం లేదు. వ్యవసాయ అధికారులు గత 20రోజులుగా రైతుసేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేస్తున్నారు. డీకేటీ భూ ములున్న ఏ ఒక్క రైతు వివరాలు కూడ నమోదు చేసేందుకు అనుమతి లేదు. డీకేటీ పట్టాలు కలిగిన రైతులందరూ యూనిక్ ఐడీ కార్డు మాకు ఇవ్వరా? కార్డు ఉన్న వాళ్లకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందిస్తే మా పరిస్థితి ఏమిటని డీకేటీ పట్టాలు కలిగిన రైతులు చర్చించుకుంటు న్నారు.


పోలినేనిచెరువులో భూముల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

డీకేటీ పట్టాలకు అనుమతి ఇవ్వలేదు

సొంత పట్టాదారులకు సంబంధించి యూనిక్ ఐడీ కార్డు నమోదు 90శాతం పూర్తయ్యింది. డీకేటీ రైతులకు సంబంధించి ఆన్‌లైన్‌లో యూనిక్ నంబరు నమోదు అప్రూవల్ కావడం లేదు. త్వరలోనే అనుమతి వస్తుందని ఉన్నతా ధికారులు చెబుతున్నారు. అనుమతి రాగానే డీకే టీ పట్టాలు కలిగిన రైతులకు కూడా యూనిక్ ఐడీ నమోదు చేస్తాం.

- హేమంత్‌భరత్‌కుమార్,
ఏఓ, వలేటివారిపాలెం

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు..



కందుకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): 167బీ జాతీయ రహదారిలోని కందుకూరు సీటీఆర్ఐ సమీప బైపాస్ జంక్షన్ వద్ద గురువారం ఎదురుగా వస్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తూ వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. రోడ్డు మార్జిన్‌లోని బండరాళ్ల అడుకోవడంతో బస్సు పల్టీలు కొట్టకుండా ఆగటంతో పెనుప్రమాదం తప్పింది. కందుకూరు నుంచి ఒంగోలుకు వెళ్తున్న నాన్‌స్టాప్ బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి మార్జిన్‌లోకి వెళ్లిపోయ్యింది. రోడ్డుకు దిగువ నేలకు సుమారు 10అడుగుల ఎత్తులో బస్సు అదుపుతప్పటంతో పడిపోతుందని బస్సులోని 45మంది ప్రయాణికులు భయాందోళన చెందారు. మార్జిన్ బలహీనంగా ఉండటంతో బస్సు అదుపు తప్పిందని ఆర్టీసీ డ్రైవర్ మహేష్ తెలిపారు. అయితే జంక్షన్ కావటంతో హైవేలో కలిసే సర్వీస్‌రోడ్డుపై స్పీడ్‌బ్రేకర్లు వేసి ఉన్నారని బస్సువేగం తగ్గకుండా స్పీడ్‌బ్రేకర్లను తప్పించి అదేవేగంతో వెళ్లిపోయేందుకు డ్రైవరు ప్రయత్నించటం వల్లే బస్సు అదుపుతప్పిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. అనంతరం మరో బస్సులో ప్రయాణికులను ఒంగోలుకు పంపించారు.

దేవళ్ల మురళీకి ఎమ్మెల్సీ ఇవ్వాలి

కావలి టౌన్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళికి ఎమ్మెల్సీ ఇవ్వాలని వడ్డెర సంఘం జిల్లా కోఆర్డినేటర్ గుంజి నరేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయం వద్ద సమావేశంలో సత్యనారాయణ, న్యాయవాది ఇర్ల రమణయ్య పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కందుకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు గురువారం స్థానిక ఉప్పుచెరువు కాలనీలోని నిరుపేద వృద్ధురాలికి బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు కొణిజేటి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సర్వీస్ సెక్టార్లకు జీఎస్టీ పరిమితిని పెంచాలి

కావలి, మార్చి6(ఆంధ్రజ్యోతి) సర్వీస్ సెక్టార్ల కింద వ్యాపారాలు చేసే వారికి జీఎస్టీ పరిమితిని రూ.20లక్షల నుంచి రూ.40లక్షల వరకు పెంచాలని జీఎస్టీ గ్రీవెన్స్ రీడెరొసెల్ కమిటీ బోర్డు సభ్యులు, ఫెడరేషన్ ఆఫ్ ఆల్‌ఇండియా వ్యాపార మండలి జాతీయ కార్యదర్శి అమనా వెంకట సుబ్బారావు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. వైజాగ్‌లో గురువారం పెద్ద వ్యాపార వర్గాలు, బడా పారిశ్రామిక వేత్తలు, ఎగుమతుల, దిగుమతుల దారులతో పోస్ట్ బడ్జెట్‌పై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఇంట రాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న సుబ్బారావు వ్యాపారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

నాణ్యమైన రక్త పరీక్ష ఫలితాలివ్వండి

● జిల్లా సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు

లింగసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రోగులకు నాణ్యమైన పరీక్షల ఫలితాలను ఇవ్వాలని జిల్లా సహాయ మలేరియా అధికారి వి.నాగార్జునరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ల్యాబొరేటరీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రక్త పరీక్షల వివరాలు, ఫలితాలపై ల్యాబ్ టెక్నీషియన్ షేక్ షహనాతో ఆరా తీశారు. అనంతరం వైద్యాధికారి రమేష్‌తో రక్త పరీక్షల గురించి చర్చించారు. అలాగే ముత్యాలపాడు సచివాలయంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించి ఆరోగ్య కార్యకర్తలకు సూచనలిచ్చా రు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ దెబ్బకు జగన్ మైండ్‌బ్లాక్

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్

కావలి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దెబ్బకు జగన్ మైండ్ బ్లాక్ అయి ఫస్ట్రేషన్‌లో పిచ్చిగా మాట్లాడుతున్నాడని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఎద్దేవా చేశారు. గురువారం స్థానిక జనసేన కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 14న పిఠాపురంలో జనసేనాని పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున జరగనున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లాలన్నారు. పవన్‌కల్యాణ్ పట్ల జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పవన్‌కల్యాణ్ ప్రజలనుంచి పుట్టిన నాయకుడని, జగన్ తండ్రి వారసత్వంతో వచ్చిన నాయకుడని, జగన్‌కు ఒక ఛాన్స్ అయిపోయిందన్నారు. ఈ సందర్భంగా పార్టీ మత్స్యకారుల విభాగం కమిటీని ప్రకటించి అభినందించారు. కార్యక్రమంలో నేతలు, వీర మహిళలు, పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

కలిగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెడికల్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవంను గురువారం (ఏపీ హంస) వింజమూరు తాలూకా కార్యవర్గ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి, జిల్లా ఏపీ హంస అసోసియేట్ ప్రెసిడెంట్ కప్పా నారాయణరాజు, వింజమూరు తాలూకా కార్యవర్గ ప్రెసిడెంట్ ఎస్ చెంచురామయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.సాయిలక్ష్మి, సెక్రటరీ సక్కుబాయమ్మ, ట్రెజరర్ దొరసానమ్మ, ఎస్ తిరుపతిరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడి

కావలి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మన్నంగిదిన్నెలోని బెల్టుదుకాణంపై గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మద్యం అమ్మకాలు చేస్తున్న రావినూతల సాయిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 11మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

న్యూస్ బాక్స్

కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీసీ మహిళలకు ఉచిత కుట్టుశిక్షణతో పాటు కుట్టుమిషన్లు ఇవ్వనున్నట్లు ఆసక్తి ఉన్న బీసీ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ కె.అనూష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్జార్

లింగసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని పాలంకి లిఖిత, 8వ తరగతి విద్యార్థి పైడాల నవలోకేష్‌లు రూపొందించిన సైన్సు ప్రాజెక్టులు ఇన్‌స్పైర్ మనక్ జిల్లాస్థాయి కార్యక్రమంలో ఎంపికయ్యారు. గురువారం మోడల్‌స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్జార్ విద్యార్థులు, గైడ్ టీచర్లుగా వ్యవహరించిన ఎస్ అన్నపూర్ణ, ఎం.కళ్యాణిలను అభినందించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

వలేటివారిపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సునీత తెలిపారు. మండలంలోని నూకవరం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వార్షికోత్సవ కార్యక్రమంలో సునీత మాట్లాడారు. మహిళల హక్కులు, సమానత్వం సాధికారిత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహలపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్త ధనలక్ష్మి పాల్గొన్నారు.

పోలీసు విధులపై అవగాహన

కొండాపురం, మార్చి6 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులపై ఎస్ఐ ఎమ్.వెంకటరావు గురువారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికలకు అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్‌లో విధి విధానాలు, పోలీసుల విధులు అంశాలపై కూలంకషంగా వివరించారు. మహిళాదినోత్సవాల్లో భాగంగా బాలికలు లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత శిఖరాలను అధిరో హించాలన్నారు. చట్టాలపై అవగాహన పెం పొందించుకొని ఆకతాయిలు ఇబ్బందులు పెడితే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్లు ప్రతాప్, క్రిష్ణలు పాల్గొన్నారు.

సీడీపీవో విచారణ


మన్నంవారిపల్లెలో విచారిస్తున్న సీడీపీవో తదితరులు

కొండాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుఎర్రబల్లి పంచాయతీ మన్నంవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సీడీపీవో పద్మావతి విచారణ చేపట్టారు. గర్భవతులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకులు సక్రమంగా అందడం లేదని గ్రామానికి చెందిన కొందరు చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఫిర్యాదుదారులతో సీడీపీవో రాతపూర్వకంగా వివరాలు అందుకున్నారు. దీనిపై పూర్తివిచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

మైక్‌సెట్ వితరణ



కలిగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కుమ్మరకొండూరు జడ్పీ హైస్కూల్‌లో గురువారం పదో తరగతి విద్యార్థులు సరస్వతీదేవి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ పాల్గొని రూ.7 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను వితరణగా అందజేశారు. అనంతరం హిందీ పండిట్ సోమిశెట్టి మాధవీలత మాట్లాడారు. పది పరీక్షలో హిందీ సబ్జెక్టులో 90పైన మార్కులు తెచ్చుకునే ప్రతి విద్యార్థికి ఒక్కొక్కరికి రూ.1500లు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు విద్య అవసరం

బిట్రగుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో మహిళలకు విద్య ఎంతో అవసరమని కావలి ఐసీడీఎస్ ఏసీడీపీవో శారద అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో పాల్గొని నిరక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

9గంటల ఉచిత విద్యుత్‌కు ప్రత్యేక ఫీడర్ల ఏర్పాటు

● శ్రీనివాసులు, మండల విద్యుత్ శాఖ ఏఈ



ఉలవపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు పగటి పూటి ఏకధాటిగా 9గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు గ్రామాలతో సంబంధం లేకుండా ప్రత్యేక ఫీడర్ల ఏర్పాటుకు కూటమి శ్రీకారం చుట్టిందని మండల విద్యుత్‌శాఖ ఏఈ పువ్వాడి శ్రీనివాసులు తెలిపారు.

? నూతనంగా చేపట్టిన విద్యుత్ సంస్కరణలు ఏవి.

! కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు ఉచితంగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు జీవో ఇచ్చింది. వినియోగదారులకు వచ్చిన ఓటీపీతో ఏఈ లాగిన్‌తో రిజిస్ట్రేషన్ చేస్తాం. రిజిస్ట్రేషన్ అయిన గృహాలకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తాం. మండలంలో 3,650మంది ఎస్సీ ఎస్టీ లబ్ధిదారుల్లో 1,450 మందికి రిజిస్ట్రేషన్ పూర్తయింది.

? ఇతర లబ్ధిదారులకు వెసులుబాటు ఉందా?

! సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం బ్యాంక్ రుణాలు సౌకర్యం కల్పించింది. 2కిలో వాట్స్‌కు రూ.1.50 లక్షలు, 3కిలో వాట్స్ విద్యుత్ వినియోగానికి రూ.2.20లక్షలు ఖర్చవుతుంది. బ్యాంకర్లు రూ.1.98లక్షల రుణం మంజూరు చేస్తారు. మిగిలిన మొత్తం వినియోగదారుడు చెల్లించాల్సి వస్తుంది.

? సింగిల్ ఫేస్ సమస్యల గ్రామాల పరిస్థితి ఏంటి ?

! చాకిచర్ల, కే.రాజుపాలెంలో మునుపు సింగిల్ ఫేస్ సమస్యలుండేవి. నూతన ప్రభుత్వం చొరవతో 100 కేవీ ట్రాన్స్‌ఫా ర్మర్స్ చాకిచర్లలో 8, కే.రాజుపాలెంలో 3ఏర్పాటు చేసి త్రీ ఫేస్‌తో విద్యుత్ అందిస్తున్నాం.

? గ్రామాల్లో డ్యామేజ్ విద్యుత్ స్తంభాల పరిస్థితి?

! కరేడు, చాకిచర్ల, చాగొల్లు గ్రామాల్లో డ్యామేజ్ అయిన పోల్స్ స్థానంలో అంచనాల మేరకు భారీగా స్తంభాలను తెప్పించి పనులు మొదలు పెట్టాం. మన్నేటికోటలో రూ.4కోట్లతో నూతన సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించాం.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

లింగసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన పెద పవని-1,2, చినపవని సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ప్రజల అర్జీలను పెండింగ్‌లో ఉంచ వద్దని చెప్పారు. ఉన్నతాధికారులు అప్పగించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయా లన్నారు. అనంతరం ఆయన పెదపవనిలోని చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో బోరు వేయించారు. త్వరలో మండలంలోని చెత్త సంపద కేంద్రాలకు తడి,పొడి చెత్తను క్లాప్‌మిత్రలతో తరలించి అక్కడ తయారయ్యే వర్మీకంపోస్టు ఎరువును రైతులకు విక్రయిస్తామన్నారు. అన్ని పంచాయతీల్లోని చెత్త తరలింపు రిక్షాలను అందుబాటులోకి తెచ్చి గ్రామాలను చెత్తరహితంగా మార్చుతామన్నారు.

టెక్నోపల్స్ 2కే25 వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


ఆర్ఎస్ఆర్‌లో టెక్నోపల్స్ 2 కే 25 బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

బిట్రగుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం టెక్నోపల్స్-2కే 25 బ్రోచర్‌ను ఏవో ఆర్వీ రమణారెడ్డి ఆవిష్క రించారు. సాంకేతిక విద్య ప్రతిభ గుర్తిం చేం దుకు ఈ నెల 22నుంచి ఈ పోటీలను ప్రా రంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీవీ ఎన్ రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలకు రా మిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వెబ్ సైట్‌లో చూడవచ్చన్నారు. కార్యక్రమంలో టెక్నోపల్స్ కన్వీనర్ దిలీప్‌కుమార్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు ప్రారంభం

కొండాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గానుగపెంట గ్రామానికి గురువారం నుంచి సాయంత్రం కూడా బస్సు సౌకర్యం కల్పించినట్లు గ్రామ టీడీపీ యువ నాయకుడు కిలారి నరేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ఉదయం మాత్రమే బస్సు సౌకర్యం ఉండేదని సా యంత్రం వేళ విద్యార్థులు, పనుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లిన ప్రజలు బస్సు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే కాకర్ల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కావలి డిపో మేనేజరుతో మాట్లాడి కావలి నుండి కొండాపురం వరకు బస్సును నడిపించేందుకు చర్యలు తీసుకోవడం హర్షణీయం అన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్ తదితరులు

సహకార సంఘాలను పటిష్టపరచాలి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను పటిష్టపరిచి, సభ్యులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత సహకార రంగం ద్వారా ఇప్పటివరకు సాధించిన అభివృద్ధిని జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం విజన్ డాక్యుమెంట్‌లో సూచించిన విధంగా సహకార సంఘాలను బలోపేతం చేయాలన్నారు. కంప్యూటరీకరించిన వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో లావాదేవీలరె ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నిర్వహించాలని తెలిపారు. అర్హత కలిగిన అన్నీ పీఏసీఎస్‌ల్లో పెట్రోలు బంకులు, ఎల్పీజీ గ్యాస్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

● కరపత్రం ఆవిష్కరణ

సహకార సంస్థలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఎలా సహాయపడతాయో తెలియజేసేలా రూపొందించిన కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎన్ డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు, నాబార్డ్ డీడీఎం డాక్టర్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి సత్యవాణి, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు రారు.. ధాన్యం అమ్మరని కథలు చెప్పొద్దు

● అధికారులపై ఆర్డీవో ఆగ్రహం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆర్డీవో పావని

ఉదయగిరి, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రానికి రైతులు రారని.. ధాన్యం అమ్మరని తనకు కథలు చెప్పొద్దని ఆత్మకూరు ఆర్డీవో పావని సొసైటీ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని గుడినరవ గ్రామ రైతుసేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై చుట్టుపక్కల గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏ రైతు అయినా ధాన్యం కొనుగోలు చేయడంలేదని ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోసారి తాను తనిఖీకి వస్తానని, ఆ సమయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినా, ధాన్యం కొనుగోళ్లల్లో ప్రగతి కనిపించకపోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సమీపంలో ఉన్న సచివాలయం, హెల్త్ విలేజ్ క్లినిక్‌లను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మోచీ కులస్థుల కులధ్రువీకరణ పత్రాల మంజూరు విషయంపై వారితో చర్చించారు. ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తొలుత గన్నేపల్లి రెవెన్యూలో జరుగుతున్న భూముల రీసర్వేను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుభద్ర, డీటీ జహీర్‌ఖాన్, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి, సొసైటీ సీఈవో పోలయ్య, సర్వేయరు శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 28,593 మంది హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం మేథమేటిక్స్ బోటనీ, సివిక్స్ ఒకేషనల్ థియరీ పరీక్షలకు 28,593 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 28,376 మంది హాజరు కావాల్సి ఉండగా, 837 మంది గైర్హాజరు కాగా, 27, 539 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1399 మంది హాజరు కావాల్సి ఉండగా, 165 మంది గైర్హాజరు కాగా, 1234 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరుపై ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు ఏడు, డీవీఈవో ఐదు, డీఈసీ మూడు, ఫ్లైయింగ్, సిట్టింగ్‌స్క్వాడ్స్ 17 కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆర్ఐవో తెలిపారు.

రేపటి నుంచి ప్రజాచైతన్య యాత్రలు : సీపీఎం


నెల్లూరు (వైద్యం) (ఆంధ్ర జ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శనివారం నుంచి ఈనెల 17 వరకు నగ రంలో ప్రజా చైతన్యయా త్రలు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. గురువారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం చిన్నచిన్న సమస్యలు కూడా పరి ష్కరించటం లేదని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ యాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం సూపర్‌సిక్స్ నినాదా నికే పరిమితమయిందని, వాటిని అమలు చేయటంలో విఫలం అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిత్యసాధనతోనే పదిలమైన ఫలితం

● ప్రణాళికతోనే పరీక్షల్లో విజయం ● విద్యార్థులకు సబ్జెక్ట్ నిపుణుల సూచనలు

విద్యార్థి దశలో తొలి పబ్లిక్ పరీక్షలు పదోతరగతిలో ప్రారంభం అవుతాయి. విద్యార్థి భవిత కూడా ఈ పరీక్షలపైనే ఆధారపడి ఉంటుంది. పరీక్షల సమయం కూడా ఆసన్నమవుతుండటంతో ఉత్తమ ఫలితాల కోసం నిత్యసాధన చేస్తున్నారు. తొలి పబ్లిక్ పరీక్షలు కావడంతో విద్యార్థులు ఒత్తిడికి గురవడం సర్వసాధారణం. ఇప్పటివరకు చేసిన సాధన ఒక ఎత్తయితే ఇప్పటి నుంచి చేసే సాధన మరో ఎత్తు. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు జరిగే టెన్త్ పరీక్షలకు జిల్లాలో 33,434 మంది విద్యార్థులు హాజరవు తున్నారు. ఉన్న తక్కువ సమయంలో పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలి. ఏయే టాపిక్‌లకు అధిక ప్రాధాన్యమిస్తే ఎంతమేలు జరుగుతుంది.. ఎలా చదివితే మంచి మార్కులు వస్తాయన్న అంశాలపై సబ్జెక్ట్ నిపుణుల సూచనలు విద్యార్థుల కోసం..

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



మాతృభాషపై శ్రద్ధ వహించాలి



మాతృభాషే కదా అని తెలుగును తేలిగ్గా తీసుకోకూడదు. తెలుగుభాషను శ్రద్ధగా చదివితేనే మంచి మార్కులు సాధించేందుకు వీలవుతుంది. తెలుగు ప్రశ్నపత్రాన్ని స్వల్పమార్పులు చేసినా ప్రణాళికతో చదివితే నూటికి నూరు మార్కులు సాధించవచ్చు. గుండ్రటి లిపి కలిగి భాషాదోషాలు లేకుండా రాయాలి. పద్యభాగము నుంచి కవి పరిచయాలు, గద్యభాగం నుంచి ప్రక్రి యలు, ఉపవాచకం నుంచి పాత్రస్వభావం, పద్యభాగంలో పరచిత పద్యాలు, సృజనాత్మక ప్రశ్నగా లేఖ, కరపత్రము, అభినందనలు, ప్రశ్నావళి, సంభా షణ, పరచిత పద్యాలు, చందసస్సుకు వృత్యపద్యాలు నేర్చుకోవాలి. అలాగే ఉపవాచకంలో రామాయణ ప్రాశస్త్యం, సీతాపహరణ వృత్తాంతం, సీతాన్వేషణ వృత్తాంతం, వాలి-సుగ్రీవుల వైరానికి కారణాలు చదవుకోవాలి. కాండముల నుంచి వాక్యాలు ఇచ్చినపుడు సూక్ష్మాన్ని గ్రహించి ఆయా కాండముల పేర్లు రాయాలి. ఎస్‌సీఈఆర్టీ ఇచ్చిన అభ్యసన సామాగ్రిలోని మాదిరి పేపర్లను బాగా సాధన చేస్తే విజయం మీదే.

- అంబటి శ్రీనివాసులు, దామరమడుగు జడ్పీ పాఠశాల

ఇంగ్లిష్‌పై అవగాహన అవసరం



ఆంగ్ల ప్రశ్నపత్రంలో రీడింగ్ కాంప్రెహెన్షన్, క్రియేటివిటీ రైటింగ్ భాగాల్లో సమాధానాలు రాసేందుకు పాఠ్యాంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి. స్టడీస్కిల్స్, జంబుల్ సెన్టెన్సెస్ రాయడంలో అభ్యసనం ఎంతో అవసరం. గ్రామర్ విభాగంలో 18, 19, 20, 24, 25, 26 ప్రశ్నలు, పాఠాల్లోని సమాన అర్థపదాలు, వ్యతిరేకపదాలు చక్కగా నేర్చుకోవాలి. ఇన్ఫర్మేటివ్ ట్రాన్స్‌ఫర్ ప్రశ్నల తయారు చేయడంపై శ్రద్ధ వహిస్తే ఆంగ్లలో మంచి మార్కులు సాధించవచ్చు. క్రియేటివ్ రైటింగ్ కోసం లెటర్‌రైటింగ్, కన్వర్షన్, బయోగ్రఫీ, ఆటో బయోగ్రఫీ ప్రశ్నలకు సాధన చేయాలి.

- వీఎస్‌కె.శర్మ, దువ్వూరు

హిందీపై నిర్లక్ష్యం వద్దు..



ఏపీ ఎస్‌ఈఆర్టీ, డీసీఈబీ రూపొందించిన పుస్తకాలను ప్రణాళికా బద్ధంగా చదివితే హిందీలో మంచి మార్కులు సాధించవచ్చు. ప్రశ్నల సంఖ్య 1 నుంచి 12వరకు ఉన్న వ్యాకరణ అంశాలను పాఠ్యపుస్తకంలోని ఉదాహరణలతో ప్రాక్టీస్ చేయాలి. అపరచిత గద్య, పద్య అంశాలను జాగ్రత్తగా చదివి ప్రశ్నల్లోని పదాలను దృష్టిలో ఉంచుకుని పైన పేరాగ్రాఫ్‌లో ఆ పదాలను గుర్తిస్తూ అవగాహనతో జవాబులు రాయాలి. కవి పరిచయాల్లో కబీర్‌దాస్, మీరాబాయి కవి పరిచయాలు నేర్చుకోవాలి. కబీర్ కే దోహేల్‌లోని తొలి నాలుగు దోహాలలో ఒక ప్రశ్న ఖచ్చితంగా ఉంటుంది. అలాగే మనుష్యతా, కరచలే హమ్ ఫిదా, తతారా వామిరో కథ, కార్టూస్, హరిహరి కాక, సపనోంకే సే దిన్ పాఠాలలో నుంచి ప్రశ్నలు వస్తాయి. పద్యభాగ సారాంశంలో మీరాబాయికే పద్, పర్వత్ ప్రదేశమ్ పావస్ సారాంశాలు, గద్యభాగంలో బడేబాయి సాహెబ్, డైరీ కా ఏక్ పన్నా సారాంశాలు, లెటర్స్‌లో చుట్టిపత్ర్, పుస్తక్ విక్రేతా కేనామ్ పత్ర్, పితాకే నామ్ పత్ర్ వంటికి, నిబంధ్‌లలో దీపావళి, పర్యావరణ ప్రదూషణ్, వృక్ష హమారే సాథీ, స్వచ్ఛభారత్, కంప్యూటర్ అంశాలు కీలకమైనవి. వీటిని ఖచ్చితంగా సాధన చేయాలి.

- ఎన్.సంపత్ కుమార్, ఓట్టూరు జడ్పీ పాఠశాల

బయలాజికల్‌లో భయం విడనాడాలి



బయలాజికల్ సైన్స్‌పై భయం వీడాలి. తరగతిలో ఉపాధ్యాయుడు బోధించే సమయంలో నోట్సులో రాసుకున్న ముఖ్యమైన పాయింట్లను మరోసారి పరిశీలించుకోవాలి. జీవశాస్త్రంలో 50 మార్కులు సాధించాలంటే ప్రయోగాలు, పట్టికలు, బొమ్మలు బాగా చదవాలి. మొదటి మూడు పాఠాలలో ప్రయోగాలు బాగా నేర్చుకోవాలి. ప్రత్యుత్పత్తి పాఠంలో బొమ్మలు, ప్రశ్నలు బాగా ప్రాక్టీస్ చేయాలి. అనువంశికత పాఠంలో అవగాహన ప్రశ్నలు, పట్టికలు ఎంతో ముఖ్యమైనవి. పర్యావరణం పాఠం నుంచి నిత్యజీవిత అన్వయ ప్రశ్నలకు ఎక్కువ అవకాశం ఉంటుంది. అలాగే నినాదాలు, సూచనలు ప్రశ్నలు తయారు చేయడం వంటి అంశాల్లో సులభంగా మార్కులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వీటిని బాగా సాధన చేయాలి.

- ఎం.హరిబాబు, గంగపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల

గణితం.. చాలా సులభం



డైలీ అసైన్‌మెంట్ టెస్ట్(డీఏటీ)ల వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం పొందుతారు. గణితంలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారు. గణితం మొత్తం మీద పూర్తిగా 7 అధ్యాయాలలో పట్టు సాధించినట్లయితే సుమారు 60 మార్కులు పొందవచ్చు. వాస్తవ సంఖ్యలు, బహుపదులు, రెండు చరరాశులలో రేఖీయ సమీకరణాలు, అంకగణిత శ్రేణి, నిరూపక రేఖాగణితం, సాంఖ్యకశాస్త్రం, సంభావ్యత వీటిని పూర్తిగా నేర్చుకుని మిగిలిన అధ్యాయాల్లో ముఖ్యమైన ప్రశ్నలకు లెక్కలు నేర్చుకుంటే 80 మార్కుల పైగా సులభంగా సాధించవచ్చు. జవాబు పత్రం రాసే సమయంలో తొలుత ఒక సెక్షన్ ఎంచుకుని ఆ సెక్షన్ లోని వాటికి సమాధానాలు రాసిన తరువాతనే మిగిలిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. ఎస్‌ఈఆర్టీ మొడల్ ప్రశ్నాపత్రాలను కూడా పరిశీలించి వాటిని సాధన చేసి ఉత్తమ మార్కులు సాధించండి.

- జీ.శ్రీనివాసరావు, గండవరం జడ్పీ ఉన్నత పాఠశాల

సైన్స్‌తో అప్రమత్తంగా ఉండాలి



భౌతిక, రసాయన శాస్త్రంలో అధిక మార్కులు సాధించాలంటే సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఈ ఏడాది నూతనంగా రూపొందించిన పాఠ్యపుస్తకంలో భౌతికశాస్త్రం నుంచి 4, రసాయనశాస్త్రం నుంచి 4 అధ్యాయాలు కలిపి మొత్తం 8 అధ్యాయాలు ఉన్నాయి. ఈ ఏడాది 50 మార్కులకు ఉండే ప్రశ్నపత్రాపిరి 2 గంటల సమయం కేటాయిస్తారు. వీటిలో వ్యాసరూప ప్రశ్నలు, సంక్షిప్త సమాధానాలు, లఘు సమాధానాలు, అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు వస్తాయి. భాష్పీభవనం, మరుగుటకు భేదాలు, హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టి లోపాల సవరణ, ఎండమావులు, ఇంద్రధనస్సు ఏర్పడే విధానం, విద్యుత్‌మోటరు, ఏసీ, డీసీ జనరేటర్ పనిచేసే విధానం, క్వాంటం సంఖ్యలు, నూతన ఆవిష్కరణలు సాధన చేయాలి. అలాగే ఆమ్లాలు-క్షారాలు, పరమాను నిర్మాణం, లోహసం గ్రహణ శాస్త్రంపై పట్టు సాధించాలి. ఘన పదార్థపు విశిష్టోష్ణం కనుగొనుట, సాంఖ్యాంతరం, గాజులదిమ్మె, వక్రీభవన గుణకాలు, ఆమ్లాల రసాయన చర్యలు చదవాలి. భవిష్యత్‌లో ఇంజనీరింగ్, మెడిసన్ ఏ విభాగాల్లో ప్రవేశించాలన్నా భౌతికశాస్త్రం ఎంతో కీలకం.

- ఏవీ.సుధాకర్, పొదలకూరు జడ్పీ ఉన్నత పాఠశాల

సోషల్‌ను రెండు పార్ట్‌లుగా చదవాలి



సాంఘిక శాస్త్రాన్ని, జాగ్రఫీ, ఎకనామిక్స్ ఒక పార్ట్‌గా, హిస్టరీ, సివిక్స్ రెండో పార్ట్‌గా విభజించి చదవాలి. భారతదేశం, ప్రపంచ పటాలపై మ్యాప్ పాయింట్లను గుర్తిస్తే మార్కులు సులభంగా సాధించవచ్చు. బార్‌గ్రాఫ్స్, డయాగ్రమ్స్, టైమ్‌లైన్ చార్ట్‌లను సరిగా అర్థం చేసుకుంటే 8 నుంచి 12 మార్కులు పొందవచ్చు. భారతీయ భౌగోళిక స్వరూపాలు, శీతోష్ణస్థితి, గ్లోబలైజేషన్, సమతుల్య అభివృద్ధి చాప్టర్‌ల నుంచి 8 మార్కుల ప్రశ్నలు వస్తుంటాయి. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు దాని ప్రభావం, భారత రాజ్యాంగం, జాతీయోద్యమం, సామాజిక ఉద్యమాలు తదితర అంశాలు ఖచ్చితంగా చదివితే ఉత్తమ మార్కులు సొంతం చేసుకోవచ్చు. విద్యార్థులు సమాధాన పత్రంలో కొట్టివేతలు లేకుండా చేతిరాత స్పష్టంగా ఉండేలా చూసుకుంటే పూర్తిస్థాయి మార్కులు పొందవచ్చు.

- డాక్టర్ ఆరుమూళ్ల మాల్యాద్రి, కేఎస్ఆర్ఎం పాఠశాల

గురుకులంలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

● జిల్లా కన్వీనర్ రమణప్రసాద్



మాట్లాడుతున్న వీవీ రమణప్రసాద్

వెంకటాచలం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్న మహాత్మా జ్యోతి బాపూలే బీసీ బాల బాలికల గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ వీవీ రమణ ప్రసాద్ తెలిపారు. మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న బీసీ బాలికల గురుకుల పాఠశాలలో గురు వారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని దొరవారిసత్రం (బాలురు)-80 సీట్లు, కోట (బాలురు)-80, వెంకటగిరి (బాలురు)-40, గొలగమూడి (బాలికలు)-80, గూడూరు (బాలికలు) -40, నార్త్‌ఆములూరు (బాలికలు)-40, మహమ్మదాపురం, వెంకటాచలం (బాలురు)-40, ఆత్మకూరు(బాలికలు)-40 సీట్లు ఉన్నాయని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన వారు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

జిల్లాలో 300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

● ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్



వరి ధాన్యంను పరిశీలిస్తున్న ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్

కోవూరు, మార్చి6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికే 300 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించినట్లు ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. స్థానిక పడుగుపాడు సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో సమస్యలు లేకుండా జిల్లా అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు త్వరగా నగదు చెల్లిస్తున్నందువల్ల ఈ ఏడాది ఎక్కువగా సేకరించే అవకాశముందని చెప్పారు. గోనె సంచుల సమస్య తలెత్తకుండా జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరు బాగుందని చెప్పారు. వరి ధాన్యం కొనుగోలు సమయంలో తేమ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చిందన్నారు. పడుగుపాడు సొసైటీలో ధాన్యం కొనుగోలు చేసే సమయంలో తీసుకుంటున్న జాగ్రత్తల్ని సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి ఆయనకు వివరించారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు

నెల్లూరు(విద్య), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తూరులో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశానికి శుక్రవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ కే.శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 80 సీట్లు ఉన్నాయని, ఆర్‌టీఈ యాక్ట్ కింద 20 సీట్లు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ కల్పిస్తున్నామన్నారు. అర్హులైన విద్యార్థులు kvs online admisation. kvs.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 21 రాత్రి 10 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే పిల్లల వయసు మార్చి 31, 2025 నాటికి ఆరేళ్లు నిండి ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో పాటు ఇతరులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి
● చెన్నై సమీపంలో ఘటన ● మృతులు నెల్లూరువాసులు

నెల్లూరు (క్రైం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : చెన్నై శివారు ప్రాంతంలో గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరుకు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. నగరంలోని స్టోన్‌హౌస్‌పేటకు చెందిన ట్రాన్స్‌పోర్టు నిర్వాహకుడు సుధాకర్‌రెడ్డి కుమారుడు ఎర్రగుంట ధనిష్‌రెడ్డి (21) చెన్నైలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అలాగే నగరంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌కు చెందిన న్యాయవాది గుడుగుంట వేణుగోపాల్ కుమారుడు శ్రేయష్ (21) ధనిష్ రెడ్డి స్నేహితుడు. బుధవారం శ్రేయష్ తన స్నేహితులతో కలిసి చెన్నైలో ఉంటున్న ధనిష్‌రెడ్డిని కలిశారు. అర్ధరాత్రి వారంతా కారులో చెన్నై వైపు కిలాంబాక్కం బస్ టెర్మినల్ సమీపంలోని ఊరుపాక్కం వద్ద వస్తుండగా ముందు వెళుతున్న లారీ ఒక్కసారిగా ఆగింది. దీంతో కారు వేగంగా లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ధనిష్‌రెడ్డి, శ్రేయష్‌లు అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబసభ్యులు హుటాహుటిన చెన్నైకు వెళ్లారు. గురువారం రాత్రి మృతదేహాలను నెల్లూరుకు తీసుకువచ్చారు. చేతికి అందివచ్చిన కొడుకులు మృత్యువాతతో ఇరు కుటుంబంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి. బిడ్డల మృతదేహాలను చూసి కన్నవారు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	212
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8267
వెండి కిలో ధర	రూ. 99,300
వెండి ఒక గ్రాము	రూ.102.30

ధాన్యం కొనుగోళ్లపై మంత్రి నాదెండ్ల టెలికాన్ఫరెన్స్

● పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

నెల్లూరు (హరనాథపురం) మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని తెలుసుకునేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పౌర సరఫరాల సంస్థ ఎండీ సౌరభ్‌గౌర్ గురువారం విజయవాడ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్, జిల్లాలోని ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం అమ్మకాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో డబ్బులు చెల్లించకపోవడం, తేమ శాతాన్ని సాకుగా చెప్పిందన్నారు,కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని, వీటిని రైతులు వినియోగించుకునేలా అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ఇంకా పంట చేతికి రాలేదని చెప్పారు. చివరి ఆయకట్టు వరకు పండిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తక్షణ చెల్లింపుల గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో 24గంటల్లో తీసుకున్న ధాన్యానికి చెల్లింపులు గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తామన్నారు. రైతులకు ఏమాత్రం ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించడానికి అన్ని చర్యలు చేపడతామని ఆయన వివరించారు.



దాహార్తి తీర్చుకునేందుకు వానరం తంటా...

రోజురోజుకు ఎండలు మండుతున్నాయి. గుక్కెడు నీటి కోసం మూగజీవాలు పడరానిపాట్లు పడుతున్నాయి. గురువారం ఓ వానరం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎయిర్ కండీషన్ నుంచి పైపు ద్వారా వచ్చే వృథా నీటిని సేవించి దాహార్తి తీర్చుకోవడం స్థానికుల్ని ఆశ్చర్యపరిచింది.

- ఉదయగిరి(ఆంధ్రజ్యోతి)